ఆర్యచరిత్ర రత్నావళి

# కుమార హితచర్య

విరచితము

శ్రీ వావిలికొలను సుబ్బారావు

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

2025

# KUMARA HITACHARYA

By
**Sri Vavilikolanu Subbarao**

Editor
**Dr. Akella Vibhishana sarma**
Special Officer
Publications Division

T.T.D. Religious Publications Series No.1522
@ All Rights Reserved

First Edition : 2025

Copies : 200

Price :

Published by :
**Sri J. Syamala Rao,** I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati - 517 507

**D.T.P.**
Publications Division,
T.T.D, Tirupati

Printed at
**Tirumala Tirupati Devasthanam's Press**
Tirupati - 517 501

# ముందుమాట

తిరుమల తిరుపతి దేవస్థానం యాజమాన్యంలోని కోదండరామస్వామి ఆలయాలలో ఒంటిమిట్ట 'కోదండరామస్వామి' ఆలయానికి ఎన్నో ప్రత్యేకతలున్నాయి. పురాణ ప్రసిద్ధి, చారిత్రక నేపథ్యం, శిల్పకళానైపుణ్యం లాంటివి. ఉమ్మడిరాష్ట్రాల విభజన తరువాత శ్రీరామనవమి ఉత్సవాల నిర్వహణకు భద్రాచలానికి దీటుగా ఒంటిమిట్ట ఎంపిక చేయబడడం ఒక ప్రత్యేకత – ఈ దృష్టితో తి.తి.దే.వారు ఆలయాభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకొన్నారు. భక్తులకు విశ్రాంతి గదుల నిర్మాణం, యాత్రికులకు నిత్యాన్నదానపథకం, వైభవోపేతంగా ఉత్సవాల నిర్వహణలాంటివి. ఇంతేగాక గతంలో ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయోద్ధరణకు పరిశ్రమించిన వారి రచనలను కూడా పునర్ముద్రించడానికి తగిన సన్నాహాలు చేయడం.

ఈ కోవలో వావిలకొలను సుబ్బారావు రచించిన 'కుమార హితచర్యను' ప్రస్తుతం పాఠకులకు అందుబాటులో తీసుకురావడం ఒకటి.

యువతరం ధర్మదీక్షతో ముందుకు నడవాలని, చక్కని అలవాట్లు అలవరచుకోవాలని ప్రబోధించారు. విద్యార్జనపట్ల, ఆరోగ్య సంరక్షణపట్ల ప్రత్యేక దృష్టి వహించాలన్నారు. చిన్న చిన్న కథలతో, అవసరమయిన చోట అందమైన పద్యాల ఉదాహరణలతో, భాషాభిరుచి కూడా పెరగడానికి వీలుగా సామెతలతో గ్రంథరచన చేశారు. అంతేకాదు జనరల్ గ్రాంటు, డాక్టర్ ట్రాల్ మొదలయిన పాశ్చాత్య తత్త్వవేత్తల అమూల్యాభిప్రాయాలను (యథాతథంగా ఆంగ్లంలో) ఉటంకించారు. ఏ అంశం గురించి చెప్పినా నిబద్ధతతో, ప్రామాణికంగా, సర్వజన ఆమోదకరంగా రచన చేయడం వావిలికొలను వారి ప్రత్యేకత.

ఈ పుస్తకాన్ని నిర్దుష్టంగా ప్రచురించడానికి వీలుగా పరిష్కరణ బాధ్యత వహించి 'పీఠిక' రూపంలో ఒక సమీక్ష వ్రాసిన ఆచార్య కె. సర్వోత్తమరావు గారికి అభినందనలు. ఈ పుస్తకాన్ని పాఠక మహాశయులు ఆదరిస్తారని భావిస్తున్నాను.

*సదా శ్రీవారి సేవలో...*

**శ్రీకార్యనిర్వహణాధికారి**
తిరుమల తిరుపతి దేవస్థానములు,
తిరుపతి.

# నివేదన

తిరుమల తిరుపతి దేవస్థానంవారు ప్రాచీన గ్రంథాలకు వ్యాఖ్యానాలు వ్రాయించడమే గాకుండా సామాజిక హితంకోరేవారి ఆశయాల కనుగుణంగా గతంలో ప్రముఖ రచయితలచే రచింపబడ్డవి, పలుమార్లు తి.తి.దే. ద్వారా పునర్ముద్రణకు నోచుకొన్నవయిన గ్రంథాలను కూడా ముద్రించి ప్రాచుర్యం కల్పిస్తున్నది. ఈ కోవలోనే వావిలికొలను సుబ్బారావు (వాసుదాసు)గారి రచనల ముద్రణ చేబట్టింది. వాటిలో ప్రస్తుతం పాఠకలోకానికి అందిస్తున్న పుస్తకం 'కుమార హితచర్య'.

ఈ నేపథ్యంలో 'వాసుదాసు' గురించి పాఠకలోకానికి సంక్షిప్త పరిచయం చేయడం సబబని భావిస్తున్నాను.

వాసుదాసు గారి అసలు పేరు వావిలికొలను సుబ్బారావుగారు. 'వావిలికొలను' నైజాం ఏలుబడిలోని గ్రామం. ఈ పేరుగలవారు కడపజిల్లా జమ్మలమడుగులో కాలాంతరంలో స్థిరపడ్డారు. వీరిది పండితవంశం. కనకాంబ శ్రీరామచంద్రరావు దంపతుల రెండవ కుమారుడు వావిలికొలను సుబ్బారావు. తండ్రి మరణించగా పినతండ్రి లక్ష్మాజీరావు ఆశ్రయంలో, ప్రాపకంలో పెరిగినవారు. తన 20వ ఏట పొద్దుటూరి తాలుకాఫీసులో గుమాస్తా ఉద్యోగంలో చేరి రెవిన్యూ ఇన్‌స్పెక్టరుగా నౌకరీ చేశారు. తదనంతరం మదరాసులో హైందవోన్నత పాఠశాలలో, తదుపరి ప్రెసిడెన్సీ కళాశాలలో 16 సంవత్సరాలు ఆంధ్రోపన్యాసకులుగా పనిచేశారు. పోతనను, రామదాసును ఆదర్శంగా తీసుకొని శ్రీరామచంద్రుని ఆరాధనతో, సాహిత్యసేవతో జీవితాన్ని పండించుకొన్న వాసుదాసుగారు 1.8.1936లో తనువు చాలించినా ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయానికి చేసిన సేవా, భక్తితత్పరతతో చేసిన కృషివల్ల, రచనలవల్ల నేటికీ లోకంలో కీర్తింపబడుతున్నారు.

వాసుదాసుగారు శ్రీభారతి, భక్తసంజీవని అనే రెండు పత్రికలకు సంపాదకత్వం నిర్వహించారు. శ్రీసుబ్బారావుగారు 50 పైగా రచనలు చేశారు. ప్రక్రియాపరంగా వాటిని పద్యరచనలు, వచన రచనలు, నాటకాలు, దండకాలు, గేయాలని వర్గీకరించవచ్చు. పద్యరచనలో కూడా కావ్యాలు, శతకాలు, ద్విపదకావ్యాలున్నాయి. మన్మథుని వృత్తాంతాన్ని శ్రీకుమారాభ్యుదయం పేర రచించారు. ఈ నామకరణంలోనే పాండిత్య పటిమ గోచరిస్తుంది. (శ్రీకుమారాభ్యుదయం... కుమారాభ్యుదయం, మారాభ్యుదయంగా వింగడించవచ్చు) ఇది ప్రౌఢ ప్రబంధం.

వాసుదాసుగారి రచనల్లో ప్రసిద్ధి వహించినది శ్రీమద్రామాయణ అనువాదం. 24 వేల శ్లోకాలను 24 వేల పద్యాలుగా రచించడం విశేషం. సుప్రసిద్ధ పండితులు వాసుదాసుగారిని 'ఆంధ్రవాల్మీకి'గా, అతని రచనను 'ఆంధ్రవాల్మీకి రామాయణం'గా పండితులు ప్రశంసించారు. ఈ మహాకావ్యం ఒంటిమిట్ట కోదండరామస్వామికి అంకితం. రచన చేయడమే గాకుండా 'మందరం' పేరుతో తన రచనకు వ్యాఖ్యానం కూడా చేశారు. ఇది సనాతన భారతీయ ఆర్షవైభవాన్ని ఆవిష్కరించిన రచన కావడం విశేషం.

వాసుదాసుగారి రచనలో ప్రసిద్ధం 'టెంకాయచిప్ప శతకం' టెంకాయ చిప్పను చేతబట్టుకు దేశమంతా తిరిగి ఒంటిమిట్ట ఆలయాభివృద్ధికి పాటుపడిన మహనీయులు వాసుదాసు గారు.

వాసుదాసుగారు ప్రౌఢగ్రంథాలే గాకుండా బాలబాలికలకు నీతిని బోధించడంకోసం వ్రాసిన పుస్తకాలు 8. ఇవి 1973 నాటికే 18 సార్లు ముద్రింపబడ్డాయి. వాటిలో కుమారహితచర్య, కుమారీ హితచర్య, పతిహితచర్య, సతీహితచర్య, గర్భిణీహితచర్య, వైధవ్యధర్మచర్య ప్రసిద్ధాలు. అంతేకాదు పోతన భాగవతంలోని ప్రసిద్ధ ఘట్టాలలోని కొన్ని ముఖ్యమయిన పద్యాలతో సంకలన గ్రంథాలు సమకూర్చారు.

ఒంటిమిట్ట వైభవాన్ని అందరికి అవగతమయ్యేలా వాసుదాసుగారు శ్రీమదొంటిమిట్ట కోదండరామ మాహాత్మ్యం రచించారు. ఈ రచనలో పురాణకథలు, మాల ఓబయ్య, రామభద్రుడు, బమ్మెరపోతనలాంటి చారిత్రక పురుషుల చరిత్రలున్నాయి.

వాసుదాసుగారు సంప్రదాయసాహిత్యం, సంప్రదాయ భారతీయ విద్యావిధానం పట్ల మమతగలవారు. ఈ దృష్టితో ఆర్షవిద్యోపన్యాసములు, స్తుతిత్రయం, వాసుదాసుకీర్తనలు లాంటి రచనలు చేశారు.

కవిగా, పండితుడుగా, విమర్శకుడుగా, ఆలయోద్ధారకుడుగా, అశేషజనావళి స్తుతి సౌమ్యుడుగా జీవించిన వాసుదాసుగారి జీవితం చిరస్మరణీయం.

**– డా॥ ఆకెళ్ళ విభీషణశర్మ**

# పీఠిక

'ఒంటిమిట్ట' అనగానే అక్కడి ప్రాచీన వైష్ణవాలయం ఆస్తికులకు వెంటనే గుర్తుకు వస్తుంది. ప్రత్యేకించి ఉమ్మడి రాష్ట్రాల విభజన జరిగాక శ్రీరామనవమి ఉత్సవాల నిర్వహణకు 'ఒంటిమిట్ట'ను ప్రభుత్వం ఎంపిక చేయడంతో అక్కడి ఆలయప్రతిష్ఠ పెరిగింది. అంతేగాక తిరుమల తిరుపతి దేవస్థానం ఒంటిమిట్ట సర్వతోముఖాభివృద్ధికి సహకరించడంతో భక్తులు పరవశులవుతున్నారు. ఇవన్నీ నేటి తరానికి అనుభవంలోని అంశాలు.

ఒంటిమిట్ట ఆలయాభివృద్ధిని తన ధ్యేయంగా భావించి త్రికరణ శుద్ధిగా కృషిచేసిన వావిలకొలను సుబ్బారావు కైంకర్యం బలవత్తరమయినదిగా నేటికీ గుర్తింపబడుతున్నది. కేవలం ఆలయ అభివృద్ధికోసం శ్రమించడమే గాకుండా ఆర్షవాఙ్మయప్రచురణలో, ప్రచారంలో వారి కృషి అనన్య సామాన్యం.

ఇటీవల శ్రీమదొంటిమిట్ట కోదండరామస్వామి ఆలయం తి.తి.దేవస్థానముల పాలనలోకి వచ్చాక ఆ ఆలయానికి చెందిన సాహిత్యమైన వాసుదాసుగారి సాహిత్యాన్ని తి.తి.దే. స్వీయ ప్రచురణగా స్వీకరించి ముద్రిస్తున్నది.

ప్రస్తుతం తి.తి.దే.వారు 'ఆర్యచరిత్ర రత్నావళి' 'కుమారహితచర్య' వంటి దాదాపు 15 గ్రంథాలు ముద్రిస్తున్నది.

వాసుదాసు స్వామివారు ఈ పుస్తకాన్ని 'పరోపదేశం' కోసం వ్రాయలేదు. తన బంధువయిన రుక్మిణమ్మ, రంగన్నలకోసం వ్రాశారు. తనవారు ముందు ఆచరిస్తే ఇతరులు కూడా ఆచరిస్తారనే విశ్వాసం వాసుదాసు స్వామి వారికుండడం విశేషం. వేదాంత విషయాల చర్చలకు అవకాశం ఇవ్వకుండా బాలురు తమతోడివారితో మెలగేవేళ ఏ ఏ అంశాలలో జాగ్రత్తపడాలో ఈ గ్రంథంలో సమగ్రంగా చర్చించారు. ఆరోగ్యకరమయిన

అలవాట్లను ప్రబోధించారు. వివిధ వృత్తుల వారిని తక్కువ చేయరాదని వృత్తిగౌరవాన్ని గుర్తించాలన్నారు. యౌవనావిర్భావదశలో ఏయే అంశాలపట్ల జాగ్రత్త వహించాలో సుదీర్ఘంగా చర్చించారు. చెడును ఏనాటికిని సమర్థించుకోరాదని హితవు పలికారు. దురలవాట్లకు లోనుచేసే స్నేహితులను తొలిదశలోనే దూరంగా పెట్టాలన్నారు. ఆరోగ్యకరమయిన అలవాట్లను సూచించారు.

ఇలాంటి ప్రబోధాలు చేసేవేళ వాసుదాసుస్వామివారు చిరుకథలను జోడించారు. ప్రసిద్ధ పద్యాలను ఉదహరించారు. సంస్కృత ఆంధ్రకవుల శ్లోకాలను, పద్యాలను తగినంతమట్టుకు ఉటంకించారు. తాను తన కాలంనాటి సరళగ్రాంథికంలో రచన చేసినా, బాలుర మాతృభాషానురక్తి పెంచడానికోసం రచనలో సామెతలు పొందుపరచారు. ఎన్నో సూక్తులను స్మృతికి తెచ్చారు. మచ్చుకు.

కూత లార్భాటమే గాని కుప్పలో గింజ నులియదు.

తలయెత్తు ధనము పోసినను తల్లివంటి దాసిరాదు. అరువది లక్షల వరహాలిచ్చినా అత్తవంటి తొత్తురాదు.

మొక్కలో వంగని చెట్టు మ్రానైన వంగదు.

అధికారాంతమునందు చూడవలదా మాయయ్య సౌభాగ్యముల్

దున్నక విత్తిన గోయక పండును.

వావిలికొలను సుబ్బారావుగారి వాక్యాలు చిన్నవయినా ముచ్చటగా ఉంటాయి. మచ్చుకు –

భార్య సత్ప్రవర్తనము గలిగియున్నప్పుడు భర్తయును సత్ప్రవర్తనము కలిగి ప్రవర్తించిననే యది సంసారమను పేర బిలువదగియుండును.

అన్నము తినిన ఁగడుపు నిండునా?

అన్నరాశిని బ్రశంసించినంతమాత్రమున ఁగడుపునిండునా?

ఆరోగ్యవంతుఁడే భోగి. ఆరోగ్యవంతుఁడే ధనవంతుఁడు. ఆరోగ్యవంతుఁడే సుఖవంతుఁడు.

నీ దేహమునకు నీవు బానిసవుగాదనియు నీ దేహమే నీకు బానిసయనియు నిమిషమైన మఱవకుము.

ఏ పనిపెట్టి మనస్సును సోమరిగా నుంచుటకంటె పనిని మార్చుటచే దానికి విశ్రాంతి కలిగించుట చాల మేలు.

మిత్రుఁడు విరోధించెనేని శత్రువుకంటె నెక్కువ కీడు చేయును.

అల్పకార్యముల నలక్ష్యపఱుపకుము. ఆవగింజలు చేరిన గుమ్మడికాయయంతయగును.

ఈ పుస్తకం కౌమారదశలోనివారికే గాక తమ పిల్లలను తీర్చిదిద్దాలనుకొనే పాఠకులకందరికి 'కరదీపిక'.

ఈ పుస్తకపఠనంతో బాలురకు సరళగ్రాంథిక పరిచయం, నైతికాంశాలు, జాగరూకత అలవడుతాయనడంలో సందేహం లేదు. గతంలో ముద్రించిన 'కుమారహితచర్యను' పునర్ముద్రించాలని నిర్ణయించి సరళభాషలో నివేదన వ్రాయవలసిందిగా కోరిన తి.తి.దే. వారికి నా నమస్కృతులు.

**– కె. సర్వోత్తమరావు**

# విషయసూచిక


| | | |
|---|---|---|
| | ముందుమాట | iii |
| | నేపథ్యం | v |
| | నివేదన | ix |
| 1. | చక్రవర్తి పుత్రుల కథ | 1 |
| 2. | గమ్యస్థానం చేరడానికి సలహాలు | 7 |
| 3. | పరమాణుకమునకు గల గుణత్రయం | 10 |
| 4. | కౌమారంలో గమనింపవలసినవి | 14 |
| 1. | కాలము | 21 |
| 2. | చదువు విధము | 24 |
| 3. | అభ్యాసము | 29 |
| 4. | సంభాషణములు | 37 |
| 5. | వినయము – మర్యాద | 40 |
| 6. | బలము | 45 |
| 7. | ప్రాణము | 47 |
| 8. | బ్రహ్మచర్యము | 68 |
| 9. | మంచిగుణములు | 86 |

శ్రీరామాయనమః

ఆర్యచరిత్ర రత్నావళి

## **కుమార హితచర్య**

## I

చి॥ రంగన్నను దీ॥ దీ॥ నీ భార్య చి॥ సౌ॥ రుక్మిణమ్మ పేర నేను వ్రాసిన యుత్తరమును జూచి, నీవు వ్రాసిన యుత్తరమును జదివి చాల సంతోషించితిని. దానిలో నేను వ్రాసిన యుత్తరమును గుమారీ హితచర్య యని పేరుపెట్టి మీకక్కగారు ప్రకటింప నుద్దేశించి యున్నారని వ్రాసితివి. అది లోకమున కుపయోగపడఁ గలిగిన నాకును సంతోషమే. ఆఁడుపిల్లలు నడచుకొనవలసిన పద్ధతులు మీ పుత్రికకు వ్రాసినట్టు మేము నడచుకొనవలసిన పద్ధతులు నాకు వ్రాసిపంపుఁడని కోరితివి. నీకోరిక మంచికోరిక. ఆ కోరిక నీవు బాగుపడఁ గలవాఁడవనుటకు సూచనగా నున్నది. మంచికోరిక గలవాఁడు మంచికార్యములే చేయును. భార్యసత్ప్రవర్తనము గలిగియున్నప్పుడు భర్తయును సత్ప్రవర్తనము కలిగి ప్రవర్తించిననే యది సంసారమను పేరఁ బిలువఁ దగియుండును. సంసార శకటమును లాగుటకు భార్యాభర్తలు రెండు వృషభములు. రెండును సమానముగ లాగిననే బండి సురక్షితమై సాగునుగాని, యే యెద్దు దుష్టమైనను ఈడిగిలఁబడినను బండి గతి యేమి? కాఁబట్టి నీ భార్యకు నేను హితముఁ దెలిపినపుడు నీకును హితము దెలుపుట నీ మేలుకోరు నాకుఁ దగినకార్యమే. నేను వ్రాసిన ప్రకారము నీ భార్య నడుచు కొనుచున్నదని వ్రాసితివి. సంతోషము. అట్టులే నీకు వ్రాసినప్రకారము నీవు నడుచుకొనుటకుఁ జాలినంత యోపికయు, బుద్ధిస్థైర్యము, వివేకము నీకు నొసఁగునుగాక! యని దైవమును బ్రార్థించుచున్నాను.

నీ వీవయస్సునకు రాకముందుఁ జిన్నవయస్సున నుండితివి కదా! అప్పుడున్న దేహమే యిప్పు డభివృద్ధియై యున్నది. ఇంకను అగుచున్నది

యని తెలియును గదా! అప్పుడు నీయం దే సుగుణములు దుర్గుణము లుండెనో వానిని నీవు మార్చుకొనకుండిన నిప్పటికి నవి నీయం దుండవలయు ననుట స్వభావమే కదా! కాఁబట్టి యిప్పటి నీ స్థితి నీ చిన్నప్పటి స్థితినిబట్టి యున్నదని నీ యిప్పటి స్థితినిబట్టి రాఁబోవు స్థితి యుండునని మఱవకుము.

నీవు చిన్నప్పు డుండవలసిన స్థితి నేను నూతనముగఁ గారణాంతరమున వ్రాసిన బాలక హితచర్యఁ జదివి తెలిసికొనుము. దానిలోఁ జెప్పిన నడవడులకు భిన్నముగ నీనడవడులుండిన సవరించుకొనుటకు వెంటనే ప్రారంభింపుము. ఆ పుస్తకము బాలురకుఁ గదా నా కేల యని యశ్రద్ధ చేయకుము. బాలురనఁగా వయస్సునందు మాత్రమే కాక జ్ఞానమునందును చిన్నవాండ్రని యర్థము. ఏండ్లు చాలనుండినను జ్ఞానము లేదేని వారు పిల్లవాండ్రే యని నమ్ముము. నాయనా! పుస్తకమును జదివి బాగున్నదని యూరలఁ బెట్టినఁ బ్రయోజనము లేదు. అటు జేయుటవలన బాగుపడవు. ఆ ప్రకారము నడచుకొనిననే బాగుపడుదువు. అన్నము తిననిఁ గడుపు నిండునా? అన్నరాశిని బ్రశంసించి నంత మాత్రముననఁ గడుపునిండునా?

నీ భార్యకు వ్రాసిన యుత్తరమును జక్కఁగ గమనించితివేని యందు భార్యనడచుకొనవలసిన రీతి వ్రాయలేదనియుఁ గౌమారమందుండు స్త్రీ నడచుకొనవలసిన విషయములు మాత్రమే వ్రాసితిననియుఁ దెలియఁగలవు. ఏల? మీకింకను నిషేకముహూర్తము కాలేదు. కనుక నీ వింకను విద్యార్థి దశయందు బ్రహ్మచర్యాశ్రమముననే యున్నవాఁడవు. కనుక నీకును కుమారదశయం దుండువానికిఁ దెలియఁదగిన విషయములే చెప్పెదను. తరువాతి విషయము తరువాతఁ జెప్పెదను.

నీవు బాలక హితచర్య చదివి తూఁగుఁబోతుతనము తిండిపోతుతనము లోనగు దుర్గుణములు మానుకొనక యుండినను, మానుకొన

నిష్టములేకున్నను, నీ వీ యుత్తరమును జదువ వలసిన పనిలేదు. దీనిని నీవు చదువు శ్రమము వ్యర్థము కాఁబట్టి యావలఁ బాఱవేయుము. అటుగాక నీ యంతఃకరణ శుద్ధిగా నీయం దా దుర్గుణములు లేవని తోఁచినను గొంచెముగా నుండినను వానిని మాన్పుకొన దృఢప్రయత్నము చేయుచున్నను దీనిని జదువుము.

బాలురకు ముఖ్యముగా నారోగ్యమును గాపాడుకొను విషయము దెలియవలయును గనుక ఆ పద్ధతులు బాలక హితచర్యయందుఁ జెప్పితిని. ఆరోగ్యవంతుఁడే ధనవంతుఁడు. ఆరోగ్యవంతుఁడే సుఖవంతుఁడు. ఆరోగ్యవంతుఁడే భోగి. వాఁడే బలవంతుఁడు. తక్కిన వెన్నియుండినను ఆరోగ్యమొక్కటి లేకుండిన వ్యర్థము. కావున దానిని గాపాడుకొనుట కుపేక్షింపకుము.

నీ వింటియజమానుఁడ వనుకో. వంటవాఁడు, నీళ్ళవాఁడు, దొడ్డి యూడ్చువాఁడు వీరందఱు నీ యాజ్ఞకు లోపడి ప్రవర్తించిన నీ యిల్లెట్లుండునో, నీ మాట వారు వినక వారి యిష్టప్రకారము వర్తించుచుండ వారి యిష్టప్రకారము నీవు నడచుకొనఁ బూనిన నెట్లుండునో, నీది యెంతటి నిర్భాగ్యపు బ్రతుకో యాలోచింపుము. కాఁబట్టి నీ సంసారము బాగుండవలయు ననిన భార్యమొదలు సేవకు లందఱు నీ యాజ్ఞకు లోపడి యెట్లుండవలయునో యట్లే నీవు బాగుపడవలయుననిన నీ కడుపు, కన్నులు, కాళ్ళు మొదలైన సమస్తావయవములు నీవు చెప్పినట్లు వినవలయును గాని యవి చెప్పినట్లెల్ల నీవు పోరాదు. నీ దేహమునకు నీవు బానిసవు గాదనియు నీ దేహమే నీకు బానిస యనియు నిమిషమైన మఱవకుము.

ఒక బాటసారి ప్రయాణము చేయుచున్నాఁడు. ఉదయమున నిద్రలేచుట, కృత్యములు దీర్చుకొనుట, మహారాజులు, దాతలు పెట్టిన సత్రమందు భోజనము చేయుట, దారినడచుట రాత్రియైన మరల

భుజించుట, నిద్రించుట మరల లేచుట యీ ప్రకారము చేయుచుఁ దా నెక్కడకుఁ బోవలయును తానేమి నిమిత్తముగఁ బ్రయాణము చేయుచున్నాఁడు అను నాలోచనము లేనివాఁడయ్యేనేని నీ వేమందువు?

అట్టులే నీవు పుట్టితివి. బుద్ధిగలవాఁడ వైతివి. తినుచున్నావు. తిరుగుచున్నావు. నిద్రించుచున్నావు. ఇంకఁ గొన్ని నాళ్ళకు బిడ్డలను బాపలను గందువు. సంపాదింతువు. ఈ కార్యములన్ని చేసిన నేమిప్రయోజనము? ఇవి యన్నియుఁ జేయకుండినఁ గలుగు నష్టమేమి? యని యాలోచించితివా? మనయత్నమేమున్నది? భగవంతుఁడు మనుష్యుఁడుగా పుట్టించెను. కాఁబట్టి మనుష్యులందఱు చేయుచున్నట్టు నేను జేసెదను. అంటివా భగవంతుఁడు నిన్నేల పుట్టించెను? నిన్నుఁ బుట్టించుటవలన భగవంతునకు రాఁగల లాభమేమి? నిష్ప్రయోజనముగఁ బుట్టించి మనుష్యుల నెల్ల నిట్లు బాధించుట కాయన క్రూరుఁడా? యని నేనడిగిన నీవేమి యుత్తరము చెప్పెదవో చెప్పుము. ప్రయోజన ముద్దేశింపక యెట్టి మందుఁడు ప్రవర్తింపఁడు. ఇఁక భగవంతుఁడు ప్రవర్తించునా? సమస్తజ్ఞానము, సర్వశక్తులు, సమస్తైశ్వర్యము, గలిగి కోరికలే లేని భగవంతునకు మన మేమి మేలుచేయఁగలము? కావున మన మేలునకే దయాళువైన భగవంతుఁడు మనల సృజించెనని నమ్ముము.

ఏకచ్ఛత్రాధిపత్యము వహించి సర్వము తానయై నిష్కంటకముగ నొక చక్రవర్తి రాజ్యమేలుచుండెను. ఆయన మిక్కిలి ధర్మాత్ముఁడు, దయావంతుఁడు, సత్యసంధుఁడు, ఆర్తజన రక్షకుఁడు, మహాబలపరాక్రమ సంపన్నుఁడు. శ్రీమంతుఁడు ఆయన కసాధ్యమైన కార్యమే లేదు. సమస్తముండుట చేతఁ గోరఁదగిన దేదియు లేదు. సామంతరాజు లందఱు నాయన యాజ్ఞ శిరసావహించి చరించువారే. అట్టి చక్రవర్తికిఁ గుమారులు కలిగిరి. వారు బాల్యచాపలముచేత మనతండ్రి యింతటి గొప్పవాఁడు కదా మనము తండ్రివలె గుణసంపత్తి గలవారమై తండ్రిననుసరించి

యుందమను జ్ఞానములేక దుష్టబాలురవలెఁ బ్రాకృతసహవాసముచేసి జ్ఞానశూన్యులై పంచతంత్రమునందలి రాజకుమారులవలెఁ బ్రవర్తించుచుండిరి. అప్పుడు తండ్రి వీరినెట్లైన మంచిమార్గమునకుఁ ద్రిప్పి వారెంతటివారో తెలిపి సుఖపెట్టవలయునని తలఁచెను. ఇట్లు తలఁచి దానికిఁ దగిన యాలోచనము చేసి యొకపల్లెకూటమునందుఁ బ్రవేశపెట్టి వారియెడల నా యుపాధ్యాయుఁ డెట్లు ప్రవర్తింపవలయునో యా మార్గము లన్ని విధించెను. ఈ యీ తరగతియందు వీరి కీయీ పాఠముల నేర్పుమని విధులేర్పఱిచిన పిమ్మట వారు తనతో సమానులైనపుడు మరల దుష్కార్యములందు మనస్సు పోనీయకుండ నేర్పాట్లు చేయవలయునని తలచి నడవడులందు వారి యిష్టప్రకారము పోవ స్వాతంత్ర్య మిచ్చెను. బాలకుల నడవడి కనిపెట్టుటకు ఉపాధ్యాయుడు చక్కఁగ బ్రవర్తించుచున్నాఁడో లేదో చూచుటకు తానిట్టివాఁడని వారికిఁ దెలియకుండునట్లు వారికిఁ గాన రాకుండ మాఱువేషముతో వారిలో తిరుగుచుండెను. కాని వారేదికోరినను వారికి లభింపఁజేయుచుండెను. ఉపాధ్యాయుడు రాజాజ్ఞకు లోబడి వారికిఁ బాఠములిచ్చుచు ఆ పాఠములందు సంవత్సరమున కొకసారి పరీక్షించుచుఁ బరీక్షయందుఁ గడతేఱినవారిని పై తరగతులకుఁ బంపుచు నచ్చట వారికిఁ గ్రొత్తపాఠము లిచ్చుచుఁ బరీక్షించుచు నిట్లు పై పై తరగతులకుఁ బంపుచుండెను. పరీక్షలందుఁ గృతార్థులు కాని వారిని మరల నాతరగతియందే యుంచుచుఁ గ్రిందఁజదివిన పాఠములను, మఱచినవారిని, మరలఁ గ్రిందితరగతులకుఁ బంపుచుండెను. బాలకులు వారివారి శ్రద్ధకొలదిఁ బాగుగఁ జదివి పాఠములు నేర్చుకొనినవారు పైతరగతులకుఁ బోవుచుండిరి. కొందఱు నేర్చుకొనక యా తరగతులందే 2-3-4 సంవత్సరములు పడియుండువారునై యుండిరి. ప్రాకృతుఁ డొకఁడిందఱకు స్నేహితుఁడుగ నుండెననియు, వాఁడు వీరిని వక్రమార్గముల కీడ్చుచుండెననియుఁ

జెప్పితినిగదా! ఆ స్నేహితునందుఁగల దుర్గుణ మిట్టిదని వారికై యనుభవముచేఁ దెలియువఱకు వాని స్నేహము మరల స్మరింపకుండరని తలఁచి యా స్నేహమును రాజు నివారింపఁడయ్యెను. ఎవరినైనను బలాత్కరించి యొకపని చేయవలదనిన వారు భయముచేఁ జేయుట మానినను మనస్సున దానిని స్మరించుచు సమయము దొరకిన మరలఁ జేయుదురు. ఆ కార్యము చేయుటవలనఁ గలుగు చెడుఫలము వారే యనుభవముచేఁ దెలిసికొనిరా మరల దానిని స్మరింపనైన స్మరింపరు. ఆ కార్యమనిన భయపడుదురు.

ఆ కారణముచే వాఁడు చెప్పిన యాటలెల్ల నాడుచు దానివలన దెబ్బతిని బాధపడినవా రా యా మాటల మరల నాడక యొక్కొక్క చెడ్డాటను మరల నాడుట మానిరి. ఒక్కసారి నిప్పుతో నాటలాడి దేహము కాల్చుకొనినవాఁడు మరల నిప్పుతో నాడుకొనునా? ఒక్కసారి పాముతో నాడుకొని కాటుపడినవాఁడు మరలఁ బాముతో నాడుకొనునా? అట్టులే వారును దొంగతనము చేసి అంకుతనము చేసి యసత్యముచెప్పి తినరానివి తిని చేయరానివి చేసి, చెప్పరానివి చెప్పి, దానికి దానికిఁ దగిన కఠినశిక్షల నెల్ల ననుభవించుచు మరల నట్టివి చేయకుండిరి. చెడ్డాటలు తక్కువగుకొలఁది పాఠములందు శ్రద్ధయెక్కువగుచు వచ్చెను. ఇట్లు వీథిపల్లెకూటములోని తరగతులు, ప్రారంభ పాఠశాలలోని తరగతులు, అంతకు పెద్ద పాఠశాలలోని తరగతులు, సర్వకలాశాలలోని తరగతులు క్రమక్రమముగ దాఁటి యన్నిపరీక్షలం దాటి తేటినవారు విద్యావంతులను జూచి యన్నిపరీక్షలం దాటి తేటినవారు విద్యావంతులను జూచి యయ్యలారా! యీ విద్యవలన నేమి లాభము? తల్లితండ్రులు మమ్మిట్లు నిర్బంధింపనేలయని ప్రశ్నించిరి. అప్పుడు వారిట్లు చెప్పిరి. నాయనలారా! మీ తల్లిదండ్రులు మిమ్ము బాధింపఁ బాఠశాలయందుఁ జేర్పలేదు. ఉపాధ్యాయునకును మీ మీఁదఁ గ్రోధము లేదు. మీతండ్రిసొత్తు మీ

స్వాధీనమునకు వచ్చినపుడు దానిని దుర్వినియోగ పఱుపక చక్కఁగఁ గాపాడుకొన వలసిన నేర్పుకావలయునుగదా! అది మీరు నేర్చుకొనవలయునని మీ తల్లిదండ్రుల కోరిక. మీ తండ్రిచే నాజ్ఞాపింపఁబడి యుపాధ్యాయులు మీకట్లు పాఠము లిచ్చుచుండిరి. మీరు శిక్షలఁబడుటకు మీ చెడు నడవడులే కారణము. మీ చెడునడవడులకు మీ కోరికలే కారణము. మిమ్మెవ్వరు కాలయునని పీడించినవారు లేరు. మీ తండ్రి బిచ్చగాఁడైనయెడల మిమ్మంత నిర్బంధింపఁ గారణముండదు గాని మీతండ్రి చక్రవర్తి. మీరా యువరాజులు గాఁబోవువారు. మీయందు లేశమైనను చెడుగుణ ముండిన లోకము నెంత బాధింతురో, సర్వసద్గుణములకు నిలయమైన మీతండ్రికెంత యపకీర్తిదుఃఖము కలిగింతురో, అట్టి ఫలమును గలుగకుండుటకై మీతండ్రి యిట్లేర్పాటుచేసెను అని చెప్పిరి. అదిమొద లధికశ్రద్ధతో వారు వారివారి పాఠములు నేర్చుకొనుచు దుర్గుణములపొంతఁ బోవకుండిరి. ఇట్లు బాగుపడిన వారికి చక్రవర్తి యువరాజత్వ మిచ్చుచుండెను.

## II

నాయనా! యీ కథ నీకు బోధపడినదా? చక్రవర్తి యెవరో బాలురెవరో తెలియునా? చక్రవర్తియే భగవంతుఁడు. జీవకోటులన్నియు నాయన బిడ్డలు. కర్మఫలమునిచ్చు దేవతలే యుపాధ్యాయులు. అహింస, సత్యము, దొంగలింపకుండుట, బ్రహ్మచర్యము, క్షమ, ధృతి, దయ, ఆర్జవము, మితాహారము, శౌచము, తపస్సు, సంతోషము, ఆస్తిక్యము, దానము, దేవపూజ, వేదాంత శ్రవణము, లజ్జ మతి, జపము మొదలైనవి పాఠములు. శిలలు, లోహములు, రత్నములు మొదలగు నిరవయవ పదార్థములు, గరికలు, తీఁగలు, పొదలు, వృక్షములు మొదలైన యోషధులు, ఱెక్కలుగలవి, ఱెక్కలు లేనివి గ్రుడ్లుపెట్టునవి, పాలిచ్చునవి మొదలైనవి పక్షులు మృగములు, నానా మనుష్యజాతులు ఇవన్నియు నా యా పాఠశాలలు

వానిలోని తరగతులు. నీవు నేను నొకానొక కాలమున రాయిగను జెట్టుగను, పక్షిగను, మృగముగను, నున్నవారమే. ఇప్పుడు మనుష్యజాతిలో నున్నారము. అందులోఁ గొన్ని తరగతుల దాఁటివచ్చితిమి. మనము నిజమైన బ్రాహ్మణులమై భూదేవత్వము సంపాదించి మెల్లమెల్లగఁ బ్రయాణము చేయవలయుననిన నిఁక దేవత్వము సంపాదింపవలయును. అటుగాక రహస్యము మనకుఁ దెలిసినది. మనము భగవంతుని బిడ్డలము గనుక నిఁక వంకరత్రోవఁ బోరాదని జగజ్జనకుని ధ్యానించుచు శరణు నొందితిమా మనకిఁక వేఱుజన్మముల నీయక కడఁదేర్చును. లేక మనస్థితి మఱచి హీనగుణుల మైతిమా మరలఁ గ్రిందితరగతులకుఁ బోవలసివచ్చును. కాఁబట్టి ప్రతిమనుష్యుఁడు తానేతరగతియం దున్నాఁడో యా తరగతికి నేరువవలసిన పాఠము లేవియో యవి తెలిసికొని వానిని శీఘ్రముగ నేర్వవలయును. గ్రంథవిస్తరమేల? కాని యిప్పుడు నీవు మనుష్యజాతి, బ్రాహ్మణకులము, బ్రహ్మచర్యాశ్రమమునం దున్నవాఁడవు గనుక గమ్యస్థానము చేరుటకు నీవు చేయవలసిన కార్యము లెవ్వియని యాలోచింపవలయును.

సంసారమును సముద్రముతోఁ బోల్చుట నీ వెఱుఁగుదువు. ఈ సముద్రమును దాఁటుటకు భగవంతుడు మనకు దేహమను పడవ నిచ్చియున్నాఁడు. ఈ పడవ సాహాయ్యముతో మనము ప్రయాణము చేసి భగవంతుఁడను రేవు చేరవలయును. అది మనకు గమ్యస్థానమని తెలియునుగదా. ఏ మార్గమునఁ బోయిన నిరపాయముగఁ జేరుదుమో యామార్గములను మనకు భగవంతుఁడు దెలిపియున్నాఁడు. ఆ మార్గమును వదలి మఱియొక మార్గమునఁ బోయిన పడవ కొండకో గుట్టకో కొట్టుకొని పగిలిపోవును. మనము సముద్రములోఁ బడిపోదుము. భగవంతుఁ డేర్పాటుచేసిన మార్గముల వెంటఁబోయి సుఖముగ దరిఁజేరుట మేలో గడియగడియకుఁ బడవలఁ బగులఁగొట్టుకొనుచు నీళ్ళలోఁబడి

మునుఁగుచుఁ గష్టములపాలగుచుండుట మేలో యాలోచింపుము. మనుష్యులు గమ్యస్థానమును జేరలేక పోవుటకు రెండు కారణములు. తమ కిచ్చిన సాధనమును జక్కఁగఁ గాపాడుకొనకపోవుట యొకటి. రెండవది గమ్యస్థానము భగవంతుఁడని యెంచుకొనకుండుట. మన మోడపైఁ బోవునపుడు దానిని జక్కఁగఁ గాపాడుకొనుభారము మనదేకదా! అటుగాక యుపేక్షించినయెడలఁ జీలలూడఁగా పలకలు నీటితాఁకు సహింపలేక వదలుపడి చివికి యాడిపోవును. అప్పుడు గమ్యస్థానము నుద్దేశించి సరియైన మార్గమునఁ బోవుచున్నను సాధనమును గాపాడకొనని కారణముచేఁ గష్టములపాలగుదుము. కాఁబట్టి తొలుత సాధనమును జక్కఁగఁ గాపాడుకొనవలయును. సాధనమే దేహము. ఈ విషయము చాలభాగము బాలక హితచర్యయందుఁ జెప్పితిని. ఇఁకఁగొంత యిప్పుడు చెప్పెదను. ఇంతకుఁ బెద్దవాఁడవైనప్పుడు తెలిసికొనవలసినవి యప్పుడు చెప్పెదను. దీనివలన నీవు దేహమును గాపాడుకొనవలసిన దత్యంతావశ్యకమని యేర్పడెనుగదా. కొందఱు దేహమును నలక్ష్యముగఁ జూతురు. అల్ప స్వల్పములకుఁగూడ నేల యీ పాడుదేహము? బ్రతికి యెవ్వరి నుద్ధరింపవలె? ననుచుందురు. అట్టివారు బుద్ధిలేని వారు. తాను బ్రతుకుట తనకొఱకేగాని యితరుల నిమిత్తము కాదని తెలిసెనా? ఇంతకు స్పష్టముగఁ గావలయు ననిన వేఱొక దృష్టాంతము చెప్పెదను. నీవు చిన్నవాఁడవు నీవు అక్కకు చేతిక్రింద సహాయుఁడవై యున్న వాఁడవుకదా. నీకు మీయక్క గడియారము నెవ్వరికైన నిచ్చిరమ్మనియో లేక యేదైనఁ బనిచేయుమనియో చెప్పినఁ దెలిసియో తెలియకయో సోమరితనముచేతనో మఱపుచేతనో యాపని చేయకపోయితివనుకో. నిన్నాయన దండించిన నీవు నీ తెలివితక్కువకై సిగ్గుపడక యేల యీ పాడుబ్రతుకు? బ్రతికి యెవరి నుద్ధరింపవలయునని విసుఁగుకొనవచ్చునా? నీ బ్రతుకు పాడగుటకు బాగుపడుటకు నీ తెలివియే కారణము. కాఁబట్టి

చేసినతప్పునకై పరితాపపడి యిఁక నట్టులు చేయకుండ జాగ్రత్త పడవలయునుగాని, నీ బాగుకోరి దేహమిచ్చిన భగవంతుఁడు తెలివి తక్కువవాఁడని యర్థమిచ్చునట్లు మాటలాడవచ్చునా? ఈ జన్మమున నీవు తెలివిని జక్కఁబఱుచుకొనక పాడుబ్రతుకని బ్రతుకుట మానితివేని మఱుసటి జన్మమున నీ తెలివింతేకదా యుండును. ఇంతకు మించిన తెలివియెట్లువచ్చును? ఎక్కడ నుండివచ్చును? నీవు 100 మైళ్ళు ప్రయాణము చేయవలయుననుకో. ఈ దినము 10 మైళ్ళునడచి యక్కడ నారాత్రి పండుకొంటివనుకో. ఉదయమున నీవు పండుకొన్నచోటనే నిద్రలేతువేగాని 20 మైళ్ళకావల నిద్రలేతువా? కాఁబట్టి బ్రతుకు మీఁదను దేహముమీదఁను విసుఁగుకొనువారు బుద్ధిమాలిన వారని నమ్ముము. నీ విట్టివాఁడవు కావని నాకుఁ దెలియును. అయినను కష్టములందును శోకములందును గొంద అట్లు మాటలాడుదురు. అట్టిపొరపాటు నీవెపుడైన నేజన్మమందైనఁ జేయరాదనుటకుఁగాఁ దెలిపితిని.

రెండవది యుద్దేశ్యము భగవంతుఁడు కాకపోవుట. తన యిల్లెందున్నదో యచ్చటికిఁబోక యిచ్చట నచ్చటఁ దిరుగు వాఁడెన్నఁటికి నిల్లుచేరలేఁడు. మీయూర నెన్ని పూఁటకూలి యిండ్లున్నను స్వగృహముతో సమానమగునా? అక్కడ నిన్నాదరించు తల్లిదండ్రులుందురా? తనయెత్తు ధనముపోసినను తల్లివంటి దాసిరాదనియు అఱువదిలక్షల వరహాలిచ్చినను అత్తవంటి తొత్తురాదనియు సామెత లెఁఱుగవా. కాఁబట్టి గమ్యస్థానమునందే దృష్టియుంచి పయనింపవలయును. ఈ రెంటి నేనాఁడు మఱవకుము. దేహము చక్కఁగ కాపాడుకొనినను, భగవంతునిపై దృష్టినుంచి కార్యములు చేయవేని నీజన్మము వ్యర్థము.

## III

నాయనా! సూక్ష్మదర్శనికిని గోచరింపని పరమాణుకము మొదలుకొని యన్నిటియందు మనస్సు – ప్రాణము – జీవుఁడున్నాఁడని నమ్ముము.

ఈ విషయమై మఱియొకసారి చెప్పెదను. ఇప్పటికి నామాట నమ్ముము. మనస్సు గుణము, కోరికలు గోరుట యని తెలియును గదా. నేను జెప్పిన పరమాణుకము మొదలుకొని యన్నిటికి మూఁడుకోరికలు కలవు.

1. ఆత్మరక్షణేచ్ఛ. తన్ను ఁదాను గాపాడుకొనవలయునని కోరిక.

2. సంతానేచ్ఛ. సంతాన మభివృద్ధి కావలయునని కోరిక.

3. ఆనందేచ్ఛ. ఆనంద మనుభవింపఁ గోరిక.

ఈ మూఁడు కోరికలులేని జీవియే లేదు. అందు మూఁడవది యానందము. జింజాటములన్ని వదలించుకొని జగజ్జనకులయొద్దఁ జేరి మరల జనన మరణములకు రాక హాయిగ నుండుటకంటె శాశ్వతమైన యానంద మేదిగలదు? ఇది యొక్కటే నిత్యమైనది. తక్కినవన్నియు దాని నీడలు, పరిమితములు. అల్పకాలముండునవి. ముందుచెప్పిన గమ్యస్థాన మీ యానందమునకు నెలవగు పరమపదమే. ఈ గమ్యస్థానము 1000 మైళ్ళదూరమున నున్నదని తలఁపుము. ఇది యొక నాఁటిలోఁ బ్రయాణింప సాధ్యమగునా? కాదు. ఈ పగలు కొంతప్రయాణముచేసి రాత్రియొకచోట శయనించి మరల నిద్రలేచి మరల వంటలు తిండ్లు చేసికొనుచు మరలఁ బయనించి యీప్రకారము కొన్నినాళ్ళు చేయవలయును గదా! అట్లే గమ్యస్థానము చేరువఱకు నీవును పలుమాఱు జన్మము లెత్తుచు దేహయాత్ర సలుపుచుందువు. ప్రయాణ మొక్కటిగ సాగుటకునై నీవే నీ కొడుకుగ నుత్పత్తి యగుదువని శాస్త్రములు చెప్పుచున్నవి. బాలక హితచర్యయందలి తల్లీ కొడుకుల సంభాషణము స్మరించిన నీకుఁ గలిగిన దేహము నీ తల్లిదండ్రులదే యని తెలియును. ఆత్మజుఁడు మొదలైన శబ్దముల యర్థమును స్మరింపుము. ఈ కారణముచేఁ దనమేలునకై తాను సంతానముగోర ప్రతిజీవి యిచ్ఛయించును. ఈ కోరిక నెఱవేఱుటకుఁ దగు నుపాయము లన్నిటియందు భగవంతుఁడు కల్పించియున్నాఁడు.

దీనియందొక విధమైన యానందము కలదు. ఈ కోరిక నెఱవేఱ వలయుననిన దేహరక్షణ మావశ్యకము గావునఁ బ్రతిజీవియు నేవిధముగనైన దేహరక్షణము గావించుకొనుచుండును. ఉండవలయును. జీవికి మరణమనిన నెంతభయమో యోజించినపుడు బ్రదుకొక యానందమనుట స్పష్టమగుఁగదా. ఈవిధముగఁ జూచినను బ్రతిమనుష్యునకు దేహరక్షణము స్వభావసిద్ధమైన ప్రథమ కర్తవ్యమనియు సంతానాప్తి రెండవది యనియు నీ రెండునుగూడ శాశ్వతానందమును సంపాదించుటయందే వినియోగింపవలయుననియు ఏర్పడెను గదా? కావున నీవు తొలుత దేహరక్షణము కావించుకొనవలయుననియు, నీ దేహరక్షణముచేయుట శాశ్వతానందము సాధించుటకనియు, ఆ నిమిత్తమై చిన్నప్పటి నుండియు, వర్తింపవలయుననియు నెఱుంగుము.

ఇఁకఁ బ్రాణముగుఱించి చెప్పెదను. కొనసాగింపశక్తి లేదేని రిత్తకోరికలవలన ఫలమేమి? కాఁబట్టి యీకోరికలు కొనసాగించు శక్తియే ప్రాణము. ఈ శక్తియుఁ బ్రపంచమందంతయు గాలివలె నిండియున్నది. సముద్రమునఁ బెక్కురకముల పాత్రములు వైచిన దాని దాని పరిమాణము కొలఁది నీరు గ్రహించునుగదా! చిన్నపాత్రములోఁ గొంచెము నీరు పట్టిన పెద్దబానలో నెక్కువనీరు పట్టును. ఏనుఁగునందున్నంత ప్రాణము దోమ యందుండునా? అంతేకాదు. బాన పెద్దదయ్యును నది యోదైనను, వెలియుచున్నను దానిలో నీరు నిలుచునా? అట్టులే దేహము రోగాదులచేఁ బీడింపఁబడి యవయవములు దృఢముగ నుండకుండినఁ బ్రాణమెట్లు పూర్ణముగ నిలువఁగలదు? కావున దేహారోగ్యము కాపాడుకొనవలయును. ప్రాణము సంపూర్ణముగఁ బోయిన దేహము పీనుఁగై యన్ని శక్తులుడిగినదగును. ప్రాణ మెక్కువగ నాకర్షించుకొలఁది దేహదార్ఢ్య మెక్కువగుచుండును. ప్రాణమనునది శక్తియనుట మఱవకుము.

ఇఁక జీవులగుఱించి చెప్పెదను. ఈ జీవులే భగవంతుని బిడ్డలు. చక్రవర్తికుమారులు ప్రాకృతస్నేహముచేసి వక్రమార్గమునఁ బోయిరని

చెప్పితినిగదా. దేహముతోడి తగులాటమే ప్రాకృతస్నేహము. ప్రకృతి సంబంధమే ప్రాకృతము. ఈ స్నేహితుఁ డబ్బిన శిఖ, అబ్బుకున్నఁ గాళ్ళుపట్టుకొనువాఁడు. మన మేమఱి యున్నప్పుడు మెల్లగ మోసగించి తనవశము చేసికొని మనపై సవారితీయును. అటుగాక ఛీ ఛీ! నీవు నా బానిసవు. నేను చక్రవర్తి కుమారుఁడను. నేను చెప్పినట్లు నీవు నడచుకొనవలయునని ధిక్కరించితిమా మన కార్యములందు వాఁడే తోడుపడుచుండును.

జీవునకు దేహమునకు భేదము గలదని నీవిట్లు తెలిసికొనుము. నీవొక బండిలోఁగూర్చుండి యిది నా బండి యనిన బండివేఱు నీవు వేఱుగదా! నాయిల్లన్నప్పుడు నీవు వేఱు ఇల్లు వేఱు కదా! ఆ యింటిలో స్తంభము విఱిగియో, కప్పుచెడియో, గోడలు పడియో, యేదియో కారణముచే వాసయోగ్యము కానప్పుడు నీవున్న యింటిని విడిచిపోదువుకదా! అట్టులే జీవుఁడే నీవు, ఇల్లే నీ దేహము. అది రోగాది కారణములచే వాసయోగ్యము గాకపోయినపుడు జీవుఁ డాయింటినివిడిచి వేఱింటికిఁ బోవును. అదియే నీకు వేఱుజన్మము. నీదేహమునకు నీవు యజమానుఁడవు గాని బానిసవుగావు. కాఁబట్టి నీవు మనఃపూర్తిగ నెట్లుత్తర్వుచేసిన నట్లది లోపడియుండును. అది నశించునది. నీవు నశించువాఁడవు కావు. కనుకనే రాతి యిల్లు, చెట్టిల్లు, పశువిల్లు, మృగమిల్లు విడిచి యిప్పుడీ యింటఁ బ్రవేశించితివి. నీకు సత్యము తెలుపవలసి యిది నీకుఁ జెప్పితినిగాని దేహమే నీవనుకొనినను దేహమును నీవు రక్షింపవలసిన వాఁడవేకదా!

నీకు నేను వేదాంత ముపదేశించుచున్నానని భయపడకుము. ఇచ్చకపు మాటలు మోసపు మాటలు చెప్ప నాకు సాధ్యపడదు. సత్యము తెలియుటచే నొకవిషయమునఁ గలుగు నాస్థ మఱియొకమార్గమునఁ గలుగదు. కాఁబట్టి నీకు నేను జెప్పెడి విషయమున దృఢజ్ఞానము పట్టుదల

గలుగుటకై యింతదూర మస్తిభారమువేసి చెప్పితిని. అది నీకు రుచింపకపోయిన నీ ప్రారబ్ధకర్మబలము.

### IV

ఈ వయస్సున నీవు గమనింపవలసినవి, 1. ఆరోగ్యము కాపాడు కొనుట, 2. విద్యాభ్యాసము చేయుట. ఆరోగ్యమునకు విద్యాభ్యాసమునకుఁ బరమోద్దేశము నేనిదివఱకు చెప్పినదే యయినను కేవల మదేకాదు. అది పరలోకవిషయము. ఇంటగెల్చిగదా రచ్చగెలువవలయును. ఈ లోకమును జయించికదా పరలోకమును జయింపవలయును. కావున నీ రెండీలోకము వ్యవహారములకుఁగూడ నుపయోగింపవలెను. పరమోద్దేశము నెఱవేఱుటకు విద్యనేర్చుకొనుటకు మనస్సు దేహము బాగుండవలయుఁగదా. ఆహారము లేకున్న మనస్సు, దేహము బాగుగ నెట్లుండును? కావున నాహారము సంపాదించుకొనుట యవశ్యకార్య మగుచున్నది. సంతానము కావలయుననిన భార్య కావలయును గదా. భార్యకు బిడ్డలకుఁ గూడ నీ వాహారము సంపాదింపవలసియున్నది. ఆహారము సంపాదించుటకు ధనము కావలసియున్నది. తనకడుపు కూటిభారము తన పెండ్లాము బిడ్డల కూటిభారము నితరులపై వైచి దండుగు తినువాఁడు నీచుఁడు. ఎద్దులుకూడఁ దమయాహారమును దాముత్పత్తిచేసి మనుష్యులకిచ్చి తాము తినుచున్నవి. అట్లుండ మనుష్యుఁడై మగపుట్టుక పుట్టి దేరాగూటము వలె నుండి తన తనవారి కూటిభారము నితరులపై వైచువాఁడు పశువులకంటె హీనుఁడేకదా? కాఁబట్టి సుఖజీవనము చేయుటకై ధన మార్జింపవలయును. ప్రపంచము ధనమూలము. నిర్ధనుఁడు మృతుఁడు సమానులు. కావున నీవు చదువునట్టి చదువు ధనము సంపాదించుటకు నుపయోగపడునదిగను నుండవలయును. కేవలము కడుపు కూటికి మాత్రమే ప్రయోజనపడు చదువు విద్యకానేరదు. నీవు చదువు చదువున కది యొక్కటే ఫలమగునేని యాచదువు చదువకుండిన

దోషము లేదు. చదువురానివారు సంపాదించుకొని సుఖముగ జీవించువారు లేరా? కావునఁ జదువునకుఁ ధనార్జనము ముఖ్యోద్దేశ్యముగా నుంచుకొనఁ గూడదు.

ఇప్పుడు మీ చదువున కుద్యోగమో న్యాయవాదిత్వమో ముఖ్యోద్దేశ్యమై యుండుట శోచనీయము. ఒకనాఁడు మీవిద్యాభ్యాసమున కుద్దేశమేమి యను విషయముపై వ్యాసము వ్రాయుఁడని యడుగఁగా నందఱు విద్యార్థులుమీఁద చెప్పినవే యుద్దేశములని వ్రాసిరి. వారు వ్రాసినది సత్యము. అయినను అది దుఃఖకరమైన సత్యము. మీరు చదువు పాఠములలో మీరు స్వతంత్రించి జీవనము చేయుటకుఁ బనికివచ్చునది యొకటి యుండినఁ జెప్పుము. ఎచ్చోటనో యొకచోటఁ గూలివాండ్రుగ చేరవలసినదేకదా మీకుఁ దలవ్రాత. నూఱు రూపాయల కూలియైనను పదిరూపాయల కూలియైనను కూలి కూలే. వాఁడు కూలివాఁడే. పరాధీనపు స్వవృత్తి కూలికంటె నీచమని నాయభిప్రాయము. ఈనెల కూలివాని కంటె దినమునకు 0-4-0-లు కూలిచేసి సంపాదించువాఁ డుత్తముఁడు. ఏల? వాఁడు స్వతంత్రుఁడు. ఈ దినము దేహ మారోగ్యముగ లేదేని వాఁడు కూలికిపోకుండ నింటనిలుచు స్వాతంత్ర్యము వానికిఁ గలదు. కొలువుకాని కట్టి స్వాతంత్ర్యము గలదా? అబ్బతద్దిన మాఱునెల లుండఁగానే యాదిన మాదివారమగునో కాదో సెలవు దొరకునో దొరకదోయని కొలువుకాఁడు భయపడుచుండును. కొలువులోని కష్టములు వ్రాయఁబూనిన నొకగ్రంథమగును. కావున నొక యుపాయము చెప్పెద. కొలువులో నుండువాని నెవనినేకాని 1000 రూ-ల వాని మొదలు 4 రూ-ల వానివఱకు సేవక వృత్తియందు సుఖము స్వాతంత్ర్యమున్నదా యని యడుగుము. ఉన్నవని చెప్పువాఁడు కోటికొకఁడైన నుండఁడు. ఈ కారణము చేతనే నా పద్ధర్మములందు బ్రాహ్మణుఁడు మడిదున్న వచ్చును. వాణిజ్యము చేయవచ్చును. జూదము, కొలువు తప్ప మఱియేపనియైనఁ

జేయవచ్చునని విధింపఁబడినది. ఋజుబుద్ధితోఁ గొలువు చేయువాఁడు ప్రకాశించుట యరుదు. కొలువు కాఁడు సత్యవాదిగ నుండఁజాలఁడు. అంతఃకరణశుద్ధిగఁ బనిచేయఁజాలఁడు. వాఁడు పరితాపార్హమైన జంతువు. కొలువువలనఁ గలుగు కష్టములు, దుఃఖములు, అవమానములు మొదలైన నసహ్యములటుండ నది భగవంతుని మఱచిపోవు నట్లును జేయును. ఒక సేద్యగాఁడు తన వృత్తియందు గాలివాన పంట మొదలైనవి దైవాయత్తము లగుట దేవుని ధ్యానించుచునే పనిచేయును. వర్తకుఁడు నట్టులే యంగడి తెఱచునపుడు ప్రతిదినము దేవుని ధ్యానించును. కూలివాఁ డిల్లువిడిచి బయటఁ బోవునపుడు స్వామీ! మంచికూలి దొరకవలయునని ప్రార్థించును. తుదకు దొంగకూడ బయలు దేఱునపుడు నేఁటి దోఁపులో నీ కింత భాగమని దేవునిగూడ దొంగసొత్తున కాశపడఁ జేయును. అన్నిటికిఁ దప్పఁబుట్టినవాఁడు కొలువుకాఁడు మాత్రమే. అధికార బలముగలవానికి నెలకు రూ 7–లు జీతముగల బంట్రౌతులకు కూడ నధికారపిశాచ మావేశించి కన్నులు కానరాకుండ చెవులు వినరాకుండఁ జేయుచుండును. స్వతంత్రశక్తిచేఁ గష్టపడి సంపాదించుచున్నామని తక్కినవారికంటెఁ దాము గొప్పవారమని మనుష్యరూపము వహించిన యీ దుష్టపశువుల కహంకారము. తాము గొప్పవారని యెదుటివారు తలఁచుచుండునట్లు తాము నటింపవలయుననుటే వారికిఁ బరమోద్దేశము ఇట్టివారికి దైవముపై మనస్సుకూడఁ బోవునా? అధికారబలములేని జీతగాండ్రకో తెల్లవాఱెనే యని దిగులు. ఒక్కొక్కనాఁడు కడుపునిండఁ గూడుదిన నవకాశము గలుగదు. త్రోవలోఁ గుక్కపరుగు. పోయినచోట నధికారి యేమనునో యేమితప్పువచ్చునో యని భీతి. సర్వకాల సర్వావస్థలఁ దాను పరాధీనుఁడనే యభిప్రాయమే శిలాక్షరమువలె మనస్సున నాటుకొనియుండును. సర్వదా దాను బానిస యను కొనువానికిఁ జిత్తౌన్నత్య మెచ్చటనుండి వచ్చును? నన్నుఁ జంపవచ్చిన పగవానినైన కొలువులోఁ జేరుమని బోధింపను.

అంతకంటెను నీచపు బ్రతుకు వేఱొకటిలేదు. ఇట్టి బ్రతుకున కాశపడి నీవు చదివెదవేని నీకంటె మతిమాలినవాఁడు మఱియొకఁ డుండఁడు. ఎందును గతిమాలినవాఁడు కొలువులోఁ జేరవలయును. సేవచేసి జీవించువారిలో సత్యసంధులు, అంతఃకరణశుద్ధి గలవారు లేరని నేను జెప్పను. లక్షకొక్కఁ డెందైన నుండవచ్చునుగాని కొలువునకు నీ సద్గుణములఁ జంపు శక్తియున్నదని నాకు బాగుగఁ దెలియును. కొలువువలన గొప్పతనము వచ్చునని న్యాయముగ ధనముచేరునని భ్రాంతి వదలిపెట్టుము. ఒకచోటఁ గూర్చుండి దినమంతయుఁ బనిచేయువానికైనను లేక పరువులుపాఱు నుద్యోగమం దుండువానికైనను భార్య దృఢగాత్రయైనఁ దప్ప దృఢగాత్రులు బిడ్డలు పుట్టుట యపురూపము. ఒక తహశీల్ దారున కొక కూఁతురుండెను. దాని మగఁడు మామగారింటనే పని గిని యేమిలేకయున్నా వాఁడగుటచే ముప్పూఁట బాగుగఁదిని వేడుకగఁ దిరుగుచుండినవాఁడు. ఆహారము, వ్యాయామము బాగుగ నున్నవాఁడగుటచే వేళపాళ లేక భార్యను పండుకొనరమ్మని పీడించుచుండెను. అది విసిఁగి యొకనాఁడు భర్తతో నిఁక మీరు నన్నిట్లు రేయిఁబగలుకూడ బాధించితిరా మా అప్పతోఁ జెప్పి తాలుకుకచ్చేరిలో గుమాస్తాపని యిప్పించెదనని చెప్పెను. దీని యర్థమేమో గ్రహింపుము. ఇది యెంతయు సత్యము.

పట్టపరీక్షలందుఁ గృతార్థులై పాఠశాల చాలించిన తరువాతఁ బాఠశాలలోఁ జదివిన విద్యవలనఁ బ్రసిద్ధికి వచ్చినవారెవరైన నున్నారా? అట్టివా రొక సద్గ్రంథ మేదైన వ్రాసిరా? ఆంగ్లభాష వచ్చినవారిలో గ్రంథములు వ్రాసినవారు లేరా? నీవు వ్రాయలేదా యందువేమో. ఎంత పెద్ద పరీక్షయందుఁ గృతార్థులై యుండినను వారు పాఠశాలయందుఁ జదివినఁ జదువు వలననే గ్రంథకర్తలైనవారు లేరు. వారి కేయే విషయ మందభిరుచియో దానిని వారింటఁ జదువుకొని యభివృద్ధికి వచ్చిన

వారే. 16 సంవత్సరములు పాఠశాలలందుఁ జదివి పట్టభద్రులైనవారికి స్వతంత్రశక్తి గలిగింపలేని విద్యయేమివిద్య? ద్రవ్యనాశకవిద్యగాక. ఇట్టి దుర్దశ యొక దేశభాషలందే కాదు. మీరు చదువు నన్నిటియం దంతంతే కావున నిప్పటి కళాశాలలయందలి చదువు గాలిన జ్ఞానము నొసఁగఁజాలదు.

ఒకఁడు బి.ఏ. పట్టము సంపాదించుకొనుటకు అధమపక్షము 4000 నాలుగువేల రూపాయలు వెచ్చింపవలయును. ఇంత వెచ్చించి తుదకు దీనిపై రాఁగల వడ్డియు సంపాదింపమార్గము లేని వారెందరోయున్నారు.

ఈ విద్యాభ్యాసమువలనఁ గలుగు కీడులు మఱియొకచోటఁ జెప్పితిని. కావున మరలఁ జెప్పుట చర్విత చర్వణము. అందు చెప్పనిది యొకటి చెప్పవలయును. ఈ విద్యాపద్ధతి శ్రద్ధతో విద్యాభ్యాసము చేయువారి యారోగ్యము సమూలముగ నాశము చేయుచున్నది. బ్రాహ్మణులకుఁ గులవిద్య విద్యయగుటచే నిర్వీర్యులయినవారి సంఖ్య వారియందే యెక్కువగాఁ గానవయ్యెడి. శ్రద్ధతోఁ జదువనివారుమాత్రమే దేహారోగ్యము కొంతయైన గాపాడుకొనఁ గలిగియున్నారు. ఆరోగ్యము చెడునట్లు చదువరాదు.

నేను విద్యాభ్యాసము చాలించిన వెంటనే ప్రొద్దుటూరు తాలూకా కచ్చేరిలో గుమాస్తాగాఁ జేరితిని. అచ్చట నప్పుడు రూ॥ న॥ రావు శిరస్తాదారుగా నుండెను. ఆయన నన్ను నేదోయొక గ్రామమువారికిఁ దాకీదు వ్రాసికొని రమ్మనెను. నేను జక్కఁగ వ్రాయకుండిన నీ విన్నాళ్ళు చదివినఁజదు విదాయని పరిహసించునని తప్పులు లేకుండ యార్థానుస్వారములతోడ శుద్ధముగ వ్రాసి తీసికొనిపోయి యిచ్చితిని. అది చదివి యా కాగితమును నలిపి యాయన నా మొగముపై వైచి యిది యేమివ్రాఁత యిట్లు వ్రాసితివి చక్కఁగా వ్రాసికొని రమ్మని గద్దించెను. సరి యెట్టిదో చెప్పినవాఁడునుగాఁడు. ఆ కాగితములను దీసికొని

గుమాస్తాలయందు శ్రేష్ఠుఁడును నాయందుఁ బ్రీతి విశ్వాసములు గలవాఁడునైన బాపూరావు అనునాయనకుఁ జూపించి యిందేమి తప్పు? ఇంతకుఁ గఠినముగ వ్రాసిన పల్లెటూళ్ళవారికి నర్థము కాఁగలదా యంటిని. ఆయన నవ్వి "నీవు చదువేరాని పల్లెటూరివాఁడవే యనుకొని యెట్లు తప్పులు తప్పులుగా మాట్లాడుదువో యట్టులే వ్రాయుము. చదివిన చదువు మఱచిపొమ్మని బోధించెను. ఆ ప్రకారమే వ్రాసికొనిపోయి యియ్యఁగా ఆఁ యిట్టులుండవలెనని శిరస్తాదారు మెచ్చుకొనెను. కొలువులో విద్య యెంత ప్రయోజనమో చూడు. కాఁబట్టి సమష్టికి నా యభిప్రాయములో కేవల భాగ్యవంతులుతప్పఁ దక్కినవారు 6-వ ఫారమునకుఁ బైగాఁ జదువుట నిష్ప్రయోజనము. భాగ్యవంతులు ధననష్టమును గాలనష్టమును సహింపఁగలరు. వారైన నుద్యోగములందు జేరుట నా యభిప్రాయము గాదు. స్వతంత్ర జీవనము చేయ యత్నించుట నా సమ్మతము. నీ వొక యిల్లో మఱియేదో కట్టించుచున్నావనుకో, నీ పని ధననష్టములేక సాగుట కెందఱు కావలయునో యందఱనే కూలివాండ్ర నేర్పాటు చేయుదువా? 100 మంది కావలసినచోట 1000 మంది వచ్చిన నందఱను గైకొందువా? అట్టులే కదా ప్రభుత్వమువారును. పరీక్షలఁ గడతేఱినవారి కందఱకు నుద్యోగముల నిచ్చెదమని వారు వాగ్దానము చేసిరా? వారి కెందఱు కూలివాండ్రు కావలయునో యందఱనుమాత్రమే పెట్టుకొందురు. అది న్యాయ్యమే కదా. 100 మంది కావలసినచోట 1000 మంది మనము పోనేల? వారిలో 900 మంది తమ కుద్యోగములను ప్రభుత్వము వారీయలేదని వారిపై నాక్రోశపడనేల? ఈ 900 – గురు నితర మార్గముల జీవింపశక్తిగల విద్యను నేల నేరువరాదు? భూములు కలవారు, ధనము కలవారు, కులవృత్తి నవలంబింపఁగలవారు కూడ నుద్యోగముల కాశపడనేల? అట్లైన బీదలు బక్కలు ఆ యుద్యోగముల జీవించుటకు వలనుపడునుగదా! కావున 6-వ ఫారమువఱకుఁ బాఠశాలయందుఁ

జదివి తరువాత జీవనాధారమైన విద్యను జదువుట క్షేమము. లేక తమ కులవృత్తియందైనను వాణిజ్యాదులందును బ్రవేశించుట సుఖము. ఒక యంకణము నేలలోఁదొలుత నంగడి పెట్టి మిద్దెలు మేడలు కట్టించుకొనినవారి నెవరెఱుఁగరు? రాజకీయోద్యోగము సంపాదించుకొని బ్రతుకవలయుననిన చదువరాదనుటకై యింతదూరము చెప్పితిని.

అట్లైన నాంగ్లభాష చదువుటేలయందువా? 6–వ ఫారమువఱకు నందఱు చదువవలయుననియు అంతకుమీఁద భాగ్యవంతులు గానివారు భూములు పుట్రలు కుదవపెట్టి తెగనమ్మియైనఁ జదువరాదనియు నాయభిప్రాయము. స్వతంత్రదేశములందు నేకభాషగాఁగలచోట్ల నొక మాతృభాషయే చాలును. మనదేశమున నట్లుగాదు, మాతృభాషకుఁదోడు వ్యావహారిక భాష యవశ్యము తెలిసియుండవలయును. లేనియెడల వ్యవహారహాని కలుగుచున్నది. మనకిప్పుడు ఆంగ్లభాష వ్యావహారిక భాషయు రాజకీయభాషయునై యున్నది. కావున దానిని నేరువవలయును. ఇంగ్లీషు గ్రంథములను జదివి యర్థము చేసికొనునంత భాషాజ్ఞానము కలిగినఁ జాలును. పరీక్షలందుఁ గడతేఱినను దేఱకున్నను ఈమాత్రము భాషాజ్ఞానముకలిగినఁజాలును. ఈ మాత్రము భాషాజ్ఞానము కలవాఁడు వ్యవహార మందేలోటులేక కార్యముల నిర్వహింపఁగలఁడు. ప్రవేశపరీక్ష యుండినపుడు 6–వ తరగతిలోఁ జదివినవారి కీమాత్రజ్ఞానము కలుగుచుండెనుగాని యిప్పటి పద్ధతుల ప్రకారము చదువువారికీ జ్ఞానము కలుగునట్లు తోఁపదు. కాఁబట్టి 6–వ తరగతికి మీఁదుగ జదువలేనివారు క్రిందితరగతులందే యా భాషయం దామాత్రజ్ఞానము నింటియందుఁ జదివియైన సంపాదింపవలయును.

ఆంగ్లభాషయందుఁ బెద్దపరీక్షలఁ గడతేఱలేక పోయినంత మాత్రముచేతనే ధనముకీర్తి ప్రతిష్ఠలు సంపాదించు మార్గము లేకపోయెనని తలఁపకుము. దానిని సంపాదించు శక్తిగలుగుటకు కొన్ని గుణములు

పట్టుపడవలయును. అవి లేక యేభాష చదివినను బాగుపడవు. అవియున్నయెడల నొక భాష విద్యవచ్చినను కీర్తి ప్రతిష్ఠల సంపాదింతువు. ఆగుణముల నిప్పటినుండి సంపాదింపవలయును. గావున వానిని దెలిపెదను.

### కాలము

నీవు తొలుత కాలము విలువ నెఱుఁగవలయును. ఇది చాల ముఖ్యము నాయనా! లోకమునఁ బుట్టిన ప్రతిప్రాణియును జచ్చుట చూచుచున్నావుకదా. లోకముపుట్టి యెన్నివేల యేండ్లయినది? 200 సంవత్సరముల ప్రాయముగలవాఁ డొకఁడైన నున్నాఁడా? అటు మన జీవితకాలము పరిమితమైనది. ఏనాఁడో యొకనాఁడు పెద్దలలోఁ గలియవలసినవారమే. ఒకఁడు నూఱుసంవత్సరములు బ్రతికెననుకో వీనిలో నధమపక్షము 40 సంవత్సరములైనను నిద్రయందుఁ బోవునుగదా? బాల్యమున 12 సంవత్సరములు పోవునుగదా? తక్కిన 48 సంవత్సరములలో స్నానమునకు భోజనమునకు నధమపక్షము 10 సంవత్సరములు పోవుఁగదా. మిగత 38 సంవత్సరములలో వార్ధకమున నింద్రియపటుత్వము తప్పఁగా నేకార్యము చేయలేని కాలము 20 సంవత్సరములకుఁ దక్కువలేకుండఁ బోవునుగదా ఇఁక మిగిలిన 18 సంవత్సరములలో రోగములకు నొప్పులకు వ్యవహారములకు గృహకృత్యములకు ఇంటికి వచ్చినవారితో ముచ్చటలాడుటకు సోమరితనముచేత నైనను విశ్రాంతిగోరియైనను గడుపు కాలమెంతో యాలోచింపుము. ఇదిపోను వాస్తవముగ మనక్షేమార్థమై మిగులు కాలమెంతో లెక్కింపుము. 100 సంవత్సరములు బ్రదుకువాఁడు తనదియని 10 సంవత్సరముల కాలమును జెప్పుకొనలేకయుండ 50-60 సంవత్సరములలో మరణించువారి కెంతకాలము మిగులునో నీవే యాలోచింపుము. ఇంతకు మరణ మెప్పుడు వచ్చునో తెలియదు గనుక

బుద్ధిమంతుఁడు జన్మప్రయోజనము తెలిసిన వాఁ డొకనిమిషమైన వ్యర్థపఱుపరాదు. కొందఱు ధనవిషయమున యుక్తకార్యములందును అనఁగా తాను తనభార్య బిడ్డల సుఖసంరక్షణమందును అర్థులకు సాహాయ్య మొనరించుటయందును పిసినారులై యొకదమ్మిడి వ్యయపఱుప వలయుననిన నెంతో దుఃఖింతురు. అవమానము నరకలోక బాధయైన సహింతురు. ధన మీదినము వ్యయపడిన రేపు మరల సంపాదింపఁగలము. పోయినయొక నిమిషమును మరల రాబట్టఁగలమా? అంత విలువగలకాలమును ధారాళముగ వారు వ్యయపఱుతురు. కాఁబట్టి ప్రతిమనుష్యుఁడు కాలవ్యయమందు పిసినియై యొక నిమిషమైన దుర్వ్యయము చేయకుండవలయును. వారముదినము లెంతెంతకాల మే యే పనులందు వినియోగించితివో దినచర్యయందు వ్రాయుము. దానియందు 24 గంటలకును లెక్క యుండవలయును. ఒక్క నిమిషము నైనను విడువరాదు. ఇట్లు చేసితివేని నిష్ప్రయోజనముగ నీ వెంతకాలము వ్యర్థపఱుచుచున్నావో తెలియఁగలదు. దీనియందు నీ దురభ్యాసములు 30 మార్లు చీఁదుట 20 మార్లు గుడ్డ విప్పి కట్టుకొనుట ఒక పనికి 10 మార్లు వెనుకకు ముందుకు పోవుటకూడ నుండవలయును. చదువునపుడు తూఁగితివేని యానిమిషములను చదువుక్రింద వ్రాయక అని నిద్రయందే వ్రాయుము.

నీవు కాలమును సరిగ వ్యయపఱుప వలయునని నీ దినము పండుకొనుటకు ముందు రేపు చేయవలసిన కార్యములన్నియు గుర్తు వ్రాసికొనుము. ఉదయమున నిద్రలేచినది మొదలు ఆ కార్యము లన్నియుఁ జేయ నారంభింపుము. రాత్రి మరలఁ బండుకొనునపు డితరుల నీ వెట్లు నిష్పక్షపాతముగఁ బరీక్షింతువో యట్లే నిన్నుఁ బరీక్షించికొని కార్యములన్నియు ననుకొనినట్లు చేసితివా యేదైన విడిచితివా? విడిచిన యెడల దానికిఁ గారణమేమి? సోమరితనమా? యనుట నా లోచింపుము.

ఉడుపులు వేసికొనుటకు 5 నిమిషములకుమీఁద వ్యయపఱిచితివేని యాకాలము వ్యర్థమనుకొనుము. దొడ్డిలోను 3-4 నిమిషముల కెక్కువ కూర్చుండితివేని (వ్యాధిచే మలమూత్రములు చక్కఁగ శీఘ్రముగ రానప్పుడు తప్ప యెక్కువకాలము దుర్వ్యయ మనుకొనుము. చేసినపని మరలఁ జేయవలసి వచ్చెనేని యా కాలము వ్యర్థమనుకొనుము. చదువునపుడు భోజనమప్పుడు ముచ్చటలాడుచుఁ గాలహరణము చేసితివేని యది వ్యర్థమ. పండుకొనఁగానే నిద్ర రాదేని యదియువ్యర్థమ. నిద్ర మెలకువ రాఁగానే తటాలున లేవవేని యదియు వ్యర్థము. దోవతిని పలుమాఱు సవరించుకొను కాలము వ్యర్థమ. కల్పిత కథలు దుష్టగ్రంథములు, నవలలు చదువుకాలము వ్యర్థమ. 10 నిమిషములలోఁ జేయఁదగిన పనికిని, నడువఁదగిన దూరమునకును నంతకెక్కువకాలము తీసికొంటివేని యా యెక్కువ కాలము వ్యర్థమ. 7. గంటల కాలమున కెక్కువ నిద్రించితివేని యా కాలము వ్యర్థమ. మూఁడు కాలములందుఁ దప్ప నెక్కువ కాలము తిండికై కడుపుకాలము వ్యర్థమ. ప్రొద్దుపోక తిరుగువారితో దాక్షిణ్యముచేనైన ముచ్చటలాడుట కాలమును వ్యర్థపఱుచుటే. ఇవన్నియు నీచస్వల్ప విషయములుగాఁ దోఁచునేమోకాని యావగింజల్నీ చేరిన గుమ్మడికాయయగునని ప్రపంచ మఱవులచేనైనదని మఱవకుము. వీనిని చక్కదిద్దుకొనుటకుఁ బ్రయత్నించితివా కాలము కలసివచ్చుటే గాదు. నీ మనస్సు చక్కఁగ శిక్షితమై నీకు లోపడును. మనస్సు వెంట దేహము లోపడును. ఇది ముల్లోకములను జయించుటకంటె గొప్పకార్యమని తలంపుము. ఎప్పుడు నీ మనస్సు దేహము నీకు స్వాధీనపడునో యా నిమిషమునుండి నీవు మనుష్యుఁడవు. అంతకుముందు గావు. కోపగింపక నేను జెప్పిన యుపమానము సరిపోవునో పోదో యాలోచింపుము. నేను జెప్పిన యీ యల్పశిక్షకు లోపఱచి నీ మనస్సును నీ స్వాధీనమునకుఁ దెచ్చుకొని నీ యాయుస్సును పెంచుకొనుము. వ్యర్థవ్యయము

చేయకుండుట భాగ్యవంతుఁ డగుటకు నెట్లు ముఖ్యమో యట్లే కాలమును వ్యర్థపఱుపక సద్వినియోగము చేయుట యాయుస్సు వృద్ధిచేసికొనుట యందు ముఖ్యమని నమ్ముము. దమ్మిడీలను జాగ్రత్తగ కాపాడుము. రూపాయలు తమంత తావే జాగ్రత్తపడును. అను సామెత కాలవిషయమందును నన్వయించును.

కాలవ్యయముగూర్చి యింతదూరము చెప్పితి నని మెల్లఁగఁ జేయవలసిన కార్యములను దొందరపడి పాడుచేయకుము. మెల్లగ భోజనముచేయుట, స్నానము చేయుట, పెద్దలనుపచరించుట ఇతరుల కక్కఱ యవసరముల సహాయ్యము చేయుట, దేవపూజాది కార్యములు చేయుట, గాసిదీఱ విశ్రాంతికై వ్యాయామము చేయుట, పెద్దలతోను దెలిసిన వారితోడను తెలియని విషయములను తెలిసికొనుటకు లోకజ్ఞానము సంపాదించుట సంభాషించుట, కార్యార్థమైవచ్చిన వారితో మాటలాడుట, తెలియనివారికిఁ దెలియఁజెప్పుట, సద్గ్రంథములఁ జదువుట యీ మొదలైన కార్యములందును నారోగ్య నిమిత్తమున జ్ఞానవిద్యా పుణ్యముల సాంపాదించుట యందును వినియోగించు కాలము వ్యర్థపఱుపఁబడినది కాదు. అకాలనిద్ర, నచ్చుతనము, సోమరితనము ఇవన్నియుఁ గాలమును దొంగిలించు చోరులు.

## చదువు విధము

చదువునకుఁ గాలపరిమితి చెప్పఁజాలఁగాని దినమునకు 6 గంటలకు మించి చదువనక్కఱలేదు. చదువని నేను చెప్పినది కష్టపడి శ్రద్ధగలిగి తదేకధ్యానముతోఁ జదివినదంతయు మనస్సునకు వచ్చునట్లు చదివెడు చదువేగాని పుస్తకము చేతిలో నుంచుకొనియున్న కాలమంతయుఁ గాదు. ఈ విధముగ నాఱుగంటలు ప్రతిదినము చదువువాని కసాధ్యవిషయమేదియు నుండదు. వానిని విద్యయందు మించువారుండుటయు నరుదు. 12 గంటలు 16 గంటలు చదువువా

రున్నారు. గాని వారిలో నెందఱు ప్రసిద్ధికి వచ్చిరో యదిమాత్రము నేను జెప్పఁజాల. ఏలనఁగా వారిలోఁ దూఁగుపోతుల సంఖ్యమెండు. వారు చదువునది యేదియో వారికే తెలియదు. కన్నులు మూఁతలుపడుచుండ తల వ్రేలఁబడుచుండఁ బుస్తకము జాఱిబోవఁ బుస్తకములో లేనిది హీనస్వరముతో నోర వదరుచు నెలుకల చప్పుడో యెవరివైనఁ గాళ్ళచప్పుడో యయిన నులికిపడి లేచి బిగ్గఱగ నేదియో యొకటి వదరుచుందురు. ఏమిరా తూఁగుచున్నావా? యని పెద్దవారడుగ లేదు లేదు ఆలోచించుచున్నానని బొంకుదురు. ఈవిధముగఁ జదువువా రెన్నిగంటలు చదివిన నేమిఫలము? ఎన్ని యేండ్లు చదివి యేమి లాభము? యథాప్రకారసిద్ధిరస్తు అను దీవనకర్హులే. కాఁబట్టి శ్రద్ధతోఁ జదువునదియే చదువు. అట్లు చదువుకొనువానికి నాడుకొనను, నితర గ్రంథములు చదువుకొనను, ఇంటిపనులు చూచుకొనను, అన్నిటికి విరామముండును. తూఁగుబోతురాయఁడు తనకు నుపయోగపడఁడు. ఇంటివారికి నుపయోగపడఁడు. వాని కేపని చేయుటకు విరామముండదు.

ఈ గుణముకలవాఁడు దేనికిఁ గొఱగాఁడని నా నమ్మకము. చదువునపుడు దేహము నందు స్థితిని బాలక హితచర్యయందు వ్రాసియున్నాఁడను. దానిని గమనింపుము. కూర్చుండి పనిచేయవలసినవి లెక్కలువేయుట మొదలైనవి తప్పఁ దక్కినవి నిలుచుండి చదువుటే మేలు. నిలుచుండి యనఁగా స్తంభమువలె ననిగాదు. తిరుగుచు ననియర్థము. ఈ పద్ధతి తూఁగుఁబోతులకు మిక్కిలి మేలిచ్చును దీపము కంటికెదురుగ నుండరాదు. వెలుతురుమాత్రము పుస్తకముపైఁ బడుచుండవలయును. పెద్దవెలుతురులోఁ జదువుట చేతనే యనేకులకు నేత్రవ్యాధులు గలుగుచున్నవి. చదువుటకు ఆముదపు వ్రత్తిదీపము మేలు. ప్రతిదినము నిద్దుర లేవఁగానే చన్నీళ్ళతో రెండుకన్నులు తుడుచుకొనుము. నిద్రపోవుటకు ముందు నట్లే చేయుము. వెలుపలనుండి లోపలి కొలుకులకు

రుద్దుము. భోజనముచేసి చేతులు కడుగుకొనఁగానే రెండు చేతులొకదానితో నొకటి వేసి రుద్ది యా తడిచేతులతోనే రెండు కన్నులు రాచుకొనినయెడల నేత్రరోగములను హరించును. రాత్రులందు సన్నయక్షరములు చదువుట మంచిదికాదు. బొమ్మువంచి చదువవలదు. నీవు నడచునపుడు చదువునపుడు మఱి యెపుడైనఁగాని వెన్నెముక వంపులేక చక్కఁగా నుంచుకొనుము. ఇది యనేకవిధముల మేలు. దీనిని మఱవవలదు.

చదువునపుడు చదివెడి పాఠము విషయమై తప్ప నితరములయిన ముచ్చటలాడకుము. ఒంటరిగఁ జదువుట మేలు. ఒకసారి చదివినది మరలఁ జదువుపని లేకుండునట్లు చదువవలయును. ఒక పుస్తకము మూయునప్పటికి నందుఁ జదివినది మనస్సునకు వచ్చియుండవలయును. అఱగొఱ యుండరాదు. ఏనాఁటిపాఠ మానాఁటికి బాగుగ వచ్చియుండవలయును. లెక్కలుగాని మఱియేదిగాని నీవు కష్టపడి సాధింపవలసినదే గాని యితరులు చేసినదానిని వ్రాసినదానిని నీవు చూచి వ్రాసికొని పోవలదు. కష్టపడి శ్రద్ధతోఁ జదివెడిదానియందు బుద్ధియుంచి చదువుట కభ్యాసము చేసికొనుము. ఇది కేవలము సులభమని నేను జెప్పనుగాని కష్టపడక గొప్పతనము రాదనియుఁ బఠింపక జ్ఞానము కలుగదనియు నమ్ముము. దున్నక విత్తినఁ గోయక పండును అని సామెత. మతి యెంతో గతి యంతే. కొన్ని పాఠములందు నీకు రుచిలేక యుండవచ్చును. గానికష్టపడి చదువుట యనునది యభ్యాసపడినచో నీకు నసాధ్యమైనది యుండదని నమ్ముము. విద్యయందు సామర్థ్యము కలుగవలసియుండిన నోపిక, పట్టుదలయుఁ జదివినది చక్కఁగ విమర్శించుటయు నత్యంత ముఖ్యములు. ఇవిలేక వచ్చెడివిద్య నిలిచి యక్కఱ కుపయోగపడు విద్యకాదు. నీవు చదువు దానిలోని నీతివాక్యములుగాని మంచి వాక్యములుగాని పద్యములుగాని యుండిన వానిని కంఠస్థలములుగ వల్లింపుము. ఇటు చేయుట చాలమేలు.

ఒక్కపుస్తకము చదివి విసుఁగు వచ్చినపుడు పుస్తకమావలఁ బాఱవైచి పండుకొనకుము. పెత్తనములకుఁ బోకుము. ఆ పాఠము విడిచి మరియొకటి చదువుము. ఏ పని పెట్ట మనస్సును సోమరిగా నుంచుటకంటె పనిని మార్చుటచే దానిని విశ్రాంతి కలిగించుట చాలమేలు. అప్పుడు విసుఁగుదోఁపదు. ఈ విధముగ నీ వెంత చదివినను మనస్సునకు గాసిలేదు.

మెల్లగ నమలక గబగబ మ్రింగిన యాహారమును కడుపు జీర్ణమును చేసికోలేనట్టు మెల్లగ నాలోచించుచుఁజదువక గబగబ శీఘ్రముగఁ జదువునట్టి చదువును మనస్సు జీర్ణింపఁ జేసికొనలేదు.

కల్పితకథలు చదువుటచేఁ గలుగు నష్టము సూక్ష్మముగఁ జెప్పెదను. జీవితకాలమూ పరిమితము. నేర్చుకొనవలసిన విషయమా యపారము. సాధింపవలసినదియా విస్తారము. జన్మోద్దేశమా విడువరానిది. ఇట్లుండ నెవ్వఁడు బుద్ధిమంతుఁ డాయువు దుష్కార్యములందుఁగాని సత్ఫలమునీయని కార్యములందుఁగాని వ్యర్థము చేయఁగోరును? కాలము పరిమితమని యంగీకరించినప్పుడు ఆ కాలములో నీవు దుష్టములో లేక నిష్ప్రయోజనములో యగు గ్రంథములను జదివితివేని చదువవలసిన సద్గ్రంథములు చదువక విడువవలసివచ్చును గదా! 3 గంటల కాలములోఁ బ్రశ్న పత్రములోని ప్రశ్నల కన్నిటికిఁ బ్రత్యుత్తరములు వ్రాయవలసియుండ నందులోఁ గొంతకాలము బొమ్మలు వ్రాసికొనుచునో దిక్కులు చూచుచునో యుండినఁ బ్రశ్నములు కన్నిటికి నుత్తరములు వ్రాయగలవా? నీ జీవితకాలమును వ్యర్థగ్రంథములను జదువుట యందు వినియోగించితివా సద్గ్రంథములను జదివి సంపాదింపవలసినంత జ్ఞానము సంపాదింపలేక పోదువుకదా! అవశ్యము సంపాదింపవలసిన జ్ఞానము సంపాదింపవేని మనుష్యజన్మము వ్యర్థముగదా!

ఎప్పుడు కల్పితకథయని చదువఁ బూనితివో యప్పుడే యది యసత్యవిషయ మనుట మనస్సునకుఁ దెలిసినదే కదా? అసత్యమైనదానిని జదివిన లాభమేమి? ఇహమున కుపయోగించునా? పరమున కుపయోగించునా? దానిని జదువుట యందుఁ గడపిన కాలము వ్యర్థమేకదా! వ్యర్థమైనమేలే. ఈ దబ్బిలి కథలయందు విషయమేమి? దొంగతనముచేసి తప్పించుకొనుటో, అంకుతనముచేసి తప్పించుకొనుటో, మన జీవిత కాలములో మన కెన్నఁటికి ననుభవమునకు రాని వాస్తవముగా జరగని గండములనుండి తప్పించుకొనుటో యిట్టిదైయుండును. గ్రంథకర్త యెంత నేర్పరియైనఁ జదువువాని కంతకీడు. చదువునప్పు దుద్రేక మెక్కువయగును. కావున సారాయమునం దెట్టిగుణమో నవలలని చెప్పఁబడువాని యందు నంతియ గుణము. కావున దేశాభ్యుదయము, జ్ఞానాభ్యుదయము గలిగింపని యట్టి గ్రంథములు వానియందలి విషయములు సత్యములైనను అసత్యములయినను దుష్టములే. వీనికంటెఁ బిట్టకథలు, కాకికథ లెన్నిమడుఁగులో శ్రేష్ఠములు వినోదకరములు. అవి నిజములని మోసపోకుము. స్పష్టముగ నసత్యములవి తెలియవచ్చు పిట్టకథలకంటె నసత్యమును సత్యరూపముగాఁ దెలుపు గ్రంథము లెక్కువకీడును గలుగఁజేయును. కావుననే యాంగ్లభాషయందు నవలల పుస్తకములు గర్హ్యములని ప్రతి గ్రంథకర్తయు వ్రాసియున్నాఁడు. వినోదకరములు, జ్ఞానవృద్ధికరములు, ఉభయలోక క్షేమకరములు భాషాభివృద్ధికరములు నగు సద్గ్రంథములు కావలసినన్ని యుండ కొఱగాని పుస్తకములు, దుష్కామ మభివృద్ధిచేయు గ్రంథములు బుద్ధిమంతుఁడు చదువరాదని నాయభిప్రాయము. ఆయుష్కాలమును వ్యర్థముచేయఁ గోరువారు చదువవచ్చును.

వార్తాపత్రికలయం దేదైన నొకటి స్వదేశపత్రిక చదివినఁ జాలును. అన్యభాషయందు వ్రాయఁబడినదానికంటె స్వభాషయందు వ్రాయఁబడినదే

శ్రేష్ఠమని నాయభిప్రాయముగాని యంతటి గుణము కలిగినదిగా నుండవలయును. కులనీతి మతాచారభాషలయం దభిమానము లేక స్వప్రయోజనమునకై వాని విషయమున స్వాభిప్రాయముల నిచ్చవచ్చినట్టు వ్రాయువారి వ్రాఁతలను వ్రేలువేసియైన నంటకుము. ఇట్టి వారు తాము చెడియున్నందున నితరులను దమలో కలుపుకొనఁజూతురు. వానికిఁ బెట్టెడు డబ్బు వ్యర్థము, హానికరము. స్వప్రతిష్ఠకై వచ్చినదంతయు సత్యమని పల్లెటూళ్ళ వారివలె మోసపోయితివా చెడితివి. విద్యార్థిదశయం దున్నాఁడవు. కావున విద్యసంపాదించుటకు నడ్డపడునట్టియు నుత్తరకాలమునకుఁ బ్రయోజనపడనట్టియు విషయములనెల్ల వదలయును. విద్య నేర్చుట జ్ఞానము సంపాదించుటకని, తెలియని సద్విషయములఁ దెలిసికొనుటకని జ్ఞప్తియం దుంచుకొంటివేని నీవు వక్రమార్గమునఁ బోఁజాలవు.

## అభ్యాసము

ప్రతి మనుష్యునకు మంచివో చెడ్డవో కొన్ని యభ్యాసము లుండును. ఇట్టి దురభ్యాసములకు లోపడి పెద్దవారైనపుడు పరితాపపడువా రెందఱోగలరు. అభ్యాసములు చిన్న నాఁటనే పట్టుపడును. కావున బుద్ధిమంతుఁ డగువాఁడు చిన్న నాఁడే మంచికార్యము లభ్యాసపడఁ బ్రయత్నింప వలయును. 'అభ్యాసము కూసువిద్య'యనునది జ్ఞప్తియందుండిన నభ్యాసమున సాధింపరాని వేదియు లేదని తెలియఁగలవు. అన్నిటికంటెను సాధింపఁ గష్టమైన బ్రాహ్మవిద్య యభ్యాసనముఁగాక మఱి దేనిచేఁ గలుగును? కావున మంచి యభ్యాసములకు బాలుపడినవారు బాగుపడుదురు. దురభ్యాసములకుఁ బాలుపడినవారు చెడుదురు. ఎట్టిదైనను అభ్యాసము చేసికొనుట సుళువు. మనస్సు దృఢముగా నుండవలెను. అది లేనివాఁడు నడిసముద్రములోఁ దుపానువాత పడిన పడవవంటివాఁడు. క్లుప్తకాలమునకు సరిగ నునుకొనిన పనిని కొలఁది దినములు చేసితివేని

తరువాత నీయంతట నీవే యితర సాహాయ్యము లేక స్వభావసిద్ధమైన కార్యమువలెనే దానిని చేయుచుందువు. ఇన్ని గంటలకు నేను నిద్రలేవలయునని నిశ్చయించుకొంటివా నెలదినములు సరిగా ప్రయత్నపడి వేళకు నిద్రలెమ్ము. తరువాత నీవు వలదనుకొనినను ఆ వేళకు సరిగ మెలకువ వచ్చును నస్యమువేసికొనుట, చుట్టలు, సారాయము కాఫీ నీళ్ళు తేయాకు నీళ్ళు త్రాగుట, గోళ్ళు కొఱుకుట, ఇండ్లు తిరుగుట వ్యర్థభాషణము, చీట్లాడుట తిట్టుట తినరాని పదార్థములు దినుట, చేయరాని కార్యములు చేయుట, ప్రొద్దుపోయి నిద్రలేచుట మొదలైన దురభ్యాసములన్నియు వాడుకవలనఁ బట్టుపడినవే.

**1. నీవు బాగుపడఁ గోరెదవేని యివి యభ్యసింపుము.**

రేపు చేయవలసినపను లీ దినమే నిశ్చయించుకొనుము. మఱుసటివాఁ డా పనులన్నియుఁ జేయవలయునని పట్టుపట్టి చేయుము. శక్తికిమించి నన్నిపనులు పెట్టుకొన రాదు.

**2. ఎడతెగక పాటుపడుట యభ్యసింపుము**

పనియనిన విసుఁగుకొనక, చేయవలసివచ్చెనే దేవుఁడా! యనక, సొణుగుచు మూల్గుచు గంట కొకయడుగుపెట్టక, నఱమనస్సుతోఁ జేయక, యుత్సాహముతో నుల్లాసముతో వినోదక్రీడవలెఁ గార్యములుచేయుము. దినమునకు మూఁడుమైళ్ళు నడచుఁవా డేడేండ్లలో భూమినంతయుఁ జుట్టిరాఁ గలఁడు. పాటుపడుట యనఁగా క్లప్తకాలములో క్లప్తకార్యములు చేయుటగాని 24 గంట లేదో యొకపని యేద్చుదాని మగఁడువచ్చిన నామగఁడు వచ్చునని చేయుచుండుట గాదు. తూఁగుఁబోతుల చదువు చదువెట్టుకాదో యట్లే తూఁగుచు నేదో యొకపని చేయుచుఁ గాలుసేతు లాడించుచుండుట పాటు పడుట కాదు. చక్కఁగఁ దెలివితో పాటుపడువానికి విరామము మెండు. తూఁగుచుఁ బని చేయువానిని దినమంతయు పనియే. 'కూఁతలార్భటమేగాని కుప్పలో గింజ నులియదు'

అన్నసామెత మఱవవేని నిజముగఁ బాటుపడువాఁ డెట్టివాఁడో తెలియును. చక్కఁగఁ బాటుపడువాఁ డే యే కాగితమును పుస్తకమును కొఱముట్టును నెక్కడెక్కడ నుంచవలయునో యక్కడనే యుంచును. సమయము వచ్చినపుడు దానికై వెదకికొనఁడు. చేయుకార్యము తొందరలేక మెల్లగనే చేయును. చేయుపని చక్కఁగ నుండును.

**3. పనియందుఁ బట్టుదల యుండవలయును.**

ఒక కార్యమునకుఁ బూనినపుడు దానినెంతైనఁ గష్టపడి చేయవలయునను పూనిక యుండవలయును. ఈ పని సగము చేసి విడిచి మఱియొకటి పూరి యిదిచేయుదమా అది చేయుదమా యని సందేహించు వాఁడేపని చేయలేఁడు. దీనికే 'కొండమంగలి క్షౌర'మనిపేరు. తిరుపతి కొండమీఁది మంగలవాఁ డొకనికి క్షౌరము చేయఁబూని గడ్డము క్షౌరముచేయుచుండఁగా నింకొకఁడు వచ్చిన యెడల చేయుపనిని వదలి వానికి మీసమును గొఱుగును. ఇంతలో మఱియొకఁడు వచ్చిన వానికిఁ దలగొఱుగఁ బ్రారంభించును. ఒకనికిని కార్యము పూర్తిచేయఁడు. అందఱు కాచుకొని యుండవలసినవారే. వాని కిది లాభకరమే. తక్కినవారిట్లుచేసిన చెడుదురు. పట్టుదల లేనివాఁ డేకార్యము చేయుటకు నసమర్థుఁడే.

**4. క్లుప్తకాలమునకు సరిగఁ బనిచేయుము.**

ఏ కార్యము చేయుట కేకాలము నిర్ణయించుకొనెదవో యా కాలమం దా పనిచేసి తీరవలయును. భోజనమునకైనను నిద్రకైనను సభలకైనను పాఠశాలలకైనను పనులకైనను క్లుప్తకాలమునకు సరిగఁ బోవలయును గాని తామసింపరాదు. ఒకరు నీ నిమిత్తమై కాచుకొనియుండునట్లు చేయరాదు.

**5. వేకువ నిద్రలెమ్ము.**

7 గంటలకు నిద్రలేచువాఁడవు 5 గంటలకు నిద్రలేచిన దినమునకు రెండుగంట లాదాయము. ఆ రెండుగంటల కాలములో నెంతపని చేయవచ్చునో యాలోచింపుము. దినదినమాప్రకారము చేసిన నెంత

గొప్పకార్యము చేయరాదు? రాత్రి 10 గంటలకుమీఁద మేలుకొనవలదు. ఉదయము 5 గంటలకుమించి పండుకొనవలదు. ఇది బ్రతికినంతకాల మొక విధిగా నేర్పఱుచుకొనుము. పగటినిద్ర యారోగ్యకరముకాదు.

**6. నీకు లభ్యపడిన ప్రతి మనుష్యునివలన నేదోయొక క్రొత్త విషయము నేర్చుకొనవలయును.**

లోకములో సర్వజ్ఞుఁ డొక్కఁడును లేఁడు. పొలము దున్ను వానికిఁ దెలిసినవిషయము లుద్యోగస్థులకుఁ దెలియవు. గుఱ్ఱపువానికిఁ దెలిసినవి కాఁపువానికిఁ దెలియవు. ఒక్కొక్క వృత్తియం దుండువానికి నితరులకుఁ దెలియని విషయములు తెలిసియుండును. గనుక నందఱవలనను మనము క్రొత్తవిషయములు నేర్చుకొనఁదగును. ఇప్పు డీ విషయములతో నా కేమిపని యనకుము. నీ జీవితకాలములో నీకు వానితోఁ బనిపడును. ఎంత పనికిమాలిన వస్తువునైనను వర్తకుఁడు పాఱవేయక యెత్తి యుంచును. దానితోఁ బనిపడినవాఁడు వచ్చినపుడు ఒకటికి నాలుగంతలు వెలచెప్పి యమ్మును. కావున విషయసంగ్రహణ మవశ్యకర్తవ్యము. ఇట్లనుటచేఁ బ్రతిమనుష్యునియొద్దకుఁ బరువెత్తి మనుష్యునియొద్దకుఁ బరువెత్తిపొమ్మని నా యభిప్రాయము కాదు. నీ వంగడికిఁ బోవుచున్నాఁడవనుకో లేక బండిలోఁ బ్రయాణము చేయుచున్నావనుకో. తూఁగుచు తల వ్రేలవేసికొని పోవుటకు మాఱుగ త్రోవలోఁ దటస్థపడిన విషయములను గ్రహింపరాదా? పదార్థములను జూడరాదా? ఏదైన వింతగానుండిన నేమదియని విచారింపరాదా? ఇట్లు చేయకుండరాదని నా యభిప్రాయము. సమయమును వ్యర్థపఱుపరాదు.

**7. ఒక విషయము పూర్తిగఁ దెలియకముం దిది యిట్లని నిశ్చయించు కొనకుము.**

ఒక విషయమై యొక యభిప్రాయము నిశ్చయించుకొని యా ప్రకారము నడువవలసియుండునేని యా విషయమై పూర్ణముగ విచారింపక

నిశ్చయించుకొనకుము. ఒకఁ డౌనన్నాఁడని నీవు అవును అనవలదు. ఒకఁడు కాదన్నాఁడని నీవు కాదనవలదు. ఉభయపక్షములు పూర్ణముగ విచారింపుము. ఈ విచారము కులనీతి మతాచారవిద్యలందు నత్యంతావశ్యకము. ఒకఁడు స్థూలకాయుఁడో ధనవంతుఁడో యధికారియో మన నీతి మతాచారములు లోనైనవి మంచివి గావనిన నంతటివాఁడు చెప్పినాఁడే నిజమే యనుకొనుము. ఇది వఱకిట్లుండ వీఁడిట్లుచెప్పఁ గారణమేమి? సత్యము తెలిసి చెప్పుచున్నాఁడా? స్వప్రయోజనమునకై చెప్పుచున్నాఁడా? ఏమి కారణము! అని బాగుగఁ దెలిసినవారి నడిగియో యా విషయముగల గ్రంథముల నన్నిటిని జదివియో తీర్మానించుకొనుము. ఈ కాలమున మన కులనీతి మతాచారముల దూషించువారు మనలోను గలరు. అన్యమతములందును గలరు. వీరిలోఁ గొందఱు పూర్ణముగ విషయము తెలియనివారు. కొందఱు స్వప్రయోజన ముద్దేశించి స్వలాభమునకై చెప్పువారు. కొందఱు కూలికి విషము త్రాగువారు. తాఁ జెడ్డ క్రోఁతి వనమెల్లఁ జెఱిచె ననుసామెతకు లక్ష్యభూతులు కొందఱు. కొందఱు అన్యమతస్థుల యభిమానము సంపాదింపఁ గోరినవారు? తెలియనివారిని మోసపుచ్చి తమలోఁ జేర్చుకొనుటకై యీ యుపస్కర మిట్లుండవలెను. ఆ యుపస్కర మిట్లుండవలెనని భారత రామాయణ మనస్మృత్యాదుల నుదహరించి గద్దెపొంకములు కొందఱు చెప్పుచుందురుగాని వారు వ్రాసినవి వారు చెప్పిన గ్రంథములలో నుండవు. ఒకవేళ నుండినను వారనుకొనిన యర్థముండదు. కాఁబట్టి నీవు తత్త్వమరయక యొకరిమాటను నమ్మవలదని యంటిని. ఒకరు తోలినట్టు పోవునది పశువు. స్వబుద్ధి నాలోచించువాఁడు మనుష్యుఁడు.

## 8. మిత్రుల నార్జింపుము

దుర్గుణము సహవాసముచేతనే లభించును. కాఁబట్టి నీవు పరులతో సహవాసము చేయునపుడు మిక్కిలి హెచ్చరికగలిగి యుండుము.

ధనమార్జించుటకంటె మిత్రుల నార్జించుట కష్టము. ధనమును గాపాడుకొనుటకంటె మైత్రికాపాడుకొనుట కష్టతరము. ధనము చేయఁజాలని పని మైత్రిచేయును. కావున మిత్రుల సంపాదింపుము. అక్కఱ యవసరముల కారణమున నీయొద్దకుఁ బనిపడి వచ్చువారందఱు మిత్రులనుకొనకుము. పరిచితులు వేఱు. మిత్రులు వేఱు. మిత్రులు నీ కష్టములందు నాదుకొందురు. నీయందు దోషముండినఁ గోపించియైన నిన్ను సవరింపఁజూతురు. తమరహస్యమును నీతో మనసువిచ్చి చెప్పుదురు. నీ రహస్యమును వారెన్నఁడు వెలిపుచ్చరు. మిత్రుఁడు చాలదుర్లభుఁడు.

**తే. "మొదలు చూచిన కడు గొప్పపిదపఁ గుఱచ**
**నాదిఁ గొంచెము తర్వాత నధిక మగుచుఁ**
**దనరు దినపూర్వ పరభాగ జనితమైన**
**చాయపోలికఁ గుజనసజ్జనుల మైత్రి"**

యనుట యెంతయు సత్యము. ప్రొద్దుపోక నీతో ముచ్చటలాడుటకై వచ్చువారు మిత్రులుగారు. నిజమైన మిత్రులతోఁ గాలముగడపుట వ్యర్థమనరాదు. నీతోడివారిలో నెవఁడైన పొగచుట్టలు త్రాగువాఁడు, సారాయి త్రాగువాఁడు, దురభ్యాసములు గలవాఁడు, మట్టుమర్యాదలు మానావమానము లెఱుఁగక మాటలాడువాఁడు, సోమరి, కల్లరి, దొంగ, క్రూరుఁడు, జూదమాడువాఁడును, దైవమునందుఁ దల్లిదండ్రులయందుఁ, బెద్దలయందుఁ దిరస్కారబుద్ధి కలవాఁడు, దుష్టజన సహవాసము కలవాఁడు నుండెనా వానితో స్నేహము మానుము. దుష్టసహవాసముచేఁ జదువునందు శ్రద్ధలేనివారు దొంగతనము, అంకుతనము, సారాయిత్రాగుట, చుట్టలుపీల్చుట మొదలగు దుర్గుణములకుఁ బట్టుపడి చెడినవారనేకులు గలరు. నాకు పద్మనాభశాస్త్రులవలె మీకు లక్ష్మీనరసారెడ్డివలె నిజమైనమిత్రుఁ డందఱకు దొరకుట మిక్కిలి దుర్లభము. నిజమైన

మిత్రుఁడు నీకై ప్రాణమైన నిచ్చుననఁ దక్కినమాటలేల? అట్టివానితోడ మైత్రి సంపాదింపుము. అట్టివారు దొరకకుండిన నూరకుండుము. చెడ్డవారిని మిత్రులుగాఁ గొనుటకంటె మిత్రులే లేకుండుటమేలు. పెట్టుచుండినఁ దినువారందఱు మిత్రులుగారు బంధులుగారు. నిజమైన మిత్రుఁడైన దొరకును గాని నిజమైన బంధువు దొరకుట దుర్లభమని నాయభిప్రాయము. అక్కఱ కాదుకొనవారే బంధువులు. తక్కినవారు ఋణబద్ధులు. "చుట్టాలు దొంగలు సుతులు ఋణస్థు"లను భాగవత వాక్యము స్మరింపుము. సమయము వచ్చువఱ కెవరెట్టివారో తెలియఁబడదు గావుననయినవారిని చుట్టములనుగూడఁ బరిచితులవలె గౌరవింపుము. పరులు నీ కుపకారము చేయకుండినను నీ వుపకారబుద్ధి మానకుము. పరులకైన నీవు నీశక్తికొలఁది తోడ్పడుము. నిరుపాధిక బంధువు, మిత్రుఁడు, గురువు, సర్వము దైవమేయని నమ్ముము.

**కం. రాముఁడె నా జనకుఁడు శ్రీ**
**రాముఁడె నాతోడు, భర్త రాముఁడె చుమ్మీ**
**రాముఁడె నమ్మిన చుట్టము**
**భూమిపునెదలేదు జనకబుద్ధి సుమంత్రా!**

అను లక్ష్మణ వాక్యము ప్రతిదినము స్మరింపుము. మిత్రుడు విరోధించెనేని శత్రువుకంటె నెక్కువకీడుచేయును గావున రహస్యములు చెప్పుటయందు హెచ్చరిక కలిగియుండుము. శుద్ధుఁడని స్థాపితుఁడైన మిత్రునకుఁదప్ప మైత్రినటించువారి కందఱకు నీ రహస్యములు చెప్పకుము.

## 9. కామ క్రోధములకు వశపడకుము

కామ క్రోధలోభములు మూఁడు నరకద్వారములని భగవద్గీతయందుఁ గలదు. కాఁబట్టి వీనికి వశుఁడవు కాకుము. నీవు చేయవలసిన కార్యము చేయకుండినను సరిగా చేయకుండినను చేయరాని కార్యము చేసినను,

నీ మేలుకోరినవారు నిన్ను దూషించినను, దండించినను, కోపించి బిఱ్ఱబిగిసికొని మూతి బుద్దగించుకొని ముప్పందుము మ్రింగినవానివలె నుండకుము. తెలివితక్కువకుఁ దోడుగ నీ దుర్గుణముకూడ నుండిన నీవు బాగుపడుట కష్టము. మనమీ య కార్యము చేయుటచేఁగదా! దండించిరి. ఇఁకమీద నిట్లు చేయరాదని బుద్ధిగలిగి వర్తింపుము. కామినీ కాంచనములందు నధర్మమైన కోరికయే దుష్టకామము. ధర్మయుక్తమైన కోరిక చెడ్డదిగాదు. నీ పరువును మించినది కోరకుము.

## 10. నీ స్థితికిఁ దృప్తిపడి యుండుము

పరుల ధనమునకు, విద్యకు, తేజమునకు మనస్సున దుఃఖింపకుము. నీకు భగవంతుఁ డిచ్చినదే పదివేలనుకొని నీ కంటెఁ దక్కువస్థితియం దుండువారినిజూచి సంతోషింపుము. విద్యయు ధనము పోయినజన్మమున నెంత దానము చేసితివో యంతకుమించి రాదు. కావున నీవు వాని లేమికై దుఃఖించి లాభములేదు. ఈ జన్మమందైన వానినిగుఱించి యెక్కువ ప్రయత్నము. ధర్మమార్గమునఁ జేయుము. తేజము కేవలస్వార్జితము. నీ మనోనియతి నడవడిపట్టి యుండును. 'ఆడలేనిబోగముది మద్దెలకానిపై పడి మొత్తుకొన్నట్టు' నీవు సంపాదించుకొనలేక యొరులఁజూచి దుఃఖింపనేల?

## 11. ఆకాశమునకు మెట్లు కట్టకుము

## 12. ఇంటఁగాని బైటఁగాని చీటికి మాటికి నొకరిని తప్పుపట్టుట, యూరక నసగొట్టుట, అందఱు నీకంటెఁదక్కువ వారని యెంచుట, గర్వము, మేఁకపోతు గాంభీర్యము ఇవి మొదలుముట్ట వదలవలయును.

పలుమాఱు తప్పులుపట్టుట ప్రీతినిజెఱచును. నసగొట్టుటవలన నీయందుఁ బరులకు నీచాభిప్రాయము పుట్టును. నీ మనస్సు ఉదారస్వభావము గలవాఁడు సహనము కలిగి యొకరిని చీటికి మాటికి

దెప్పఁడు. నసనస లాడుచుండఁడు. కారణము లేక నీవనచే విసిరించుకొనుట దేహము పిసికించుకొనుట, కాళ్ళుపిసికించికొనుట మొదలగు నుపచారములు నీకు సేవచేయువారుండినను గూడఁ జేయించుకొనకుము. రోగములు నొప్పులు వచ్చినపు డావశ్యకమగునేని కొంచెముగ నుపచారము చేయించుకొనవచ్చును గాని గూటమువలె నుండి యితరులచే సేవలు చేయించుకొనుట దురభ్యాసము. తలంటుకొనువాఁడు దేహము పిసికించుకొనవచ్చును. ఎన్నఁడైన దూరము నడచివచ్చినపుడు కాళ్లుపిసికించికొనవచ్చును. ఎండలోనుండి బడలి వచ్చినప్పుడు విసరించుకొనవచ్చును. వచ్చువంటిని గాని వలయుననలేదు. అంతేగాని నిత్యకృత్యముగాఁ జేయించుకొనరాదు. ఈ దురభ్యాసము చిన్నప్పుడు పట్టుపడి యిప్పటికి పోక దుఃఖపడుచుండు నాపరిచితుఁ డొకఁడు కలఁడు.

## సంభాషణములు

నలువురిలో మాటలాడునపుడు క్షుద్రవిషయముల గుఱించి ప్రాస్తావింపకుము. నీకుఁదెలియని విషయములు పరులవలనఁ దెలిసికొనుటకై యత్నింపుము. ఎదుట లేనివానిఁగూర్చి కీడుగ భాషింపకుము. పదిమంది స్నేహితు లొకచోటఁజేరి సంభాషించుచుండువారు. వారిలో నొకఁడు ప్రతిదినము కట్టకడపట లేచిపోవుచుండెను. ఆయింటి యజమానుఁడు ప్రతిదినము నీవు వెనుకఁబడెదవేల? యనియడిగెను. నేను ముందుగఁ బోయినఁ మీరందఱు నన్నేమి నిందలాడుకొందురో ఆ యవకాశము మీకు లేకుండఁ జేయుటకు నందఱు పోయిన తరువాతఁ బోవుచున్నాననెను. ముఖప్రీతి మాటలకు సంతోషింపకుము. భగవంతుని విషయమైగాని పెద్దలవిషయమైగాని యలక్ష్యముగ భాషింపకుము. ఉపచారము చేయకుండిన మానెనుగాని యపచారము చేయనేల? దుర్భాషలమాటలాడకుము. అటు

మాటలాడువాఁడు పెద్దమనుష్యుఁడు గాఁడని నమ్ముము. నిన్ను, నీ స్నేహితులను, నీవు చేసిన కార్యములను, గుఱించి నీవే ప్రశంసింపకుము. సామెత లుపయోగించునపుడు పూర్వవాక్యము లుదాహరించునపుడును శబ్దములను వాని యర్థము ప్రయోజనమెఱిఁగి సమయోచితముగ నుండినఁ జెప్పుము. ఈ నడుమ వెలువడిన యొకగ్రంథము చదువుచుండఁగా నొకఁడు మఱియొకనికి నమస్కరించి అయ్యా! నా నమస్కారము గైకొనుము. 'దండం దశగుణం భవే'త్తని కలదు కదా. నాకిది పదివిధముల మేలని చెప్పెను. ఈ గ్రంథకర్త బవిసి యాఱుట కిదియొకటి చాలును. పరమహంస గోక్లేగారి చరిత్రమని యొక గ్రంథమును జూచితిని. ఈ వ్రాఁతకాఁడు పరమహంస శబ్దమున కేమి యర్థమనుకొనెనో? ఒకానొకపెద్ద న్యాయవాది నిండుసభయం దుపన్యసించుచు మన విద్యార్థులను బహిర్భూమికిఁ బంపిన వృద్ధికివత్తురు అని ప్రసంగించెను. నలువురితో మాటలాడునపుడు పండితునివలె భాషింపకుము. మనస్సు ఆలోచనలు నిర్మలముగ నుంచుకొని మాటలాడుము. నీతల్లి, తోడఁబుట్టు, కూఁతురు విని లజ్జించుమాటలు పలుకుము. ఏదైన విషయము చెప్పునపుడున్న దున్నట్టు చెప్పుము. తనదికొంత తాళ్ళపాకవారిదికొంత యన్నట్టు నీవు సగము కల్పించి చెప్పకుము. ఉల్లాసముగ భాషింపుము. నిన్నెదిరించి మాటలాడువాని విషయమందైన నసూయ విడుము. న్యాయస్థానమున న్యాయవాదు లెట్లు వాదింతురో యావలనెట్లు మిత్రులై యావలనెట్లు మిత్రులై యుందురో చూడుము. సంభాషణవిషయమై కొన్నివిధు లొకయాంగ్లగ్రంథమున నీయఁబడినవి. అవినీకుఁ దెలియవ్రాసెద.

1. పుస్తకములను సావాసులను నీ లాభమునకై యేఱికొనుము. మంచి పుస్తకములవలె సహవాసులను నీ మనస్సున కుల్లాసము కలిగించువారుగను నీకు మేలుగలిగించు వారుగ నుండవలయును.

ఉల్లాసము, లాభము ఇతరులవలన నీకుఁ గలుగదేని నీవైన వానిని గలుగునట్లు చేయుము. ఇచ్చుకోలు పుచ్చుకోలు రెండు సాధ్యపడకపోయెనా ఆ జనులవిడిచి లేచి పొమ్ము.

2. సంభాషించువా రెట్టివారో తొలుతఁ దెలిసికొనుము. నీకంటె గొప్పవారై రానీకుఁ దెలియనివిషయము లడిగి తెలిసికొనుము. నీకంటెఁ దక్కువవారైనా తెలియఁ జెప్పుము.

3. ముచ్చట చప్పనైనపుడు నలువురు మాటలాడఁ దగిన విషయము ప్రశంసింపుము.

4. మంచివిషయము లెవరైనఁ జెప్పిరా వెంటనే దానిని గుర్తువ్రాసికొనుము. తక్కినవన్ని మఱచిపొమ్ము.

5. నలువురిలో నూరక బొమ్మవలెఁ గూర్చుండకుము. మౌనము మంచిదిగాదు. ఇతరులు అహంకారమని తలంతురు. నలువురిని సంతోషపఱుచు మాట లేవైనఁజెప్పుము. అణఁకువతో మాటలాడుము. అందఱు నూరకుండిన నీ వేదైన ప్రశంసకుఁదెచ్చి మౌనసముద్రఁ బాపుము. నిన్నుఁజూచి నలుగురు నవ్వునట్లు మాటలాడకుము.

6. తొందరపడి యార్భటింపకుము. ఒకవిషయమైనా నాభిప్రాయములు వెలువడునపుడు నలుగు రేమి చెప్పుదురో విని యాలోచించి యిది యిట్లని నిర్ధారించుకొని పిదప మాటలాడుము. ఒక మంచివిషయమును ఒకసభలో రెండుమార్లు చెప్పకుము.

7. ప్రతివిషయము నాక్షేపించుటే యొకపనిగాఁ బెట్టుకొనకుము. నీకుఁ దెలియక పోయినంతమాత్రమున నెదుటివారు చెప్పినదాని నాక్షేపింపకుము. తెలియకుండిన విషయము నడిగి తెలిసికొని మరల మాట్లాడుము.

8. సభలోనివారు నిందలాడినను బందుబూతులాడినను సరిగాదని చెప్పుము. లేక యూరకుండుము. అదియు సహింపరాకున్న నందు నిలువక వెడలిపొమ్ము.

9. తక్కినవారికంటె నీవు శ్రేష్ఠుఁడవని యభిప్రాయము పుట్టింపవలయునని నటింపకుము.

10. ఇతరుల మాటలందు నధికప్రసంగితనముగ నీకుఁ దోఁచినది యితరుల కట్లు దోఁపక పోవచ్చును. కావున సహింపుము. దానివలన నేదైన నెఱుఁగఁగలవు.

11. మొండివాదములు వాదింపకుము. నీతప్పు సవరించుకొను నుదారభావము కలవాఁడవై యుండుము.

12. నలువురిలోఁ గోపపడకుము. ఎవ్వరైన నిన్ను ధిక్కరించి బిగ్గఱగా నఱచిమాట్లాడినను నీవు శాంతమును బాయకుము. తక్కినవారు నీయందే పక్షపాతము వహింతురు. వివాదవిషయము పరిష్కరించుకొనుట కది తగినస్థలముకాదు. కలహస్వభావము గలవాఁడు కలకాలము కలహముతోనే కడపవలసి వచ్చును.

13. నాలుక యేల యీయఁబడినదో బాలక హితచర్య యందుఁ జదివి దానికి విరుద్ధముగ దాని నుపయోగింపకుము.

## వినయము, మర్యాద

ఈ రెండుగుణములు చిన్నప్పటినుండి కాపాడుకొనవలయును. మనబాలురయం దివిరెండు చాలభాగము పిల్లవాండ్రు నేర్చుచుండిరి. ఆ విద్య పెద్దవారే పిల్లవాండ్రకుఁ జెప్పుటచేఁ దమకంటెఁ బెద్దవారు విద్యావంతులు జ్ఞానవంతులను నభిప్రాయము బాలురకుండెను. అదియునుగాక 'మాతృదేవోభవ', 'పితృదేవోభవ', 'యాచార్యదేవోభవ' యను

ననుశాసనములు వల్లించి దానికిఁ గారణము తెలిసికొని యాప్రకారము వర్తించుచుండిరి. ఇప్పుడు తండ్రితాతల విద్యకు బాలకకుల విద్యకు సంబంధము లేదు. బాలురేమి చదువుచున్నారో పెద్దవారికిఁ దెలియదు. స్వయమంతయు నధమమని, పరకీయమంతయు నుత్తమమని బుద్ధిలేని పిల్లవాండ్ర యభిప్రాయము. ఇప్పుడు పాఠశాలలకుఁబోయి నాలు గింగ్లీషక్షరములు రాఁగానే తన తండ్రికంటెఁ దాను గొప్పపండితుఁడనైతినని బాలుని తలఁపు. తండ్రివేషము, భాషాజ్ఞానము అంతయు క్షుద్రమని తానునేర్చుకొనునది లోకోత్తరమని యామూఢబాలుని యహంకారము. ఇట్టిచో పితృభక్తియెక్కడ? మాతృభక్తియెక్కడ? కన్నతల్లి దండ్రులందే యీ యభిప్రాయము గలవానికి నితరులవిషయమున నెట్టి యణఁకువ కలుగును? వినయ హీనత వినాశకారణము. ఈ వక్రపుచ్ఛములు చక్కఁబడవు. కావున నీ విట్టి దురహంకారమునకుఁ బాలుపడక మట్టుమర్యాద వినయము గలిగి వర్తింపుము.

కొందఱు పిల్లవాండ్రు చెడుటకుఁ దల్లిదండ్రుల గారాబమే కారణము. వీరు తమబాలుఁడు పెద్దవాఁడైనఁ జక్కఁబడునని తలఁచుచుందురు. మంచిమాటలతోఁ జక్కఁబడుట యరుదుగాని యీ విధమునఁ గొందఱు చక్కఁబడుదురు.

ఒక యేటియొడ్డున నొక బ్రాహ్మణవృద్ధు నిలఁబడి సంధ్య వార్చుకొనుచుండెను. అప్పుడొక ధూర్తబాలుఁడు వెనుకప్రక్కవచ్చి యాయన ముడ్డిలో పుల్లపెట్టెను. ఆయన తిరిగిచూచి యేమిచేయలేక రొండిలోనున్న రెండణాలు వాని చేతిలోఁబెట్టి పొమ్మనెను. వాఁడిది ధనసంపాదనమునకు మంచి మార్గమనుకొనుచుఁ బోవుచుండ నొక వయస్సు తురకవాఁడు నమాజుచేసికొనుచుండెను. ధూర్తబాలుఁడు మెల్లగఁ బోయి వానిగుడ్డయెత్తి పుల్లపెట్టెను. వాఁడు తిరిగిచూచి 'కాలిచెడావు'తీసికొని దేహమంతయు వాఁచునట్లు కొట్టెను. అప్పుడు బాలుఁడు తిరిగి ముసలిబ్రాహ్మణుని

యొద్దకువచ్చి నీ ముడ్డిలో పుల్లలఁబెట్టిన రెండణాలిచ్చితివి. తురకవాని కట్టులేచేసిన వాఁడు చావఁగొట్టెనే యేల? యనియడిగెను. ఆ వృద్ధబ్రాహ్మణుఁ డిట్లనియె. 'బాలుఁడా! నీవు చేసినది మంచికార్యము కాదు. నాకు శక్తియుండినఁ దురకవాఁడు చేసినపని నేనే చేసియుందును. నాకంతశక్తిలేదు. కాఁబట్టి యట్టిశిక్ష నీకుఁగలిగినఁ గాని చక్కఁబడవు. అని తలంచి యట్లుచేసితిని. నా కోరిక నెఱవేఱెను. ఇఁకనైన బుద్ధిమంతుఁడవగుము'. అని బుద్ధిచెప్పి పంపెను. అది మొదలు వాఁడు దుష్టకార్యము చేయుట మానుకొనెను. నీ వొకయంగడికిఁ బోయితివనుకో. ఆయంగడివాఁడు నీతో నణఁకువగా మర్యాదగా మెల్లగ నీవు లోపలికి వచ్చిన వెంటనే మాటలాడక యూరకయుండియేమి కావలయునయ్యా నీకు? అడుగరాదా! అట్లునిలిచితివేమని గద్దించిన నాయంగడికి మఱియొకసారి పోదువా? మీఁదచెప్పినట్టు లాదరించిన వాని యంగడికిఁ బోదువా?

మంచి మాటలవలన నెంతలాభమో చూచితివా. అట్టులే నవ్వుచు మెల్లగ నీసుఖదుఃఖమును విచారించు వైద్యుని యింటికిఁ బోదువా? బిగించుకొని చక్కఁగా మాటలాడక నిన్ను నిర్లక్ష్యముగఁ జూచువాని యింటికిఁ బోదువా?

అల్పసంతోషము, సర్వసమత్వజ్ఞానము, ఉల్లాసగుణము, స్నేహగుణము, ఒకరితో మనకెప్పుడైనఁ బనిపడునను తెలివి యివి వినయమును గౌరవబుద్ధిని వృద్ధిచేయును. గ్రంథవిస్తరమునకు భయపడి యొక్కొక్క మాటలోఁ జెప్పినను ఈగుణములు చాలగొప్పవనియు నవశ్యము సంపాదింపవలసినవనియు నమ్ముము. అహంకారము నితరులయెడ నిర్లక్ష్యభావమును వదలి వినయవంతుఁడవై మట్టుమర్యాద తెలిసి యుదారస్వభావముకలిగి ప్రవర్తింపుమని చెప్పితినిగాని బానిసవలె చిత్తము చిత్తము అని చేతులుకట్టుకొనియో యంజలి జోడించియో

నడుములువంచి తలయోరగిలఁ బెట్టి యాత్మగౌరవమును జంపి కుక్కవలె వర్తింపుమని నేను జెప్పలేదు. పరాధీనపు బ్రతుకు బ్రతుకువానియందు, నందు దుర్జనులసేవయం దీగుణములు కానవచ్చును. నీ పూర్వజన్మ పాపఫలమున నీకిట్టిది వేఱుగతిలేక తటస్థించెనా స్వతంత్ర జీవనముచేయు వర్తకులయు వర్తకుల సంఘములయు కొలువులోఁ బ్రవేశించుట గ్రుడ్డిలో మెల్లశ్రేష్ఠమైనట్టగునుగాని వంగినవానిక్రింద వంగినట్లు కూలివానియొద్ద కూలికిఁగుదురుట కూడదు. రాచకొలువు నాశింపకుము. ఇది సంపూర్ణానుభవముచేఁ జెప్పెడు మాటయని నమ్ముము. అధికారము గలవారినిజూచి వారు సుఖపురుషులని యతిలోకులని భ్రమింపకుము. వారిలో 100–కి 95 మంది విద్య జ్ఞానము మనుష్య స్వభావధర్మము తెలియనివారని నమ్ముము.

అధికారము చేతను ధనముచేతను వచ్చు గౌరవము గౌరవమని తలంపకుము. ఇతర సద్గుణములచే గౌరవము సంపాదించినఁదప్ప నధికారమును బట్టివచ్చు గౌరవము తాత్కాలికమును లోలొటారము బయల బుటారమును. అధికారిగా నుండుటచే వచ్చు గౌరవము నిజమైన గౌరవము అనుకొంటివేని నీకంటె మూఢుఁడు లేఁడు. “అధికారాంతము నందుఁ జూడవలదా యాయయ్య సౌభాగ్యమున్” అన్నట్లులా యధికారము పోఁగానే వారి నెందఱు పల్కరింతురో చూడుము. రాముఁడు సీతాలక్ష్మణులతోడ నరణ్యమునకుఁ బోవునపుడు భరద్వాజాశ్రమమందు నిలిచెను. అప్పుడా ఋషి తనయోగమహిమచే షడ్రసోపేతముగ నందఱకుఁ విందొనర్చెను. అప్పుడు రాముఁడు భరద్వాజునిఁ జూచి యిట్లడిగెను. ఋషీశ్వరా! ఆనాఁడు కాల్నడ మేము పూర్వము నీ యాశ్రమమునకు వచ్చినపు డెంతో యాఁకలిగొని యుంటిమి. అప్పుడు మాకు పిడిచెడు మెతుకులైన నెంతో ప్రియముగా నుండును. అట్టి యక్కఱవేళ కందమూలము లిచ్చితివి. ఇప్పుడు నా కాదుకొనువారు నేనేమి

కావలయుననినఁ దెచ్చి యిచ్చువారు కోట్లకొలఁదు లున్నారు. ఒకరి సాహాయ్యము నాకక్కఱలేదు. కోరినవన్నియుఁ గలవు. ఇట్లుంట నిప్పు డిట్లాదరించితివి. ఈ భేదమునకుఁ గారణమేమి? అనిన ముని యిట్లనియె. రామచంద్రా! రెండుసమయము లందును నీదశను నేను బూజించితినిగాని నిన్ను నేను బూజింపలేదు. అప్పుడు నా వలెనే నీవు నరణ్య వాసివి. నీవలన నాకుఁగాఁగల దేమి ? ఇప్పుడు రాజవు. నిన్నాదరింపకుండినఁ గోపించి నాకే కీడైనఁ జేయఁగలవు కావున నాదరించితిని. నీయవస్థ గౌర వింపఁబడినది కాని నీ వాదరింపఁబడలేదని తెలియుమని లోకతత్త్వ మెఱిఁగించె. ధనవంతులకు వచ్చు గౌరనము నట్టిదే. నీకు భయపడువారును, గార్యార్థులై నిన్నాశ్రయించువారును జూపెడి గౌరవము నిజమైన గౌరవము కాదు. నీవలన నెట్టి ఫల మెన్నఁడు నపేక్షింపనివారు, నీకు భయపడఁ గారణము లేని వారు చూపెడి గౌరవమే నిజమైన గౌరవము. ఇట్టి గౌరవము విద్వాంసులకు లోకోపకార పారీణులకు, భక్తులకు, సాధువులకు, నప్రయత్నముగ లభించును. "ఇప్పుడు నీవు చెప్పినవారిలోఁ జేరనివారికి బిరుదములు వచ్చియుండలేదా? అవి గౌరవచిహ్నములు కావా" యందువేమో, బిరుదములు నిష్కారణముగ రావు. గొప్పకార్యము చేసిననే వచ్చును. బిరుదములు రావలయునని కార్యములుచేయుట యుత్తముని లక్షణముగాదు. బిరుదముల నిమిత్తమై ధనము వెచ్చించుట యధమునిలక్షణము. ఇట్టి బిరుదముల వలన గౌరవములేదు. ఒకఁడు వాస్తవముగ లోకము మెచ్చు ఘనకార్యము చేసెననుకో. అప్పుడే, లోకము గౌరవించును. ఇట్టివానికి బిరుదమువలనవచ్చు గౌరవముగాని రాకుండినఁగలుగు నవమానముగాని లేదు. అట్టివాని నాదరించి బిరుదమిచ్చిన వారికే గౌరవము. లోకము గౌరవింపని యొకఁ డేరూపముగనో యెవరిదయచేతనో బిరుదమును సంపాదించెననుకో. దానినలన వానికి నెక్కువపూజ లోకమునఁ గలుగునా? బిరుదములు

పొందుట చేతనే గొప్ప వాఁడనిపించుకొనినవాఁడు గాని దాని చేతనే సుఖపడువాఁడు గాని యుండిన నొకనిఁజెప్పుము. కావున నీవు బిరుదములకై యాశపడకుము. ఇది దుష్కామమగుట నీవు తెలిసియో తెలియకయో ముఖప్రీతికో దీనికై యకార్యములు చేయవలసివచ్చును. కర్మమందే యధికారంబు నీకుఁ గర్మఫలంబులఁగా దీవుగోర నను భగవద్వాక్యము మఱవకుము. తిలక్కు, గోక్లే, నన్నయ్యభట్టు, తక్కినవారికి బిరుదములు లేమిచే వచ్చిన యగౌరవ మేమి? అల్పులకు బిరుదములు వచ్చినంత మాత్రమునఁ గలిగిన గౌరవమేమి?

## బలము

దేహారోగ్యము కాపాడుకొను విషయమై యిదివఱకే వ్రాసియున్నాను. చదువు, దేహారోగ్యము రెంటిలో నొకటి వదలుకొనినఁగాని రెండవది వృద్ధిగానియెడల చదువు వదలి దేహారోగ్యము కాపాడుకొనుమనియే నేను జెప్పుదును. నీ వారోగ్యవంతుఁడవుగా నుండుటమాత్రము చాలదు. శరీరబలమునుగూడ నీవు సంపాదించుకొనవలయును. దానికై నీవు ప్రత్యేకముగఁ బాటుపడువలసిన పనిలేదు. పరిశ్రమము మఱికొంత యెక్కువగ (నమితముగఁ గాదు) చేసినఁ జాలును. దేహబలము గలవానిని జెనకుట కెట్టి దుర్మార్గుడును భయపడును. కుక్క తఱుముకొని వచ్చినపుడు నీవు భయపడనేల? దానినిబట్టి యణఁగఁద్రొక్కుబలముండిన నీవు భయపడుదువా? బలముగలవారు పులులతోఁ గొట్లాడలేదా? రాజ్యరక్షణము బలముచేఁ గాకున్న దేనిచే నగుచున్నది? చెడురాజులు బలవంతులగు ప్రజలకుఁ భయపడుదురు. దుర్బలులను బీడింతురు. మంచిరాజులకు వారు సహాయులగుదురు. బలవంతుని యింటికి దొంగలు వచ్చుటకును వెఱతురు. ఎంత బలముండిననంతమేలేకాని బలమును దుర్వినియోగ పఱుపరాదు. బలశాలురగువారి బిడ్డలును బలశాలురుగానే యుందురు. బలములేక యారోగ్యము కాపాడుటకూడఁ గష్టము.

అపాయము వచ్చినపుడు పరుగెత్తుటకైన బలము కావలయును. దేహరక్షణము రెండు విధముల నగునని యందొకటి యారోగ్యమని చెప్పితిని. బలమురెండవది. బయటినుండి వచ్చు నపాయములనుండి రక్షించుకొనుట కన్ని జంతువులకు దేవుఁడు సాధనముల నిచ్చియున్నాఁడు. ఒంటి గిట్టగల గుఱ్ఱములు, గాడిదలు తమ్ము బాధింపవచ్చిన దానిని నెడమకాళ్ళఁ దన్నును. చీలినగిట్టలుగల యెద్దులు ఆవులు లోనగునవి కొమ్ములతోఁ బొడుచును. పులులు లోనగునవి గోళ్లచేత చీల్చును. కోఱలతో కొఱుకును. తేళ్ళుకుట్టును. పాములు కఱచును. జింకలు పరువెత్తును. కొమ్ములుండియు నుపయోగించుకొన బలములేని మేఁకలు తేరకు చచ్చును. తుదకు చీమలుకూడ నెట్టుకుట్టునో పామునైన నెట్లు చంపునో తెలియదా. దేవుఁడు మనుష్యులకు చేతులు, బుద్ధి యిచ్చినాఁడు. బలములేనివాఁడు వీని నెట్లుపయోగించును. కావున బలము సంపాదించుకొని తన్నుఁదాను గాపాడుకొనవలయు ననియే యీశ్వరేచ్ఛ. కాఁబట్టి దేహపరిశ్రమము దేహబలము నిచ్చునదిగ నుండవలయును. ముక్కున నూపిరియుండువఱకు దేహరక్షణ మన్ని విధములఁ జేసికొనవలయును గాన దేహపరిశ్రమముకూడ కాలుసేతు లాడువఱకుఁ జేయుచుండవలసినదే. ఒకటి రెండు నెలలు చేసి చాలింపరాదు. ఇప్పుడు నాకు బలముతో పనిలేదే యనుకొనవలదు. అది కావలసినపుడు రాదు. ఆపత్కాలమందుఁ దన్నుఁ దనవారిని, తనగ్రామము వారిని, తన దేశమును, ప్రభువును, బలవంతులు కాపాడఁగలరు గాని దుర్బలులు కాపాడలేరు. కావున బలమార్జించుటయం దుపేక్ష కారాదు. అటులని దానికొక్క దానికే కాలము వ్యయపఱుపరాదు.

కాలము నెట్లు దుర్వ్యయము చేయరాదో ధనమునట్లే దుర్వ్యయము – చేయరాదు. చౌడునీళ్ళు (నీళ్ళు సోడా చవుడెసుమా) కాఫీనీళ్ళు తేయాకు నీళ్ళు వీనికిఁగా నిష్కారణముగ ధనము వ్యయముచేయుట యెట్లు తెలివి

తక్కువో పరువునకు మించిన వెలగల వస్త్రములకు, వెలగల యాహారమునకు ధనము వెచ్చించుట దుర్వ్యయము. సాధువుల మనస్సువలె వారి వేషములు నిర్మలములుగను ఆడంబరము లేనివిగ నుండును. ఒకని వేషమునుబట్టి వాని మనస్థితి తెలియవచ్చును. కులస్త్రీవేషమునకు బోగముదాని వేషమునకు భేదములేదా? అట్లులే డాంభికుని వేషమునకు, సాధువు వేషమునకు, భేదముండుసు. కొందఱు కలిగియు చింపిగుడ్డలు, మాసినగుడ్డలు, కట్టుకొని మొగము వ్రేలవేసికొని తిరిగిన యెడలఁ దమ్ము సాధువులని లోకులు తలంతురని భ్రమింతురు. వారిని సాధువులని తలంపరుగాని పెద్దమ్మ పుత్రులని తలంతురు. కావున పరువెఱిఁగి ప్రవర్తింపవలయును.

## ప్రాణము

మనకోరికలు నెఱవేర్చుకొనుటకుఁ గావలసినశక్తి నొకదానిని భగవంతుఁ డిచ్చియున్నాఁడని దానికే ప్రాణమని పేరని ముందు చెప్పితినిగదా! ఇప్పుడీ ప్రాణము గుఱించి సంగ్రహముగఁ జెప్పెదను. నీవు దేహారోగ్యమును గాపాడుకొనుటకేగాక బలమును సంపాదించుటకేగాక తక్కిన రెండు కోరికలు సంతానము, శాశ్వతానందము సంపాదించుటకుఁగూడ నిది యవశ్యము కావలసియున్నది. సృష్టిక్రమములో మనకుఁ గావలసినమట్టునకు విచారింపఁగా మనస్సు మొదటిది. ప్రపంచమంతయుఁ దొలుత మనోమయము. ఈ మనస్సున కొంతస్థూలమై ప్రాణమను శక్తిగ నేర్పడెను. ఈ శక్తి స్థూలభావము సూక్ష్మాకాశము. ఈ మూఁటిచేతను ప్రపంచము నిండియున్నది. మనస్సునునది మహాసముద్రము. అది వ్యాపించినంతదూరము శక్తియను మహాసముద్రము ఆకాశమను మహాసముద్రము వ్యాపించియున్నవి. ఈ మూఁడు లేనిస్థలము సూది మొనంతయైనలేదు. మూఁడు నొకదానిలో నొకటి కలసియు కలియకయున్నవి. ఇది నీకు మనస్సునకు

రావలయుననిన నొక యుపాయము చెప్పెదను. ఒక చీఁకటిగదిలోఁదొలుత మైనపువత్తిదీపము పెట్టుము. ఆగదిలోనికి తరువాత పెద్దమట్టినూనె దీపము రంగుగల గాజుకుప్పెతోడ బెట్టుము. ఇప్పుడీ రెండు దీపముల కాంతులాగదిలో నున్నవి కదా? ఈ గదిలోనికి సూర్యరశ్మి వచ్చునట్లుచేయుము. ఈగ దినంతయు మూఁడు కాంతు లాక్రమించి యున్నవి కదా, అట్టులే యివి యనుకొనుము. ఆకాశము స్థూలభావము వాయువు దానినుండి యగ్నికలిగెను. దానినుండి నీళ్ళుకలిగెను. నిప్పునుండి నీళ్ళెట్లు పుట్టునని తలంపకుము. బాలక హిత చర్యయందు దీపమునుండి నీళ్ళువచ్చుట తెలిపితినిగదా! నీళ్ళలోనుండి భూమి, ఆకాశము మొదలు ఐదింటికి భూతములని పేరు. ఈ యయిదింటివలననే తక్కిన ప్రపంచము, ఓషధులు, పశుపక్ష్యాదులన్నియు జనించినవి. ప్రతిపదార్థమందు నాయాభూతముల పరిమాణము వేఱు వేఱుగ నుండునుగాని యీయైదు గలియనిది యొకటియు లేదు. అట్టులే ప్రాణము మనస్సు లేని పదార్థముకూడ లేదు. సముద్రమునందలి చేఁపలవలె మనమీ మూఁడుసముద్రములు కలిసినదానిలో నీఁదుచు ఉన్నాము ఒకయేఱు పాఱునప్పుడు దానిలో నెన్ని నీటి సుళ్ళుండునో చూచితివా? ఈ సుడిలోనికి క్రొత్తనీరు ప్రతిక్షణము రాఁగాఁ బ్రతిక్షణము సుడిని విడిచి ప్రాఁతనీరు పోవుచుండునుగదా! అట్లే మన దేహములోనికి మనస్సు, శక్తి, ఆకాశము వచ్చుచుఁ బోవుచు నుండును. మన దేహములోని చర్మము, నెత్తురు, ఎముకలు లోనైన సమస్తము ఆకాశమయము. ఆకాశమనఁగా బయలని యర్థము చేసికొనకుము. మనకుఁ గనఁబడు బయలు కేవలము శూన్యముగాదు. మన కన్నులకు సూక్ష్మదర్శనులకుఁ గూడఁ గాన రాని పరమాణుకములమయము. సీమసున్నము పెళ్ళదీసికొని బాగుగ నలియఁగొట్టుము. తొలుతఁ బెద్దపెద్దముక్క లగును. తరువాత చిన్నముక్కలగును. తరువాత నింకను చిన్నవగును. తరువాత

ధూళియగును. ఇంకను బాగుగ దంచిన మనకన్నులకుఁగాన రాక యెగిరిపోవును. కర్పూరముపెళ్ళ కొన్ని దినములలో కరఁగిపోవుట తెలియునుగదా. ఆ యణువులేవి? అట్టులే యాకాశము పరమాణుకముల మయము, ఈ యణువులు మన దేహమునుండి యేదోయొకరూపమునఁ బోవుట, యాహారము తీసికొనుటవలన మరలఁ గ్రొత్తవి యేర్పడుచుండుట, బాలక హితచర్య చదివినఁ దెలియును. అట్టులేశక్తి (ప్రాణము) కూడ మనము కాలుచేయి కదలించుట ఆలోచించుట మొదలైన కార్యములు చేయుటయందు వ్యయపఱుచుచున్నాము. ఇది మరల మనము తిను నాహారము, త్రాగునీళ్ళు, పీల్చుగాలి, ఎండ వీనివలన మనలోఁ బ్రవేశించుచున్నది. అన్నిటియం దీశక్తి కొలఁదిగనో గొప్పగనో యున్నదని చెప్పితినిగదా. దానిలో నుండునదే మనలోనికి వచ్చును. దానివలన మనము కార్యములు చేయఁ గలుగుదుము, ఇది ప్రాణవాయువు కాదు సుమా! ప్రాణవాయువునం దీశక్తి లేకున్న నది దీపము వెలిగింపఁజాలదు. ఆ వాయువునందు నీ ప్రాణశక్తి విశేషించియుండుటచే దానిని ప్రాణవాయు వందురు. ప్రాణములో నుండి యాకాశము పుట్టుటచే నది పాణమునకు లోపబడి యది యెట్లాడించిన నట్లాడుచుండును. ప్రాణము మనస్సువలనఁ బుట్టినదగుటచే నది మనస్సు చెప్పినట్లు విని రమ్మనిన వచ్చును పొమ్మనిన నోవును. కాఁబట్టి ప్రాణశక్తి దేహము రెండును మనస్సునకు లోపడియున్నవి. కావున మనము పదార్థములఁ దినునవుడు నీళ్ళు ద్రావునపుడు గాలి పీల్చునపుడు, ఎండలో దిరుగునపుడు వానిపై మనస్సుంచి వీనిలోని ప్రాణము మనమాకర్షింపవలయునని తలంచితిమా వానియందుండు ప్రాణము మనము గ్రహింపఁగలుగుదుము. మనస్సులేక చేసిన వచ్చినంతవచ్చును. కొంత రాకయే పోవును. ఆహారమునందలి ప్రాణము గ్రహించుశక్తి నోటియందు విశేషముగ, గలదు. కావుననే మన మాహారము బాగుగ నమలి మనస్సుంచి తింటిమా దానియందలి ప్రాణము

విడివడి నోటిలోని నరములందుఁ జేరి క్రమముగ దేహమున వ్యాపించును. అటుగాక మనస్సెక్కడనో యుంచి నమలక తింటిమా కొంతప్రాణము వ్యర్థమైపోవును. ఆ నిమిత్తముగ మన మెక్కువగ నాహారము తీసికొనవలసియుండును. దానివలనఁ గలుగు ననర్థకములు బాలక హితచర్యయందుఁ జెప్పితిని.

గాలిలోనుండు ప్రాణమును శ్వాసముచేతను చర్మముచేతను గ్రహింతుము. ఇదియును మనస్సుంచి చేసిననే ప్రయోజనము. గాలి తగులని చర్మము చెడిపోవునని తెలియునుగదా. దీనివలన మనముధరించు నుడుపులు వస్త్రములు సాధ్యమైనంత వదులుగా నుండవలయుననియు దేహమునంతయు వస్త్రములచేఁ గప్పి బిగించుట మంచిదిగాదనియుఁ దెలిసెనుగదా! నీళ్ళయందలి ప్రాణమును ద్రాగుటచేతను, స్నానము చేయుటచేఁ జర్మము చేతను, గ్రహించుచున్నాము. దీనివలన ప్రతిదిన మొకసారియైన స్నానము చేయవలయుననియు స్నానము చేయునపుడు మంచినీళ్ళు త్రాగునపుడు దానిపై మనస్సుంచి చేయవలయు ననియు నేర్పడెనుగదా! ఎండలోని ప్రాణమును చర్మముచే నాకర్షింతుము. కావున నుదయాస్తమయములందెండ దేహమునకు సోఁకుట మేలనియు నెండ గాలి తగులకుండునట్లు దేహమును గప్పుట చెడ్డయనియుఁ దెలిసెనుగదా! ఎండకు గాలికి తిరుగువా రెంత దృఢగాత్రులుగా నున్నారో దేహమునిండ గుడ్డలు కప్పుకొనియుండు మన మెట్లున్నామో తెలియదా? దానికిఁ గారణమిప్పుడు తెలిసినదా! ఇవన్నియుఁ జక్కఁగఁ దెలిసి యాలోచించి దేశము కాలము స్థితులెటింగి స్త్రీలకుఁ బురుషులకు వస్త్రములను ధరింపనలసిన విధములను పెద్దలేర్పాటుచేసిరి. ఇప్పుడు నాగరకతావ్యాధి ముదురుటచేఁ దెలివికోలుపోయి మనవారు స్త్రీలుపురుషులుకూడ ననారోగ్యమగువిధముగ వస్త్రములను ధరింపఁ బూనుచున్నారు. అజ్ఞానమునకంటె హానికరమైనది మఱేమున్నది? నీ వాలోచన

పరుఁడవైనచో గుడ్డలు కట్టుకొననేల? దిసమొలతోనుండుట యెక్కువ యారోగ్యకరముకదా యని తప్పక సందేహింతువు. 'దానికి కారణము పతిహితచర్యయందు వ్రాసియున్నాను.

మీఁద చెప్పినదానివలన దేహముమీఁదను ప్రాణము మీఁదను మనస్సున కెంత స్వతంత్రాధికారము గలదో తెలిసెనుగదా! కావున నీ ప్రాణశక్తి దేహము చెడుకార్యములు చేయుటకు మంచి కార్యములు చేయుటకు నీ మనస్సే కారణము. మనస్సు, బుద్ధి, పంచభూతములు ఈ యన్నిటి సముదాయమునకు ప్రకృతియనిపేరు. బలవంతముగ ననకట్టకట్టి యడ్డగించినఁదప్ప నీరు మిట్టకుపాఱక పల్లమునకే యెట్లు పాఱునో యట్లే నీవు బలాత్కారముగ నిగ్రహించినఁదప్ప మనస్సు ప్రకృతిపదార్థముల వెంటనే యింద్రియద్వారముల నుండి పోవుచుండును. ఇంద్రియములు విషయములఁ దెచ్చి మనస్సున కర్పించుచుండును. నీవు గ్రహించి పట్టి కట్టియుంచినతప్ప చంచలమైన మనస్సు విషయముల వెంటఁబోవుట యేమివింత? కావున నీవు మనస్సును దక్కిన. యింద్రియములనుగూడ నీ స్వాధీనమందే సర్వదా యుంచుకొనవలయును. మనస్సు విడిచిన పరువెత్తిపోయి యే చేలలోనోపడి దొంగమేపు తిని నీకు నింద తెచ్చు దొంగ గొడ్డువంటిది. మనస్సును బిగఁబట్టుట మిక్కిలి కష్టకార్యము. కావుననే నిద్రాహార విహారాదుల యందన్నిట మిక్కిలి శ్రమించి దీనిని సాధింపవలయును. ఇది చాల ముఖ్యము.

ఇఁక నేను జెప్పఁబోవు విషయములం దన్నిటను నీవెంతో మిక్కిలి చాల హెచ్చరిక గలిగి నీ మనస్సును కాపాడుకొనవలయును. అట్లుచేయక పోయితివా నీ యారోగ్యము బలము చదువు నిన్నుఁగాపాడలేవు. ఇవి యన్నియు మనస్సునకుఁ దోడై నిన్ను మఱింత చెఱుచును. ముందుగఁ జెప్పిన మఱతువని యచ్చటఁ జెప్పుచున్నాను.

నాయనా! యిదివఱకు వ్రాసిన దాని కంటెను ఇఁక ముందు వ్రాయఁబోవుదానికంటెను ముఖ్యమైన విషయము చెప్పఁబోవుచున్నాను. త్రికరణశుద్ధిగ నీవు బాగుపడవలయునని యుండిన దీని నుపేక్షింపకుము. నీ తల్లిదండ్రులు బ్రాహ్మణులు. వారు కులము చేతను, గుణము చేతనుగూడ బ్రాహ్మణులే. కావున నీవు జన్మముచే బ్రాహ్మణుఁడవే. గుణముచేతను నీవు బ్రాహ్మణుఁడవుగా నుండఁ గోరిక గలవాఁడవని నమ్మెదను. ఆ కారణముచే నీకు నిది చెప్పఁదలఁచితిని గాని గుణములచే బ్రాహ్మణుఁడవు గావనితోఁచిన నీ నిమిత్తమై యిదియంతయు వ్రాసియే యుండను.

బ్రాహ్మణుఁడనుగాఁ బుట్టిన పిమ్మట బ్రాహ్మణుఁడనుగాక యెట్లుపోదునని తలఁతువేమో చెప్పెద విను. బ్రాహ్మణ్య మాకాశమునుండి నీమీఁద నుట్టిపడ లేదు. కష్టార్జితము. ప్రతిసంవత్సరము తప్పక పైతరగతికిఁ బోవుచుండిన 16 సంవత్సరములలో బి.ఏ.తరగతికిఁ బోవునట్లు అనేక గర్భములఁ బుట్టి పుట్టి యాయా జన్మమునఁ జేయవలసిన కార్యములు చక్కఁగఁ జేసి పైతరగతికిఁ బోవుచు నిట్లు 84 లక్షల గర్భముల జనించి తుదకు మనుష్యుఁడ వైతివి. మనుష్యజన్మములో నానాజాతులఁ బుట్టిపుట్టి వానియందుఁ జక్కగఁ బ్రవర్తించి తుదకు బ్రాహ్మణుఁడ వైతివి. అందు అధమము, మధ్యమము, ఉత్తమమని మూఁడువిధములు. ఈ మూఁడు తరగతులలో నొక్కొక్క తరగతియందు మరల నధమ మధ్యమోత్తమ భేదములచే మూఁడువిధములు. అవి మరల మూఁడువిధములు. అధమమగు తరగతుల దాటిఁ మధ్యమమునకు వచ్చినావని యెంచెదను. ఇక్కడనుండి మరలఁ గ్రిందికిఁ బోవుటకు మీఁదికి బోవుటకు నీ గుణము కారణము.

బ్రాహ్మణులుగా నుండు తల్లిదండ్రులకుఁ బుట్టినంత మాత్రముననే పూర్ణ బ్రాహ్మణ్యము కలదని చెప్పవలనుపడదు, ఒక బ్రాహ్మణ స్త్రీ తన భర్తకే బిడ్డను గనినను ఆగర్భము నిలిచినసమయము సంధ్య పగలు లోనగు

దుష్టవేళలైనను లేక తల్లి యా గర్భము నిలిచిన సమయమున తురక వానినో దూదేకులవానినో దున్నపోతునో స్మరించుచుండినను గర్భము నిలిచిన పిమ్మటఁ దల్లి బ్రాహ్మణ యోగ్యముగాని యాహారవిహారాదుల నాసక్తురాలైనను బుట్టెడి కొడుకు పూర్ణ బ్రాహ్మణుఁడు కానేరఁడు. ఈవిషయము పతిహిత చర్యయందు వ్రాసియున్నాను గనుక నిచ్చట విపులముగ వ్రాయలేదు. బ్రాహ్మణ భార్యాభర్తలకుఁ బుట్టెడు కొడుకునందే యిన్ని కారణముకు హానిగలుగుచుండనిక విటపురుషులకుఁ బుట్టెడి బిడ్డలయందు బ్రాహుణను? బ్రాహ్మణ దంపతులకు మంచి ముహూర్తముననే గర్భము నిలిచి బిడ్డ పుట్టినను ఆ బిడ్డ బ్రాహ్మణాచారములను మానుకొనుటచేఁ దల్లిదండ్రులు సంపాదించి యిచ్చిన ధనమును గాపాడుకొనలేక పోఁగొట్టుకొను మూఢునివలె బ్రాహ్మణ్యమును బోఁగొట్టుకొనును. కావున నాయనా! యధమపక్షము 84 లక్షల జన్మము "లెత్తి యెత్తి పుట్టి పుట్టి, చచ్చి చచ్చి, గర్భనరకము యమయాతన మొదలైన కష్టము లనుభవించి యెట్లెట్లో దాఁటివచ్చి భూమిసురత్వము సంపాదించుకొనిన తరువాత దానిని భోగొట్టుకొనువాని నేమనవలయునో నాకుఁ దోఁప లేదు, అధమములైన పశుపక్ష్యాదులకంటెను ఉత్తములైన దేవతలకంటెను మనుష్యులే శ్రేష్ఠులు, ఏలన దేవతలును మోక్షము గోరిరేని మనుష్యులయియే పుట్టి సంపాదింపవలయును. మనుష్యలోకమునుండి రెండుదారులు. ఒకటి నరక స్వర్గములకు మఱియొకటి మోక్షమునకు, నరక స్వర్గములకు బోయిన వారు మరల భూమి పై జన్మింతురు. మోక్షమునకు బోయినవారు మరల జన్మింపరు.

ఇట్టి మనుష్యజన్మమును అందు బ్రాహ్మణజన్మమును వ్యర్థపఱుచుకొనువానికంటెఁ దెలివిమాలిన వాఁడెవఁడు?

ఆహారము, నిద్ర భయము, మెథునము – ఇవి పశువులకు మనుష్యులకు సమానధర్మములు. పశువులకు లేని జ్ఞానమును మనుష్యులకు

భగవంతుఁ డెక్కువగ నిచ్చియున్నాఁడు. ఆ జ్ఞానమును యెవఁడు సద్వినియోగ పఱుపఁడో వాఁడు పశువే. ఈ జ్ఞానముచేతనే దేవుఁడొకఁ డున్నాఁడని, ప్రతిజీవియు దేవుని బిడ్డయని బిడ్డను జక్కఁబఱుచు తండ్రివలెనే భగవంతుఁడు జీవిని జక్కఁబఱుపఁగోరి దానిదాని తరగతికిఁ దగిన సాధనముల నిచ్చియున్నాడని, యా కారణముచేఁ బ్రతిజీవియు భగవంతునిఁ జేరి శాశ్వతానంద మనుభవించుటే పరమోద్దేశముగాఁ గలిగి యథాశక్తి పాటుపడుచున్నదని, మనుష్య జన్మమం దే యీకోరిక కొనసాగవలయునుగాని మఱి యేజన్మమున నిది కొనసాగదని తెలిసికొంటిమి. ఇంతదూర మాలోచించి తెలిసికొనినపిమ్మట నీజన్మమున నెట్లాకోరికసఫలమగును? దానికి మార్గములేవి? యని యూలోచింప వలసినది విధియే కదా. కాఁబట్టి నీవు మనుష్యుఁడుగాఁ బ్రవర్తింపవలసిన విధము తెలిపి తరువాత బ్రాహ్మణుఁడవుగాఁ బ్రవర్తింపవలసిన విధము తెలిపెదను.

ప్రతిజీవి పరమోద్దేశము భగవంతునిఁ జేరుట యయినవుడు దాని యుద్దేశము నెఱవేర్చుకొనుటకు నీవు విఘ్నము చేయరాదనియు చేతనైన యెడల నీవు దాని కాకార్యమునందుఁ దోడుపడవలయు ననియుఁ దెలిసికొనుము.

ఒకఁడు పట్టపరీక్షయందుఁ గడతేఱుట పరమోదేశముగాఁ గలిగి చదువుచు నింకను గ్రింది తరగతియందే యుండఁగా వాఁడా తరగతియందు నేర్చుకొనవలసిన పాఠములను నేర్చుకొననీయక విఘ్న పఱుచుటనలన వాఁడా తరగతినుండి పై తరగతికిఁ బోవుటకు సాధ్యపడకపోవునట్లు నీవు చేయుటచే వాని కెంతనష్టము కలిగించితివో యాలోచింపుము. మరల నింకొక సంవత్సరమెంతో శ్రమించి చదువవలయును గదా! ఒక సంవత్సరమనఁగా నొక జన్మమనుకో! అట్టులే యొక జన్నమున నొకజీవి సంపాదించుకొనవలసిన లోకానుభవమంతయు

సంపాదించుకొననీక పోవుటచే దానికి నీ వెంత నష్టము కష్టము గలిగించిన వాఁడ వైతివో యాలోచింపుము. అట్ల చేయుట భగవదుద్దేశమునకు నడ్డుపడుటకదా? ఆ కారణముచే భగవంతునకు నీయందుఁ బ్రీతికలుగునా?

ఆ విద్యార్థికే తెలియని విషయము నేర్పి పాఠములు చక్కగ వచ్చునట్లు చేసి పై తరగతికిఁ బోవుటయందుఁ దోడు పడితివనుకో, అప్పుడు భగవంతుఁడు నీయెడ నెంత సంతోషించి నీకెంత మేలుసేయును. పరులకు నేనెట్లడపడఁగలనని యడిగెదవా! పాఠశాలయందు లేకుండఁ జేయుటచే నెట్లు విద్యార్థికిఁ గీడు చేసితివో యట్లు హింసచేయుటచే దేహికిని గీడు చేసిన వాఁడ నగుదువు. దేహముండినఁ గదా జీవుఁడు తన కార్యము చేయఁగలుగును. దేహమునుండి యతని వెడల గొట్టిన నా దేహముతోఁ జేయవలసిన కార్యములు చేయుటకు సమర్థుఁడుగాక దానికే మఱియొక దేహమును మరల సంపాదించుకొని మరల నాకార్యములే చేయవలయునుగదా! జననము మరణమనఁగా నెంత కష్టకార్యమో తెలియదా? కాఁబట్టి నాయనా! యేజీవినైనను హింసింపకుము. హింసయనఁగాఁ జంపుటమాత్రమే కాదు. నీ మనస్సుచేనైనను కార్యముల చేనైనను నొక జీవికి మనస్సు నొచ్చునట్లు చేయుటయు హింసయే. నీవంటిజీవియది దానివంటి జీవివి నీవు. ఒకరినొకరు బాధింపవలసిన పనిలేదు. ఒక జీవివిషయమై చెడుతలంపులు తలఁచుట, పరుషముగా పలుకుట, కొట్టుట, తిట్టుట, చంపుట లోనగు బాధలు కల్పించుట హింసించుటే యగును. ఈ కార్యములా జీవి బాగుపడఁగోరి చేసిన దోషములేదు. ప్రాణము పోఁగొట్టినపిమ్మట చేయునట్టి మేలుండదు గనుక చంపుట యెన్నఁటికిఁ మేలుగాదు. కావుననే యహింస పరమధర్మమని చెప్పఁబడినది. నీ కెదుటివాఁడు కీడుచేసినను నీవు వానికిఁ గీడు చేయరాదనుటకుఁ గారణము తెలిసెనుగదా? వానికీడు వానినే శిక్షించును.

నీవు దానికిఁగా వానిని శిక్షింపఁ బనిలేదు. మేలుచేసినవానికి మేలు కీడుచేసినవానికి కీడు కలుగు నేర్పాటులు భగవంతుఁడు చేసియే యున్నాఁడు. నీ కా యధికారము లేదు. నీ కార్యమును జక్కఁజూచుకొనుటే నీ భారము. కావున నేలపాఱెడి నల్లచీమకైన మనసెఱిఁగి బాధకలుగునట్లు ప్రవర్తింపకుము.

ఈయొక్క గుణమును నీవు సంపాదించితివా యసత్యమాడిన నెదుటివానికి నష్టియో కష్టమో మనస్సునకు బాధయో కలుగునని యసత్యమాడకుందువు. అసత్యమాడుటయు హింసయే. ఈకారణముచేతనే పరధనములకుఁ బరస్త్రీలకు నాశింపవు. ఈ కారణముచేతనే క్షమ, దయ, ఆర్జనము, మితాహారము, శుచిత్వము కలవాఁడవును నగుదువు. మితాహారము శుచిత్వ మెట్టు లహింసయగునందువేమో? మీఁద చెప్పిన పద్ధతిఁజూచిన మాంసభోజనము కేవల దుష్టమని యేర్పడెనుగదా! నీవు శాకభోజివైనను శాకములకును బ్రాణమున్నదని దానికిని జీవితప్రయోజనము మనయట్టిదే యని దానికిని నొప్పులు బాధలు కలవని చంపినఁ జచ్చునని తెలిసినప్పుడు నీ దేహరక్షణమున కెంతమాత్రము కావలయునో యంతకుమించి తీసికొనుటకై యత్నించుటవలన ననావశ్యకముగ వానిపాఠముల నవి చదువనీయనివాఁడ వగుదువుకదా. అది న్యాయమా? అమిత భుక్తివలన నీకును వానికినిగూడఁ గీడు గలుగును. అట్లైన శాకభక్షణము పాపమందువేమో? వాస్తవ మాలోచించిన దేహరక్షణముచేసి పరమోద్దేశము సాధించుటకు భగవంతుఁడు సృష్టించిన నీళ్ళు గాలియే బ్రతుకునకు చాలును. ఋషీశ్వరు లట్టివారుగారా? అట్టివారు నేఁటికి నున్నారు. ఆ మార్గము మనకు దుస్సాధము. కావున నదిపోనిమ్ము. దానికి వెనుక శాకభక్షణము మితముగఁ జేయుట నిర్బాధము.

ఓషధులకెల్ల మనకువలెఁ బ్రాణముండిన వాని దేహతత్త్వమునుబట్టి మనము కోయుటచేఁ గలుగుబాధ వానికి తెలియదు. పసిపిల్లవానిని

వ్రేలితోఁ గొట్టిన నెంతో బాధపడి యేడ్చును. నీవా దెబ్బ కేదుఃఖింతువా? నిన్ను సన్నబెత్తముతోఁ గొట్టిన బాధపడుదువు. ఆ మాత్రముదెబ్బకు దున్నపోతు కదలునా? ఏల? చర్మభేదమును, జ్ఞానేంద్రియ భేదమునుబట్టి, అట్టులే పశుపక్ష్యాదులకు బాధకలిగించునది వృక్షములకు బాధకలిగింపదు. వానికి బాధకలిగింప వలయుననిన వైద్యుత శక్తివిశేషముగఁ బ్రయోగింపవలయును. మన మట్టికార్యము చేయుటలేదు. కావున మనము చేయుకార్యములవలన వానికి బాధ కలుగదు. అంతేకాదు. వృక్షములు తమకుఁ గావలసిన యాహారమునకు నాలుగంతల యహారమును గ్రహించును. ఏల? లోకోపకారార్థమే. ఒక్కవిత్తనము నాటుటవలనఁ బుట్టు చెట్టులోని యాకులు – పూలు – పండ్లు ఎన్నిమృగములకు – పక్షులకు – ఎందఱు మనుష్యుల ఆహారము కాఁగలవో యోజింపుము. మనుష్యులకు పశువులకు పక్షులకు నుపయోగపడని గాలి మొదలయినవి యివి యుపయోగించుకొని మనుష్యాదుల కుపయోగించునవి యిచ్చుచుండును. దీనివలన నివితక్కిన జీవజంతువుల కుపయోగ పడవలయునని భగవదిచ్ఛఁగాఁ దోఁచుచున్నది. ఇట్లు చెప్పుటచే సమస్తౌషధులు గాలి నీరు మట్టిచేతనే బ్రతుకుచున్నవని మాంసాహారము కోరు నౌషధుల లేవని నా యభిప్రాయముగాదు. లక్షకొక వృక్షజాతి మాంసము నాశించును. తిని జీర్ణించుకొనును. దానికిఁ గారణము చర్చింపఁబూనిన నిది పెద్దవృక్షశాస్త్ర మగును. గావున నేదో యపురూపముగ నుండుదానిని విడిచి బహుళముగ నుండుదానిని గుఱించి చెప్పితిని. పశుపక్ష్యాదుల విషయమై యిట్టిది చెప్పవలనుపడదుకదా! ఒకానొక పాశ్చాత్యుఁడు అర్ధనాగరకులు మాంసమును భుజింపక శాకాదులనే భుజింతురని వ్రాసియున్నాఁడు. అవురా తెలివితక్కువతనము! దురహంకార మింతకంటెను మించిపోఁగలదా? కన్నకశ్మలములోఁ బొరలాడుచు దానిని దినుచు నుండు పందులను, గుక్కలను, గాడిదలను దినుటయే నాగరికతా

లక్షణమేని నాగరికత్వమున కొక సాష్టాంగనమస్కారము. అట్లైన మనుష్యులకు దినువారు వీరికంటె నెక్కువ నాగరకులుగారా?

నేను వ్రాసినదానిలో నీకు కుశంకలు కలుగకుండుటకై యింతదూరము వ్రాసితిని.

ఇట్టులే యశుచిత్వమువలన మనకుఁ బరులకుఁ గూడఁ గీడుకలదు. ఆరోగ్యము చెఱుచును. కాఁబట్టియొక్క యహింస నభ్యసించుటచే నెన్ని సుగుణములు పట్టుపడునో తెలిసెను గదా!

నీతోడి విద్యార్థికి విఘ్నము కలిగింపవనుకో. నీవు కష్టించి నీ పాఠములను జదువకుండిన నేమిలాభము? నీ వా తరగతులలోనే యెన్ని సంవత్సరములైనఁ బడియుండ వలసిన వాఁడవేకదా. అట్లుగాక క్రిందితరగతులకేపోదువో. కాఁబట్టి నీవును శ్రమింపవలయును. నిన్ను బాగుపఱుచునవి తృప్తి, దానము, దేవపూజ, భగవద్విషయము మహాత్ములవిషయము తెలిసికొనుట, చేయరాని కార్యములందు లజ్జ, జపము. ఇన్నిటిని మించినవి తపస్సు బ్రహ్మచర్యము. తృప్తి మొదలైనవానిని గుఱించి విశేషించి చెప్పవలసినది లేదు. అవి నీకుఁ దెలియనివికావు. తపస్సుగుఱించి కొంచెముగ బ్రహ్మచర్యము గుఱించి విశేషముగను జెప్పవలసియున్నది. ఈ రెంటియందుఁ జక్కఁగఁ బ్రవర్తించిననే నీవు మనుష్యుఁడవు. బ్రాహ్మణుఁడవును. కానియెడల సందేహమే?

తపస్సనుటచే "దలక్రిందుగ వ్రేలాడు"మని చెప్పితినని భయపడకుము. నిత్యనైమిత్తిక కర్మములు చేయుటే తపస్సు. మనస్సు భగవంతునియం దుంచుటే యుత్తమ తపస్సు.

నిత్యకర్మము లనఁగాఁ బ్రతిదినము నీవు తప్పక చేయవలసిన కార్యములు. ద్విజులకు ముఖ్యముగ సంధ్యవార్చుట. ఈ విషయమై విపులముగ వ్రాయఁబడిన సంధ్యావందనభాష్యము. మీకిచ్చియున్నారు.

అంతకుమించి నేను జెప్పవలసినది విశేషములేదు గాని దానిలో మూఁడుదినములు సంధ్యవారువకపోయిన శూద్రుఁడవని చెప్పిన సమాచారము మఱచిపోవలదు. గాయత్రిమాహాత్మ్యము నాకు విశేషించి తెలియదు గాని నాజ్ఞానానుభవములఁబట్టి దానియం దొక మహిమగలదని తెలిసికొంటిని. జపము చేయువానిని రక్షించును గావున దానికి గాయత్రియని పేరు. బ్రహ్మాస్త్రమంత్రమిదియే. ఆ మంత్రమును యథావిధి జపించుటచేఁ గలిగిన సావిత్రి యెట్టిదయ్యెనో తెలియునుగదా! ఏ యస్త్రమునకుఁ గట్టుపడని హనుమంతుఁ డీమంత్రమునకుఁ గట్టుపడుట తెలియునుగదా! రుద్రునికిఁ దక్కిన దేవతలకుఁ దెలిసిన మంత్రములెల్లను నేర్చుకొనివచ్చిన విశ్వామిత్రు నంతటివాఁడు గాయత్రి నాశ్రయించిన వసిష్ఠుని బ్రహ్మదండముచే నేగతి పట్టెనో యెఱుఁగవా? గాయత్రీమంత్రము నాశ్రయించి యింద్రజిత్తు రామలక్ష్మణాదుల నెల్ల నెట్టి కష్టదశకుఁ దెచ్చెనో చదువలేదా? వీనివలననే గాయత్రియం దిట్టిమహిమ యుండునని నీవు వివేకవంతుఁడవైనచోఁ దెలిసికొనఁగలవు. శ్రాద్ధాదుల నిమంత్రణమునకు యోగ్యులైన బ్రాహ్మణుల గురించి చెప్పుచోటఁ గలికాలమున బ్రాహ్మణు లిట్టివారు దొరకరే యేమి చేయవలయునని ప్రశ్నరాఁగా గాయత్రి జపించువాఁడు దొరకినఁ జాలునని చెప్పఁబడెను. దీనివలన గాయత్రి బ్రాహ్మణ్యమున కత్యంతావశ్యకమని తెలిసెను గదా!

మీరు చదివిన యాంగ్లగ్రంథములందు సమస్తశక్తులకు సూర్యుఁడు మూలమని కలదుగదా! ఆయనవలన వచ్చుశక్తి వలననేకదా మన మందఱ మారోగ్యముగ నుండఁ గలిగియున్నాము. ఆరోగ్యమునకు దేవత సూర్యుఁడు. రోగులు బాగుపడుటకై సూర్యనమస్కారములు, గ్రహశాంతులు చేయుట యెఱుఁగవా? ఈ శక్తినే ముందు ప్రాణమని చెప్పితిని. ఆ శక్తి నీళ్ళకు, మనము తిను ఆహారమునకు, గాలికి సూర్యునివలననే కలుగుచున్నది. వానిలోనుండు శక్తి తానంతట నది వచ్చుదానికంటె మనము మనస్సుచే

నెక్కువ నాకర్షింపఁగలమని చెప్పితినిగదా? సూర్యునివలన నేదో కొంచెము శక్తిని సంపాదించిన జలాదులే మనలను బ్రదికింపఁ జేయుచుండ నా శక్తిని సూర్యునివలననే ప్రాణాయామధ్యానముల మన మాకర్షించిన నెంత విశేషముగ నాకర్షింపఁగలమో యెంత బాగుపడఁగలమో యాలోచింపుము.

ఆరోగ్యము విషయముగఁ జూచినను సంధ్యావందన మావశ్యక మగుచున్నది. మనకుఁ గానవచ్చుచున్న సూర్యమండలమున కీశక్తి నింతగనిచ్చు సామర్థ్యములేదు. భగవచ్ఛక్తి మనకు వచ్చుట కది ద్వారము. కావుననే భగవంతుని సవితృమండల మధ్యవర్తియని పెద్దలు స్తుతింతురు. సూర్యుని మహిమ తెలియవలసియుండిన ఆదిత్యహృదయము దాని వ్యాఖ్యానమైనఁ జదువుము. మన హృదయకమలము వికసింపఁ జేయువాఁడు సూర్యుఁడే. కావున నాయనను బ్రతిదినముపాసింపవలెను.

మంత్రము జపింపనేల? దాని యర్థమును స్మరించినఁ జాలదా యందువేమో చాలదనియే నా ప్రత్యుత్తరము. ఒక తుపాకిగుండు తీసికొని నీచేతి బలముకొలఁది విసరికొట్టుము. దానినే తుపాకిలోవేసి మందుతోడ గట్టించి కాల్పుము. దేనితో నెక్కువదెబ్బ తగులును? ఏల? అట్టులే మందే మంత్రము. తుపాకి గొట్టము మనస్సు. మంత్రభావము గుండు. మననము చేయువారిని రక్షించునది కావున దానికి మంత్రమనిపేరు. గాయత్రికి మించిన మంత్రములేదని ప్రమాణము. మంత్రాక్షరములందు ఆ గుణమున్నది. బొగ్గు-సురాకారము గంధకము కలసికదా తుపాకిమందయ్యెను. ఈ మూఁటియందే యే పదార్థ మెంతెంత కలయవలయునో యంతంతే కలసిన నెట్టి గుణముకలదో తద్భిన్నపరిమాణములఁ గలిపిన నెట్టి గుణము కలదగునో యూహింపుము. ఇదియు నీ వూహింపలేవేని నీవు తినుపదార్థములందుఁ బులుసునందో చారునందో ఉప్పుకారము పరిమాణముప్రకారము పడిన నెట్టుండునో పరిమాణము తప్పిన నెట్లుండునో తెలియదా. అట్లే ధ్వనులందును కొన్ని

కొన్ని ధ్వనులొక్కటిగఁ గలసినఁ గొన్ని కొన్ని గుణముల నిచ్చుచుండును. అన్ని రాగములు సప్తస్వరములవలననే కలిగినను నొక రాగమునకు వేఱొక రాగమునకు భేదముకలుగఁ గారణమేమి? అట్టులే మంత్రాక్షరములు. గాయత్రిలోని ప్రత్యక్షరమున కొక్కొక్క ఫలముగలదు. మంచి ఫలముగల బీజాక్షరముల నెల్ల నేఱివానితో నైన శబ్దములతో నేయేశబ్ద మెచ్చటెచ్చట నుంచిన బాగాయోజించి గాయత్రి కూర్పఁబడినది. దాని యర్థమును తెనుఁగునందో యాంగ్లభాషయందో స్మరించిన నెట్లు ఫలముగలుగును? నీకు శ్రద్ధయనునది యుండెనా నేను జెప్పిన యీమాత్రముచేతనే చక్కఁబడుదువు. నీ కర్మమట్లుండి శ్రద్ధలేకపోయెనా నే నింతకుఁ బదింతలు నడుము విఱుగ వ్రాసినను నీకు దానిపై బుద్ధిపోదు. బ్రాహ్మణ తేజము నీయందు లేనప్పుడు నీకు దీనిపై బుద్ధిపోదు. చెప్పినను మనస్సున కెక్కదు. నిప్పురవయైన లేనప్పుడు ఎంత విసరియేమి లాభము?

తాతలు ముత్తాతలు సంపాదించిన రోగాదులెట్లు మనుమలకు మునిమనుమలకును వంశ పారంపర్యముగ వచ్చునో యట్లే పూర్వులు సంపాదించిన తేజస్సుకూడ వంశపారంపర్యముగ వచ్చుచుండును. బ్రాహ్మణులు ఋషిగోత్రజులు కావున ఋషుల బ్రహ్మతేజ మింకను మనయందుఁగొలఁదిగానో గొప్పగానో యున్నది. తండ్రితాతలు సంపాదించిన ధనము బిడ్డలు పోఁగొట్టుకొనఁ గూడనట్టు ఋషులవలన వచ్చి మనపూర్వుల యాచారలోపముచే పోఁగా మిగిలిన తేజమును మనము పోఁగొట్టుకొనక కాపాడుకొనవలయును. సంధ్య దానిని గాపాడును. తక్కిన తపశ్చర్యలచేత దాని నభివృద్ధి చేసికొనవలయును. ఉన్నదానిని కాపాడుకొన లేనివాఁడు క్రొత్తగ సంపాదించు టేటిమాట? కాఁబట్టి సంధ్యవార్చని ద్విజుఁడు సర్వథా భ్రష్టుండని నమ్ముము.

ఒక నిమిత్తముగఁ జేయు కర్మములు నైమిత్తికములు. ఏకాదశి అమావాస్య మొదలైన తిథులఁ జేయు వ్రతాదులు, నిత్యకర్మము

నీటఁగలిసినవారికి నైమిత్తిక కర్మమేల? మొత్తుకొననా గాని యైనను నీవు తెలిసికొని యుండుట మంచిదని యెంచి యెంచి యొక యేకాదశిగుఱించి చెప్పెదను. దశమీద్వాదశులందు రాత్రిపూఁటల భోజనము చేయరాదు. ఏకాదశి యుపవాసము. అన్నమేసున్న యైనప్పుదు తక్కిన భోగములు తాంబూలము మొదలైనవి కూడవని చెప్పవలయునా? ఏకాదశినాఁడు భగవద్విషయము చదువుట, స్మరించుట, దేవపూజలోనైనవి చేయవలయును గాని క్షుద్రవిషయముల పై మనస్సు పోనీయరాదు.

కడుపు కాల్చుకొనుటవలన నేమిప్రయోజన మందువేమో? ఈ విషయము పూర్ణముగ రుక్మాంగద చరిత్రయందు వ్రాయఁబడియున్నది. దానిని జదువుము.

**కం. ధారణీసురునకుఁ దపము విద్యయు రెండు**
**ముక్తిదంబు లగుచు మొనయు చుండు**

అని ప్రమాణము విద్యయనఁగా నాంగ్లవిద్యకాదు. వేదవిద్య. పంచసూక్తములైనను ద్విజుఁడ ననుకొనువాఁడు నేర్చియుండవలయును. ఈ రెంటి విషయమై నేను జెప్పఁదలఁచిన దంతయుఁ జెప్పలేదు. సులభసాధ్యములైన నీ రెంటిని సాధించితివేని తక్కినవానియందు నీకే యాస్థగలిగి తెలిసికొని ప్రవర్తింతువు. ఇందుఁ జెప్పలేదని యమావాస్యలు సంక్రమణములు శ్రాద్ధాదులు వదలిపెట్టకుము. వీని నన్నిటిని వదలి పెట్టితివా నీబ్రతుకు వ్యర్థము. నీ వారోగ్యమును గాపాడుకొనలేవు. మంచి సంతానమును గనలేవు. ఇఁకఁ గోటిజన్మములకైన నీవు భగవత్ప్రాప్తి కర్హుఁడవుకావు. పశుపక్ష్యాదుల తరగతిలోఁ బుట్టుదువు.

నీవు బ్రాహ్మణుఁడవగుట నీకు విహితకృత్యము వ్రాసినను నేను మీఁదఁజెప్పినది బ్రాహ్మణ క్షత్రియ వైశ్యుల కందఱకు నన్వయించును. బ్రాహ్మణుఁడని వ్రాయుటచేఁ దక్కిన జాతులవారు దక్కువయని నా

యభిప్రాయముకాదు. అట్టి యభిప్రాయముగలవారు తెలిసినవారుగారు. నేను మీఁదఁజెప్పిన సంధ్య, వేదము తప్పఁ దక్కినవి యన్నిజాతుల వారికి నావశ్యకములే.

ద్విజేతరుల కీ నియమములు లేవు. వారు పుణ్యాత్ములు. కావున వారికి ద్విజులకువలె భ్రష్టత్వమురాదు. కావుననే కదా వ్యాసమహర్షి "శూద్రుఁడా నీవే సాధువు. ధన్యుఁడవు" అని చెప్పినట్లు విష్ణుపురాణమునఁ జెప్పఁబడెను. అన్ని జాతులవారును మోక్షాధికారులే. నీవును వారెక్కువ వీరు తక్కువయను నభిమానము ద్వేషము పెట్టుకొనకుము. ఆ యా కార్యములందు వారువారు శ్రేష్ఠులే. సద్గుణము కులధర్మ మెవ్వనియందుఁ గలవో వాఁడు శ్రేష్ఠుఁడు. నే నీవిషయ మార్యచరిత్రలయం దిదివఱకే వ్రాసియున్నాను. నెల్లూరిలో నేను కాఁపురముండిన సమయమున నొకనాఁడు నేను వేంకటసుబ్బయ్య యిద్దఱమొకగడమంచెచేయఁ బూనితిమి. ఆయన నాకంటె బలశాలి కనుక కొయ్యత్రోఁపుడు త్రోయుటకుఁ బూనుకొనెను. 5 నిమిషములు త్రోసి ఇఁక పదిమార్లు ఎం.ఏ. పరీక్షకుఁ చదువుమనినఁ జదివి కడతేఱఁ గలఁగాని యీ పని నావలనఁ గాదనెను. ఆయన ఎమ్.ఏ. యగుట నీకుఁ దెలియునుగదా! ఆయనవిద్య గవ్వకుఁ బనికివచ్చెనా? ఆ పనిని వడ్లవాఁడు 5 నిమిషములలోఁ జేయఁగలిగెను. ఎం.ఏ.,బి.ఏ.గార్లను బట్టుకొనివచ్చి వంకరలేకుండ నొకచాలు దున్నుఁడని యడుగుము. వారిపాటు చూతువుగాని; కాఁబట్టి యెవరు శ్రేష్ఠులు?

మఱియొకవిధముగాఁ జెప్పెద వినుము. దేహమునఁగల కాళ్ళు, తొడలు, చేతులు, తల వీనిలో నేది ముఖ్యము? కాళ్ళుగదా! దేహమునంతయు మోయును, కాళ్ళుగావాయాహారమున్న చోటికి దేహమును గొనిపోవును. కాళ్ళులేని దేహము గతియేమి? భగవంతుని పాదములనుగదా మనము పూజించుట. శూద్రులు భగవంతుని

పాదములవలనఁ బుట్టిన వారేకదా? తక్కిన మూఁడుజాతులవారికి నిలువ నాధారము శూద్రులు పండించిన పంటలేకదా! ఊర్ధ్వదేహమంతయు నిలుచునది పాదములపైఁగాదా? పాదములకు నూర్ధ్వదేహమునకు మధ్యస్థముగ నుండునది తొడలుగావా? కాళ్ళు, చేతులు, తల యన్ని యుండియు నడుములు పడిపోయినవా రెట్టివారో తెలియదా? అట్టులే చేతులను దలనుగూర్చి యోజింపుము. ఏదియెక్కువో యేదితక్కువో యిప్పుడు చెప్పుము. భగవంతుని పాదములవలన శూద్రులు, తొడలవలన వైశ్యులు, బాహువులవలన క్షత్రియులు, ముఖమున బ్రాహ్మణులు పుట్టిరని పురుషసూక్తము. భగవంతుని దేహములో నేదియుత్కృష్టమో యేది నికృష్టమో చెప్పుము. ఈ నాలుగు జాతులను గుణకర్మ భేదములఁబట్టి నేనే సృజించితినని భగవంతుఁడు భగవద్గీతయందుఁ జెప్పెను. ఇది యెంతయు సత్యము. సమదర్శులే పండితులు.

ఆత్మరక్షణేచ్ఛ – సంతానేచ్ఛ – ఆనందేచ్ఛ యివి స్వభావధర్మములని చెప్పితినిగదా. అందు వృక్షాదులకు గాలి నీళ్ళు – ఎండ – మన్ను ఇవి యాత్మరక్షణమునకుఁ గావలసిన పదార్థములు. ఇవి యెక్కడఁ దలఁచుకొనిన నక్కడనే యుండును గనుక దీనికై వెదకికొని పోవలసిన పనిలేదు. కాఁబట్టి కాళ్ళతోఁ బనిలేదు. ఇవి యెప్పుడు స్పృశించియుండును గనుక కన్నులతోఁ బనిలేదు. ఇట్టులే చెవులు మొదలైనవి. ఆహారము గ్రహించుట కేవి కావలయునో వానిని మాత్రమే దేవుఁ డిచ్చినాఁడు. మృగముల కట్టుగాదు. అవి పచ్చిక తినినను పురుగులను దినినను అవి యున్నచోటి కివి పోవలయును గాని చెట్లకువలె వీనినోటిలో నవి తామేచొరఁబడవు. నీకు కావలసిన యాహారము దూరమున నుండెనేని యచ్చటికి పోయి తినవలయునని కోరిక పుట్టునుగదా! ఈ కోరిక పుట్టఁగానే పోవుటకు భగవంతుఁడు కాళ్ళిచ్చెను.

వృక్షములకావల మనకు గోచరించువానిలో 'అమోబా' యనునది యత్యల్పిష్ఠజంతువు. దీనికి దేహమంతయుఁ గడుపే. దేహమంతయు నోరే. అనఁగా దేహమంతటితోను ఆహారము గ్రహించును. దేహమంతయు జీర్ణకోశమే దీనికి దేహమంతయు మలమూత్రద్వారమే. అనఁగా మనకు ఆహారము గ్రహించుటకు – జీర్ణించుకొనుటకు – మలము విడుచుటకు సంతానము పడయుటకు వేఱు వేఱంగము లున్నట్లు దీనికి లేదు. అయినను కార్యములన్నియు జరుగుచునే యుండును. స్థానమునుండి చలించుశక్తి తొలుత దొరలుటగాను తరువాత ముండ్లుగాను – క్రమముగ ఱెక్కలు కాళ్ళుగను బరిణమించుచున్నది. తొలుత పాదములే యన్నమును దేహమున కందియిచ్చును. మొదటి తరగతిలోఁ జేరినవి ఏకకణ జంతువులు ముత్యమువలె నొంటిగది గలవి ఏక కణజంతువులు. ఈ గదిలోనే మీఁదచెప్పిన కార్యములన్నియు జరుగును. ఈ గదులు చిన్నవిగను పెద్దవిగను పెక్కురకములుగ నుండును. ఈ గది క్రమముగఁ బెరిఁగి యొకటి రెండగును. ఆ రెంటియందును యథాక్రమముగఁ గార్యములన్నియు జరుగుచుండును. ఈ రెంటిలో నొక్కకటి రెండు రెండగును. ఇట్లు క్రమక్రమముగ తొలుత నొకటిగానున్నది చీలి చీలి యెన్నియో యగును. వీని సంతానము వృద్ధియగు రీతి యిది.

ఏకకణ జంతవులకుఁ దరువాత బహుకణ జంతువులు రెండు మూఁడు నాలుగు ముత్యము లొక్కటిగఁ జేర్చినట్టు కణములును జేరును. కొన్నిటియం దీకణములు వేఱు వేఱుగ చీలి వేఱువేఱు జంతువులగుట కలదు. కొన్నిటియందు కణములకుఁ బరస్పర సాహాయ్యము కావలసి యుండుటచేఁ జీలకయొకటిగానే కఱచుకొనయుండి రెండును బాగుండుటకై కొన్ని కార్యములొకటి కొన్ని కార్యములు వేఱొకటి చేయుచుండును. ఒక కణము ఆహారమును గ్రహించి జీర్ణించుకొనిన రెండవదానికిని ఆ సారము పోవలసిన యావశ్యకత యేర్పడెను గనుక నీ

యాహారము దీనిలోనుండి దానిలోనికి పోవుటకు గొట్టమొకటి యేర్పడెను. ఇదియే మనలో నాహారనాళముగఁ బరిణమించెను. ఈ గొట్ట మేర్పడఁగానే యాహార మొకప్రక్క గ్రహించుట రెండవప్రక్క విడుచుట కలిగెను. ఇదియే మలమూత్రముల ద్వారములయ్యెను. ఈ విధముగ అన్నము దేహమునకంతయు వ్యాపింపఁగలిగెను. ఇట్టులే క్రమముగ నా యా కార్యములకు నా యా యవయవములు అనఁగా నోరు జీర్ణకోశము మొదలైన వేర్పడెను.

ఎప్పుడొకజంతువు మఱియొకజంతువును ఆహారముగఁ గొనఁగలిగెనో యప్పుడే యా రెండవజంతువు తనప్రాణమును రక్షించుకొనుకోరిక గలదయ్యెను. అప్పుడు మనకు చేతలవలె నా యా జంతువునకుఁ దగిన సాధనములను భగవంతుఁడు కల్పించెను.

ప్రతి కణమునకు మనస్సు ప్రాణ మున్నదని తెలియుము. అట్లగుటచే పెక్కుకణములు గలసి యొక జంతువైనపుడా యాకణము దానిదాని మనస్సువచ్చి ప్రవర్తించిన యెడలఁ గార్యములం దైకమత్యము లేకపోవుటచే దేహమునకంతయు హాని కలుగును. కావున నీ కణములన్నియు నొక కణములోని మనస్సునకు లోపడి యుండునట్లుగ నొకకణమును దేవుఁడు సృజించెను. ఇది దేహమున నొకచోటనుండి తక్కిన యన్ని కణములను నీవిప్పుడిట్లు చేయవలయును. నీ విప్పుడిట్లు చేయవలయును అని తెలియఁచేయుచుండెను. అన్ని కణములు ఇది చెప్పినట్లు ప్రవర్తించుచుండెను. ఈ కణము పెరిఁగి పెరిగి మన మెదడుగఁ బరిణమించెను. దీనికి వేఱొక కార్యములేదు. తక్కిన యన్ని యవయవముల కేదిమేలో యది యాలోచించి సమయమునకుఁ దగినట్టు బోధించుచుండుటే. నేనిప్పుడు సూక్ష్మముగఁ జెప్పిన యీ విషయము జీవశాస్త్రమున విపులముగఁ దెలియఁగలవు. వివేకముతోడఁ జదువవలయును. ఇది జ్ఞానావబోధకమగు వింతవిషయము.

మీఁద చెప్పినవిషయము నాలోచించితివా తొలుత నాహార మున్నచోటికిపోయి యా యాహారమును దేహమున కందిచ్చు నవయవములు పుట్టెననియుఁ దరువాత నా యాహారమును దేహమున కంతయుఁ బ్రసరింపఁజేయు నవయవములు పుట్టెనననియుఁ దరువాత నన్నిటిని నేకవిధముగ బ్రవర్తింపఁజేయు నవయవము పుట్టెననియుఁ దెలియనగును. ఇప్పుడు నాలుగుజాతుల కార్యము లాలోచింపుము. మొదటి మూఁడుజాతులలో నాహారము పుట్టించువారున్నారా? ఇది శూద్రుల కార్యమేగదా! ఆ సృష్టించిన దానిని దెచ్చి యందఱ కిచ్చువారు వైశ్యులేకదా! ఈ కార్యములందుఁ దోడుపడుచు దేహమున కపాయము లేకుండఁ గాచువారు క్షత్రియులేకదా. ఇందఱు వారివారి కార్యములందుండఁగా వీరు పొరపడకుండ నుచితపద్ధతులు తెలుపవలసినవారు బ్రాహ్మణులే కదా'. ఒక్కొక్క దేహమున నుండుకార్యము నాలోచించి యాపద్ధతులప్రకారముల నాలుగుజాతులు సృష్టింపఁబడినవని తెలిసెనా. ఇది వారి వారి కార్యములనుబట్టి యేర్పడిన యేర్పాటులేకదా? ఈ యేర్పాటులు దైవసంకల్పితమనియు మనుష్యకల్పితము గాదనియు తెలిసెనుగదా. గుణములను బట్టియు నీ యేర్పాటులే కానవచ్చెడిని. ఆ విషయము సీతాదేవి చరిత్రమందుఁ గొంతవ్రాసితిని. ప్రస్తావన వచ్చినపుడు మఱింత చెప్పెదను. ధర్మవ్యాధుని చరిత్ర చదువుము. ఈ విషయములు దెలిసిననే నెవరిపై ద్వేషింపగలను? ఒకఁడుత్కృష్టుఁడని మఱియొకఁడు నికృష్టుఁడనియెట్లు చెప్పఁగలను? నీవు చెప్పిన యేర్పాటు లిప్పుడులేవే యందువేమో. సత్యము. ఆమాత్రముచేత నేర్పాటులు చెడ్డవని చెప్పఁగలవా? ఒక గడియారము 10 సంవత్సరములు చక్కఁగ నడచి తరువాత చెడిన నది గడియారము దోషమా? గడియారము చేసినవాని దోషమా? దానిని వాడుకొనువాని దోషమేకదా? నడుమ నడుమ చక్క చేయించుచుండిన నేలచెడును? అట్టులే యీ యేర్పాటులును పాలించువాఁడు లేక చెడినవి. జ్ఞానహీనులు చెడినవానిని

మఱింతచెఱుతురు. చెడిన గడియారమును జక్కఁజేయ నెట్టివాఁడు సమర్థుఁడు? దానితత్త్వ మెఱిగినవాఁడుకదా? దీనిని దెలిసి చక్కఁజేయువాఁడొకఁడుండినఁ దెలియక చెఱుచువారు నూర్గురున్నారు.

## బ్రహ్మచర్యము

ఇఁక బ్రహ్మచర్యము గుఱించి చెప్పెదను. ఈవిషయము చెప్పఁబూనిన నా మనస్సు ఉయ్యల లూఁగుచున్నది. బ్రహ్మచర్యము పవిత్రవిషయమే నేనవశ్యము తెలియవలసినదేకదా? ఏల యింత సందేహ మందువేమో? సీతారామాచార్యులవలె "బ్రహ్మచర్యము = ఆశ్రమవిశేష" మని చెప్పఁ దలఁచినను లేక యంతకుమించి యినుపగోఁచి పెట్టుకొని స్త్రీసాంగత్యము చేయకుండుట యని చెప్పఁదలఁచినను భయము లేదు. ఈ మాటలవలన నీవేమి తెలిసికొని బాగుపడఁగలవు? బ్రహ్మచర్యవ్రతము నడుపని కారణముచే ననేకులు చెడిరి, చెడుచున్నారు. కావున నీవు చెడిపోవుట కిష్టము లేనివాఁడనై వావిచ్చి స్పష్టముగఁ జెప్పసాహసించితిని. ఇది తల్లిదండ్రులు చెప్పవలసిన విషయమైనను నట్లు వారు చేయుట లేదనియుఁ జెప్పువారు లేకయే యనేక బాలురు చెడుచున్నారనియు నా యనుభవముచేఁ దెలిసికొంటిని. అంతియగాక నాకు హితమైన చర్య చెప్పుమని నీ వడిగినప్పుడు కొంత చెప్పి కొంత చెప్పకుండిన నీకు ద్రోహము చేసినవాఁడ నగుదును. నీవు తెలియక చెడిన నేను దానికిఁ గారణమగుదును గనుకఁ జెప్పఁ దలఁచి చెప్పుచున్నాను.

''ఋతుకాలముల స్వభార్యయందుఁదప్ప రేతస్ఖలనము గావింపకుండు నియమము'' బ్రహ్మచర్యవ్రతము. ఈ మాటలను శిలాక్షరములవలె నీ మనస్సున నాటఁజేయుము. నీకు నిషేకముహూర్తము కాలేదు గనుక "ఋతుకాలముల స్వభార్యయందుఁ దప్ప" అనుమాటలు నీ కన్వయింపవు. కావున నీ విషయమున రేతస్ఖలనము గావింపకుండుటే

బ్రహ్మచర్యమని తెలిసికొనుము. నేనిట్లు చెప్పుటచే రేతస్సనేమి? స్ఖలనమ నేమి? దానివలనఁ గలుగు నష్టమేమి? అదిగాకుండిన లాభమేమి? స్ఖలనముగట కేమికారణము? అను ప్రశ్నములు నీ వడుగుదువుకదా? ఈ విషయ మిదివఱకుఁ దెలియకుండెనా నీవు ధన్యుఁడవు. నిషేకముహూర్తమగు వఱకుఁ దెలియకుండుటే క్షేమము. అయినను దెలియకుండుట కష్టము. బాల్యమున బాలురాడు నాటలలో నాలుమగనియాట యనునది యొకటైయుండు నీ కాలములో నీ వయస్సువానికిఁ దెలియు టేమివింత? ఈ విషయము పెద్దల వలన సరియైన మార్గమునఁ దెలిసిన మేలుగాని దుష్టసహవాసులవలననో సిగ్గుమాలి వీథులలోఁ దిట్టుకొనుచుండువారి వలననో దుష్టస్త్రీలవలననో తెలిసినయెడ నా బాలుఁడు చెడకుండిన నది గొప్పవింతయని తలపవలయును.

11-12-వ సంవత్సరము మొదలు దేహములో నొక విధమైన మాఱుపాటు కలుగుచుండునని బాలక హితచర్యయందు వ్రాసితినిగదా! అట్టి మాఱుపాటులు నీయందును గలిగినవి కాని కలుగక పోలేదు. నీ మనస్సునకు స్ఫురింపకుండిన నేను వ్రాసినదానిఁబట్టియైనఁ బరీక్షించుకొనుము. ప్రతిజీవికి స్వభావసిద్ధమైన రెండవకోరిక సంతానేచ్ఛ యని చెప్పితినిగదా! ఈయిచ్ఛ కొనసాగించుకొనుట శ్రేయస్కరమే. ఇట్టి యిచ్ఛయందు దోషమేదియు లేదు. అయినను స్వభావసిద్ధమై నిర్దుష్టమైన కోరికయైనను దానిని కొనసాగించుటకు కాలములు మార్గములు కలవు. వానిని భగవంతుఁడే యేర్పాటుచేసి యున్నాఁడు. వానిని తెలిసి ప్రవర్తించిన క్షేమము కలుగును. సత్ఫలము నిచ్చును. తెలియకగాని తెలిసి మఱియొక మార్గమున నకాలమునఁ బ్రవర్తించినఁగాని కీడు కలుగును. బాలకహితచర్యలోఁజెప్పిన దంతముల యుదాహరణము స్మరించు కొనుము. నీవు కాలుసేతులతోఁ బుట్టితివి గాని యివి నీ కెన్నియేండ్లు

కుపయోగపడెను? ఆ యుక్తకాలము లోపల నీవు బలాత్కారముగ వాని నుపయోగింపఁ దలఁచిన నేమిగతిపట్టుదువు? కాఁబట్టి ప్రత్యవయవమును సరియైన కాలము మార్గ మెఱిఁగి యుపయోగింపవలయును.

నోటికి ముక్కునకు రెండు రెండు కార్యములు విధించినట్లే పురుషాంగమునకు రెండు కార్యములు భగవంతుఁడు విధించినాఁడు. ఏ యంగమువలన నీవు స్త్రీవికావు పురుషుఁడవు అని గుర్తింపఁబడుదువో యా యంగము పురుషాంగమని, పురుషాంగమని చెప్పినచోటనెల్ల నర్థము గ్రహింపుము. ఈ యంగము చేయుకార్యములలో నొకటి మూత్రవిసర్జనము. రెండవది రేతోవిసర్జనము. మొదటిది దేహపరిశుద్ధము నిమిత్తమై చేయవలయును. ఈ యంగమున కీ సంతానము కలిగించు శక్తి యధమపక్షము. 21-వ సంవత్సరము మీఁదఁగాని రాదు. ఆలోపల దాని నా కార్యమునకై వినియోగించుట కసుగాయను పండవేయుటే లేఁత టెంకాయచెట్టున కల్లుగీయుటే యగును.

రేతస్సునది తెల్లగా జిగటగా మంచి స్థితియందు చిక్కగా నొకవిధమైన వాసనగల ద్రవపదార్థము. అన్నములోని సారాంశము నెత్తురగుట తెలియునుగదా. ఆ నెత్తురులోని స్థిరసారాంశము కొన్ని మార్పులుచెంది రేతస్సుగా మాఱి నాళముల మార్గమున నండములలోనికిఁ ప్రవేశించును. అచ్చటనుండి యిది పురుషాంగము ద్వారమున వెడలఁగొట్టఁబడదేని యిది మరల నెత్తుటిలో గలసి యోజస్సను శక్తిరూపమున మెదడులోఁ జేరును. ఈ యోజశ్శక్తి యెంత యెక్కువగునో యంత ధారణాశక్తి, బుద్ధిబలము, దేహబలము, ఆరోగ్యము లోనగు ననేక సద్గుణములు సులభసాధ్యము లగును. ఇది యెంతెంత క్షీణించునో యంతంత దౌర్బల్యము – మతిహీనత – అనారోగ్యము ప్రబలి దేనికిఁ గొఱగాక తుదకు పిచ్చి పట్టినవాఁడుగ నగును. ఈ కారణముచేతనే బ్రహ్మచర్యము పరమపవిత్రమని యోగులు, సన్న్యాసులు, వ్రతస్థులు,

మహర్షులు లోనగు మహాత్ములెల్ల దానిఁ గొనియాడి వదలక యవలంబింతురు. కణ్వుఁడు మొదలగు నూర్ధ్వరేతస్కు లందఱు నొక్క బొట్టైన దీనిని విడిచినవారుగారు. భరద్వాజుఁడను నామమే యీ గొప్ప మహిమను దెలుపుచున్నది. బ్రహ్మచర్యము జరపువాఁడు మృత్యువునుగూడ జయించునని భారతాదులు చెప్పుచున్నవి. కాఁబట్టియే రేతస్సు ప్రాణమునకుఁ బ్రాణము. రేతస్సు వ్యర్థపఱుచువాఁ డెంత ప్రాణశక్తి ప్రోగు చేసికొనినను వ్యర్థము. వాఁడు దమ్మిడీకి కొఱగాఁడు. బాలకహితచర్యయందుఁ జెప్పిన రోగి చిహ్నములన్నియు సకాలమునఁ జెడుమార్గమున రేతస్సు వ్యర్థపఱుచువానియం దుండును. రేతస్సును బరీక్షించిన పాశ్చాత్యులు దానియందు రేతో ద్రవమును ఒక యంగళములో 4000-వ భాగమంత సన్నని ధాన్యమువంటి గుండ్రని కణములును సన్ననై పొడుగై యలలవంటి గమనముగల గర్భజంతువులు నున్నట్టు వ్రాసియున్నారు. మనగ్రంథములందు నొక జీవి మరణించిన తరువాత నా జీవుఁడు నరకదుఃఖము స్వర్గము ననుభవించిన పదపడి యాకాశమునందు సూర్యకిరణములందు మంచునందు మేఘములందుఁ బ్రవేశించి వర్షబిందువులలోఁ గలసి భూమి మీఁదఁ బడి యోషధిరూపమునఁ బుట్టి దానిని భక్షించిన పురుషుగర్భములోఁ జేరి యావల స్త్రీగర్భములోఁ జొచ్చి దేహముగలవాఁడై మరల భూమిపై జన్మించును. ఇన్ని దురవస్థ లనుభవించి తన గర్భమునఁ జొచ్చిన జీవుని బుద్ధిపూర్వకముగ జలదారిపాలుచేసిన పురుషుని పాపము నేమని చెప్పవలయును? ఇట్టిదశయం దీ జీవునికిఁ దాను బూర్వజన్మమునఁ జేసిన పాపము, అనుభవించిన దుఃఖము, స్మృతియందుండి యెప్పుడెప్పుడు మరల జన్మింతునా యీ సారియైన సత్ప్రవర్తనము కలవాఁడనై యెప్పుడు తరింతునా యని తహతహ పడుచుండును. అట్టి జీవుఁడు బాగుపడు తరుణములో వానికి విపత్తు కలిగించినచో వాఁడెంత దుఃఖపడును?

ఎంత శపించును? ఈ మహాపాప మూరకపోవునా? పాశ్చాత్త్యులు చెప్పెదు నీ జంతువలనే గర్భజంతువులని దీనియందు జీవుఁడుండునని మనవారు చెప్పెదరు. మనల నాశ్రయించి మనయందుఁ జేరిన జీవునికి కరణ కళేబరమిచ్చి రక్షించుట శ్రేయస్కరమో నిరాకరించి భ్రష్టునిఁ జేయుట శ్రేయస్కరమో యాలోచింపుము.

తానే కొడుకుగాఁ బుట్టునని వేదములు చెప్పుచున్నవి. పాశ్చాత్త్యులు వారి శాస్త్రప్రకార మిది సత్యమని యామోదించి యున్నారు. నేనిదివఱకు వ్రాసినదాని వలన నీ విషయము కొంత నీకు బోధపడియుండును. తాను మరలఁ బుట్టుట దేనికో యదియుఁ జెప్పియున్నాను. ఆ ప్రకారము తాను మరలఁబుట్టుట యనునది ప్రథమ పుత్రునకే విశేషమన్వయించును. తన యాత్మకు నాత్మ దేహమునకు దేహము గలిగి పుట్టినవాఁ డగుటచే తండ్రికి పెద్దకొడుకుపైఁ బ్రీతిమెండు. తనకంటె ప్రియమైన పదార్థము తనకు వేఱొకటి యుండదుగదా! తొలుత వెలువడు రేతస్సువలనఁ గదా ప్రథమ పుత్రుఁడు జనించును. అట్టిదానిని దుర్వినియోగము చేయువానికిని ఆత్మహత్య చేసికొనువానికి నేమి భేదము? ఆత్మహత్య చేసికొనువానికి సూర్యరశ్మిలేక గాఢాంధకారమయమై దుర్గంధభూయిష్ఠమై మహా భయంకరమైన నరకము ప్రాప్తించును. పరహత్యకంటె నాత్మహత్య ఘోరపాపము. రేతస్సు వ్యర్థపఱుచువాఁ డట్టి పాపము చేసినవాఁడే యగును.

భగవంతుఁడు చేసిన యేర్పాటు నతిక్రమించి దుర్బుద్ధియై ప్రవర్తించువాఁ డాయనయాజ్ఞ మీఱినవాఁడే కదా! వానికి సుఖమెట్లువచ్చును? కావున నాయనా? ధర్మపద్ధతిభార్య యందుఁదప్ప రేతస్సు వ్యర్థముచేయుట సర్వథా హానికరము మహాపాపము.

పురుషుని దేహమున నీ రేతస్సు 11-వ సంవత్సరము మొదలుకొని కొంచెముగా నూర నారంభించును. ఇది మరల రక్తములోఁ గలిసి యోజస్సుగా మాఱుటే దేహమున మార్పులు కలుగుటకుఁ గారణము.

ఒక పిల్లవాఁడు బాగుగ నడచుటకుముందు తొలుత బోరగిలఁబడును. తరువాత పొట్ట చేరుళ్ళు పెట్టును. తరువాత గోడపట్టుకొని నడచును. తరువాత తప్పటడగులు పెట్టును. ఆవల నిర్భయముగ నడచును. అట్టులే యొకపండు భోజ్యమగుటకుముం దెన్నిదశలు వహించునో యోజింపుము. లోపల సారమెక్కి దేహమునకు శక్తివచ్చుకొలఁది కాలక్రమముగ నా యా కార్యములు స్వభావముగ జరగును. తొందరపడిన కసుగాయ పండవేసినట్టులగును.

అట్టులే నీ దేహస్థితియును 11-వ సంవత్సరము మొదలు మాఱుట కారంభించును. రమారమి 21-వ సంవత్సరము మీఁదఁ బూర్ణమగును. ఈ లోపలఁ గలుగు మార్పులన్నియుఁ గ్రమక్రమాభివృద్ధిగ నుండును. ఇంతకుఁ గారణము రేతస్సని తెలిసికొనుము. దానిని వ్యర్థపఱుచుటచేఁ గలుగు కీడెట్టిదో నీవే యూహించుకొనుము.

ఇఁక నీ రేతస్సు దేహమున విడిచిపోవుటకుఁ గారణములు చెప్పెదను. ఈ ద్రవముచే బీజకోశములు నిండిన తరువాత నెక్కువైనది యంతయుఁ బొరలి రేతోనాళములోఁ బ్రవేశించి బయట పోవును. ఇది స్వభావముగానే కనఁబడును. వారమునకో రెండుమూఁడు వారములకో నెలకో రెండు నెలలకో యొకసారి యాయా బాలుర దేహదార్ఢ్యము నరముల పటుత్వ మెక్కువగుకొలఁది యాలస్యముగను నరముల బలము తక్కువగుకొలఁది శీఘ్రముగను రేతస్సు స్ఖలనమగుచుండును.

ఇది స్వభావముగ పోయినచో దేహమునకు విశేష బాధలేదు గాని పోయిన తరువాత నధమపక్షము 24 గంటలైనను దేహము బలహీనముగఁ జేయక మానదు. అయినను దీనిని రోగముగ భావించి భయపడవలసిన యక్కఱలేదు. గాని దేహమునకు బలమీయవలసిన పదార్థము వ్యర్థమైపోవుటయు దానివలన నొక దినమంతయు బలహీనత కలుగుటయు శోచనీయము.

ఇట్టి యమూల్య పదార్థమును నేకారణముచే నైనను వెలుపలఁ బోనీయరాదని మనవారు చెప్పి దానినంతయు దేహమునందే యిముడునట్టియు ఓజస్సుగ మార్చునట్టియు నుపాయములఁ జెప్పియున్నారు. ప్రాణాయామము సాధించుటచే నెప్పటిదప్పుడు ఓజస్సుగా మాఱుచుండును. దానివలన బీజకోశములు పొరలిపోవునంతగ నిండవు. కారణములేక యీ ద్రవము బయట పోఁజాలదు గనుక నా కారణములు గలుగుకుండఁ జేసికొనుట మేలు. ఇట్టి కారణములలో నజీర్ణము ప్రధానమైనది గనుక నజీర్ణ వ్యాధిలేకుండ దేహమును రక్షించుకొనవలయును. రాత్రివేళ కేవల మితాహారిగ నుండుట చాల శ్రేయస్కరము. మనస్సునకు నరములకు నుద్రేకము కలిగినఁగాని యీ ద్రవము వెలుపలఁబోదు. ఈ యుద్రేకము దిసమొల పటములను, సంభోగమును దెలుపు పటములను, పశుపక్ష్యాదులు సంగమించునపుడును ఆసక్తితోఁజూచుట, వారికి సంబంధించిన కథలపుస్తకములు చదువుట, బండుబూతులు మాటలాడుట వినుట, స్త్రీలను ఆసక్తితోఁజూచుట వీనివలనఁ గలుగును. ఇట్టి కామోద్దీపకము లయినవన్నియు హానికరములే.

కాఫీనీళ్ళు, తేయాకునీళ్ళు, మాంసము మొదలైన తామసాహారములు ఇవన్నియు నుద్రేకకరములే.

"And now that I have broached the subject, I must further digress to say that stimulation is fever and nothing else. A stimulant in the proper medical sense of the word, is an agent which the being organism resists and expets with that kind, degree and direction of vital action whose manifestations, constitute the symptoms of the hot stage of a fever. Locally, the effects of stimulants would be more properly termed *inflammation* and the infalmmation - the disease - will be of an intensity proportioned to the dose or quantity of the person." Dr. TRALL.

III. Tea, coffee, flesh meats to say nothing of the abominations of the baker and confectioner, are sufficient to account for the early tendency to sexual dissipation and debauchery manifested by a large portion of the children in our primary schools. Dr. TRALL.

1. ఎఱ్ఱగడ్డ తెల్లగడ్డ మొదలైన కంపుకొట్టు వస్తువలును ఓజస్సును చెఱుచును. కాఁబట్టి యాహారము మితముగను సాత్త్వికమైనదిగ నుండవలయును. బాగుగ దేహకష్టము చేసి మితముగ సాత్త్వికాహారము భుజించి మనస్సు దుర్విషయంబులఁ బోనీయనివానికి రేతస్ఖలన మెన్నాళ్ళకైనను తనంతటఁ గాదు. ఆరోగ్యము చెఱుచుకొనినవానికి యన్ని పీడలు కలుగుచుండును.

2. కొందఱు మతిమాలినవారు మీఁద చెప్పిన కారణములచే నుద్రేకము గలిగినప్పుడు బలాత్కారముగఁ దామే దానిని వెలుపల వచ్చునట్లు చేయుదురు. ఈ దుర్గుణము దుష్టసహవాసముచేతను, నింద్రియ నిగ్రహమునకు మార్గ మిది యని బోధించు చండాలుర వాక్యములయందలి నమ్మికచేతను, బలపడుటచే బాలురీ మహాపాప కార్యమును జేయుచున్నారు. ఇది యాత్మహత్యవంటిదని యిదివఱకే చెప్పితిని. కోమలములైన నరములకు స్వభావవిరుద్ధమైన పద్ధతి నుద్రేకము గలిగించుటచే పురుషాంగము బలహీనమై పురికొనలేక పోవును. పెరుఁగుచున్న తీఁగను నలిపితివేని తరువాత ఆ తీఁగ యెట్టుండునో నలిపినచోటఁ దీఁగ మఱి యెన్నాళ్ళకైన బలపడునేమో చూడుము. బుద్ధిమాలిన పిల్లవానిగతియు నంతే! కాలాంతరమున వీఁడు భార్యతో సుఖముగ రమింపఁజాలఁడు. వీనికిఁ గలుగు సంతానము బలహీనమయియే యుండును. ఆ మాత్రమైన మేలే. వీనికి వీని తల్లిదండ్రులకు భార్యపుట్టినింటి వారికి కలుగు కష్టనష్టములఁగూర్చి బాలక

హితచర్యయందు జూడుము. పవిత్ర నిర్మల సుఖసంతోషములు వీనిని పీనుఁగువలెఁ జూచి దూరమునఁ దొలఁగిపోవును.

3. ఆరోగ్యవంతుఁడై దేహపుష్టిగల బాలుని సవతి కొడుకునైనఁ దోడికోడలి కొడుకునైన దుష్టస్త్రీలు నిజకామనివారణార్థము చిరునవ్వులచేతను, ఓరచూపులచేతను, నర్మభాషణములచేతను, రహస్యసల్లాపములచేతను, దానమానాదులచేతను, దమకు వశపఱుచుకొని చెఱుతురు. ధనముకారణముగఁ గొందఱు బాలకులను గొందఱు దుష్టస్త్రీలు చెఱుతురు. ఇట్టి సందర్భములందెల్ల నీ దుష్టస్త్రీలు "ముండలరోగము"లను పేరుగల ఘోరవ్యాధులచేఁ బీడింపఁబడువా రగుటచే మూఢుఁడైన యా బాలుఁడును నా రోగములకు పాలుపడును. బుద్ధి గడ్డితినఁబోయి యొకసారి యీ చెడుకార్యము చేసినవారు ఆ జన్మాంతము సహింపరాని బాధలు పడుచుందురు. నరకయాతనలకంటెను వీరిబాధలు తక్కువైనవి కావు. వీరుమాత్రము దుఃఖితులైన మేలే. ఈ నిర్భాగ్యుల రోగము ఏ పాపమెఱుఁగక శుద్ధచరిత్రలైన వీరిభార్యలకు నిషేకముహూర్తమునఁ దొలినాఁటి రాత్రియే తగులుకొనును. అది మొదలు వీరి జీవమునకు వా రేడ్చుచుందురు. గతులుమాలి వీరికి బిడ్డలు పుట్టిరా వారిగతి యంతే!

ఈ మూఁడవది మహాపాపవిషయము. దీనిని స్మరించుటకుఁగూడ నా మనస్సొప్పదు. ఇఁక నేమిగ వ్రాయుదును. అయినను మంత్రసానితనమునకు నొప్పుకొన్నపిమ్మట నేమివచ్చినను బట్టవలసినదే విధి. కాఁబట్టి యెంత సూక్ష్మముగఁ జెప్పసాధ్యపడునో యంతమాత్రము చెప్పెదను. విపులముగఁ దెలియవలసియుండిన దీని విషయమున వ్రాయఁబడిన గ్రంథములఁ జదువుము. నీ భార్యతప్ప మఱియెవ్వతెయు నీమీఁది ప్రీతిచే నిన్ను వలచుట కల్లయని తలంపుము. అట్లు వలచుట స్వభావ విరుద్ధము. ఏదియో యొక రూపమైన నిజసుఖ లాభమునకై

యిది నిన్ను వలచును. అట్లు తన ప్రయోజనమునకై నిన్ను వలచునది నీకుముందెందఱనో వలచెనని నీకుఁ దరువాత మఱెందఱనో వలచునని తలఁపక పోయితివేని నీ కంటెను జడుఁడు లోకమున నుండఁడు.

తూము త్రెంచుకొనిన చెఱువు నీ రెన్ని మార్గముల పోవునో యాలోచింపుము. అట్టులే సిగ్గువిడిచిన లంజలందఱును. వాఁడు చచ్చినను బ్రదికినను పెండ్లాడిన మగనినితప్ప నితరుని గోరు స్త్రీ యెవ్వతెయైనను ఎట్టిదైనను లంజెయే. కాఁబట్టి యట్టివారు అంకుటాంద్రని నేను వేఱుగఁ జెప్పఁ బనిలేదు. ఇట్టి లంజెలయొద్ద నెన్నిరోగముల లుండవు? నీవు బుద్ధిమంతుఁడ వైతివా మీఁద చెప్పినదంతయు నీకుఁ దెలియకపోయినను నా సొత్తు కానిదాని నేనెట్లు అనుభవింప వచ్చుననియైనఁ దలంచి దృఢచిత్తుఁడవు కమ్ము. అట్టి దృఢచిత్తము లేనివారా లంజ మగనిచేతనో దాని నుంచుకొని యితరుల చేతనో పాదరక్షాప్రహరణము లనుభవించినవారును ప్రాణములు పోఁగొట్టుకొనినవారును ఎందఱో కలరు. ఈ సుఖమనుభవించిన తహశీల్ దార్లనే కొందఱను నాకుఁ దెలియును. అంతటి యవమానము సహించుకొని మరల నెత్తిమీఁద గుడ్డ వేసికొని నలుగురిలో వారు తిరిగినప్పుడు వారెంతటి మానహీనులో యని యబ్బుర పోవుచుంటిని.

దుష్టస్త్రీలవలనఁ గలుగు రోగములను ముండల రోగములని పేరు. వీనిలోఁ బెక్కు తెగలు కలవు. వాని నన్నిటిని నేను వర్ణింపలేనుగాని కొన్నిటి గుణములను జెప్పెదను, బాధపడువారిని జూచుటతప్ప నాకీవిషయమున ననుభవము లేమిని ప్రసిద్ధులైన వైద్యులు వ్రాసినవాని ననువదించెదను. ఈ రోగము రాఁగానే తొలుతొలుత మూత్రనాళములో మంట పుట్టును. వ్రేళ్ళుసగము ముడిచికొని గఱుపులవంకఁ జూడుము. అక్కడ వ్రణమై మంటపుట్టినయెడల వ్రేళ్ళుచాఁచిన బాధయెట్లుండునో యూహించుకొనుము. అట్టులే మూత్రనాళములో మంట గుల్లలుపుట్టి

మూత్రమున విసర్జించునపుడు నరములు సాఁగఁగా ఆ మందుచున్న భాగముమీఁద నుప్పని మూత్రము ప్రవహింపఁగా గలిగెడు దుఃఖము మన మూహింపఁజాలము. అప్పుడు వాఁడు పూర్వపు సంభోగసుఖమును నేమిగా స్మరించుకొనునో? ఈ ప్రకారము కురుపులైనప్పుడు సామాన్యముగా కురుపులు మానునపుడు విఱిగిన యెముకలు కట్టుకొనునపుడు ఏ ప్రకారము క్రొత్తకండయు, ఎముకపదార్థములు పెరిఁగివచ్చునో యట్టులే యీ కురుపులచుట్టు క్రొత్తపదార్థము ప్రోగగును. దీనివలన సన్నని మూత్రనాళద్వారము మూసికొనిపోయి మూత్రము వెలికివచ్చు మార్గములేకపోవును. అప్పుడు వానిబాధ యెట్లుండునో యూహించు కొనుము. తరువాత వైద్యులు ఆ యడ్డము తీసివేయుటకు కడ్డీలు అప్పుడప్పుడు నెలలపర్యంత మెక్కించుచుందురు. ఆ యాతన యనుభవించు కాలమున వానికి భార్యకూడ తల్లియే. పండ్లు రాలిపోవునట్లు కొఱుకుకొందురు. గనుక నోటిలో చర్మమో లేక మఱియే మెత్తని పదార్థమో యుంచఁబడును. ముండల రోగముగల ప్రతి మనుష్యాధమునకు మీఁద చెప్పినదంతయు ననివార్యము. దానిని తప్పించుకొనువాఁడు లేఁడు. మూత్రకోశములో రాయి యేర్పడునని చెప్పితినిగదా. ఆ రాయి పుట్టుట కీరోగమే కారణము. ఆ మూత్రకోశ మెచ్చట నున్నదో యా రాయి యననేమో బాలక హితచర్యయందే చెప్పితిని. ఆ కోశమువఱకు కడ్డీలెక్కించినపుడు కలుగు బాధలో మీఁద చెప్పిన బాధ పాతికవంతును గాదు. కొన్ని సందర్భములయందు కడ్డీ లెక్కించుచుండిన మూత్రము వెలువడుచుండును గాని కొన్నిసందర్భములయందు మూత్రము బయటరాదు. అట్టి సందర్భములలో మూత్రకోశమువఱకు కోసి ఆ మూత్రమును మఱియొకమార్గమున వెలుపల గొట్టములమార్గమునఁ దీయవలసియుండును. ఇట్లు చేసినఁగాని మూత్రనాళములోని మంట, పుండు నెమ్మదింపఁజేయుటకు సాధ్యపడదు. మీఁద చెప్పినవన్నియును

ఈ రోగము కలవారికి నిత్యకృత్యములేగాని విశేషకృత్యములుగావు. ఇవి ప్రారంభదశలోనే చికిత్స చేయించుకొనువారి గతులు. ఇంకను రోగము ముదిరి వైద్యశాలల పాలుపడినవారు పడుబాధలు అనిర్వాచ్యములు.

ఆ తరువాత గజ్జలలో గడ్డలు లేచును. వీనినే ఒడిసె గడ్డలందురు. ఇవి పెద్దవైనప్పుడు కోఁతలు కూఁతలు నిత్యకృత్యములగును. మీఁదచెప్పిన బాధపడునపుడు నెత్తురుచ్చపోసికొనుటయుఁ గలదు. ఎంతనెత్తురు దేహమునుండి పోవునో యంత కంత బలహీనత హెచ్చును.

మీఁదచెప్పిన పద్ధతులప్రకారము రోగము కుదరక పోయినపుడు వేఱుమార్గము లేమిచేత వైద్యుఁడు అండములను నశింపఁ జేయును. దీనిని 'అండక్షయ' మందురు. ఈ బాధ యెట్టిదో!!! ప్రారంభదశలోఁ జికిత్స చేసికొనకపోయినను ఈ రోగవిషయము తెలియని యే కువైద్యులచే చికిత్స చేయించుకొనినను ఈ రోగము 'రసిక' అనునదిగాఁ బరిణమించును. దానిఫలము నపుంసకత్వమును, జన్మాంతమువఱకు సహింపఁగూడినంత బాధపడుటయు.

ఈ ప్రకారము జరుగుటలో నెప్పుడైన నీ రోగసంబంధ విషయము కన్నుల కెక్కెనా రెండు కన్నులు పోవుటే పర్యవస్థానము. ఈ కారణముచే చెడిన దృష్టిని చక్కఁజేయు మార్గము వైద్యశాస్త్రములందుఁ జెప్పఁబడలేదు. అనఁగా నసాధ్యము.

ఒకనికి నేత్రబాధ కలుగఁగా నేత్ర చికిత్సయందుఁ సమర్థుఁడైన వైద్యునియొద్దకుఁ బోయి మందిమ్మని యడిగెను. వాఁడు కన్నులు పరీక్షించి నీ కంటిలో నంటురోగ సంబంధమైన విషమున్నది. దానిని బోఁగొట్టుటకు వైద్యులకు సాధ్యపడదనియెను. రోగియును అయ్యా! నేనట్టివాఁడనుగాను. నా యం దట్టి దుర్గుణములేదు. మీరు చక్కఁగ నాలోచించి చూడుఁడనియెను. వైద్యుఁడు తానున్నదున్నట్టు చెప్పితిననియు నీయం

దీవిషము కలియుటకు కొన్ని మార్గములు కలవనియు వానిలో వేనికైనc బాలుపడితివేమో యాలోచింపుమని చెప్పెను. వాcడు మరలి యింటికిcబోయి బాగుగ నాలోచించి వైద్యుని యింటికివచ్చి యిట్లు చెప్పెను. అయ్యా! నేను మీ యింటికి చికిత్సకు వచ్చుటకు కొంచెము ముందు దేశాంతరము పోయియుండి వచ్చిన నా కొడుకు స్నానము చేయcగా మిగిలిన నీళ్ళతో వాcడు ముఖము తుడుచుకొనిన తుండుగుడ్డతో ముఖము తుడుచుకొంటినని చెప్పెను. ఈ రోగముకల మఱియొకcడు స్నానము చేసిపోయినతరువాత ఆ నీళ్ళను పాఱపోసియును, ఆ పాత్రములోనే వేఱునీళ్ళు తోడుకొని స్నానముచేసిన యతని భార్యలకు బిడ్డలకుc గూడ నీ విషము సంక్రమించెను.

భర్తవలన నీ రోగము భార్యకువచ్చి యది గర్భిణియై ప్రసవించుటకుముందు నెమ్మదిపడకపోయెనా గర్భములోని శిశువు వెలుపలికి వచ్చునపుడు దానికన్నులు తల్లిచర్మమునకు రాచుకొనుటచే ఆ పిల్లకన్నుల కవరోధము వచ్చును. కావుననే మంత్రసానులు తొలుత కన్నులు పరీక్షింతురు. ఇట్టి విషసంపర్క ముండిన వెంటనే దానిని దీసివేయవలయును. చర్మములో దిగెనా కన్నులుపోవుట నిశ్చయము.

ఈ యంటురోగము చాల మొండిరోగము. నెమ్మదించినట్లు కనcబడును గాని నిశ్శేషముగాదు. ఈ రోగముచే బాధపడి నిశ్శేషముగ రోగము నెమ్మదించిన దనుకొనిన తరువాత 10 ఏండ్లకు కొందఱు తమనూతన వధువులతో సంభోగింపcగా నంతకుముందెంతో యారోగ్యము ముఖవికాసము గలిగియుండిన యా కన్యకలు రెండుమూcడు వారముల లోపలనే యీ రోగము తగులుకొని దుఃఖింప మొదలుపెట్టిరి. స్త్రీలయం దొక్కసారి యీరోగము ప్రవేశించెనా యది శాశ్వతముగ నిలుచును. కొందఱు పురుషులు తమ భార్యల కష్టదశకుc దాము కారణమగుట యోజింపలేక వారిని దూషింతురు. అనాదరింతురు.

తమ దోషమునఁ గాకున్న వారెంత సౌందర్యము సుఖము కలిగి యుందురో యా నిర్భాగ్యులాలోచింపలేరు. ముగ్ధలగుటను తెలియక భర్తలుగదా యని ప్రేమతోఁ దమతోఁ గలిసిన చిన్నపిల్లల నిట్టి దురవస్థలపాలు చేయుటగాక పై పెచ్చు నాభార్యకెప్పటికి రోగమేయని విసుఁగుకొనువా రెట్టి పాపాత్ములో యాలోచింపుము.

**కం. "హీనుఁబొంది యోని హింసింపఁగా నేల**
**యువతిజనుల కూరకుంట లెస్స"**

యని భాగవతములోఁ జెప్పినట్టు లిట్టినిర్భాగ్యులను పెండ్లియాడుటకంటె స్త్రీలు సన్న్యాసినులై యుండుట చాలసుఖము. ఈ రోగము క్రొత్తలో 3 మొదలు 6 వారముల లోపల వాసి కావచ్చును గాని కొన్ని సంవత్సరము మొదలు 4 సంవత్సరములకుఁ గాని నెమ్మదింపదు. కొన్నిటి కెంతచికిత్స చేసినను వ్యర్థము.

ఈ రోగము మర్మాంగములందు వ్యాపించుట మాత్రముచే సంతుష్టిపడదు, మూత్రమండలము, కాలేయకము, ఇది యది యననేల మెదడువఱకు వ్యాపించును. ఇది స్త్రీ మూత్రద్వారమునఁ బ్రవేశించెనా గర్భము అండకములు కూడ చెడి కొన్ని సందర్భముల మరణముతోఁ బర్యవసించును. నెమ్మదించునని మీఁద చెప్పినంతమాత్రమున నిశ్శేషముగ రోగము నిర్మూలమగునని భావముకాదు. ఇది ఘటాంతముతోనే నిశ్శేషము కావలయును. ఈ సంకటములన్నియు నెట్లు వచ్చెనో యాలోచింపుము. నిమిషసుఖము గోరిగదా! ఆ నిమిషసుఖము వలన ద్రవ్యనష్టము. ద్రవ్యమునకంటెను విలువగల యారోగ్యనష్టము. అంతకంటెను మించిన మానహాని. ఈ లోకమున భ్రష్టత. ఆ లోకమున నరకయాతన. వీనిని దలంచువాఁ డెవఁ డిట్టి తెలివిమాలిన పనిచేయును? మీఁదఁ జెప్పిన దానికంటెను దీవ్రమైనది 'ప్రమేహ'మందురు. అది దేహముమీఁదఁ గురువులు వ్రవణములుగాను కనఁబడును. నరములలో పోట్లు మంటలు

పుట్టును. నాలుక మీఁదను పెదవులకు లోపలిభాగమునను గురుపులు లేచును. కంఠవ్రణము లేచును. జీర్ణకోశము పైత్యరసకోశము చెడును. వెండ్రుకలు రాలిపోవును. ముదిరి ముదిరి తుదకు మెదడు చెడి మూర్ఛ ఉన్మాదము లోనగు రోగములుగఁ బరిణమించును. ఇది రెండవరకము. ఇదియొకటి మొదలు మూఁడు సంవత్సరములలో నీ గుణములు చూపును. దీనికి మించిన మూఁడవ తరగతి రోగము దేహముతోఁ బోవలసినదే.

ఈ తరగతిరోగము శల్యముల బాధించును. కీళ్ళనొప్పులవంటి నొప్పులు కీళ్ళయందుఁగాని కీళ్ళనడుము అనఁగా మోఁకాటికి మడిమలకు నడుమఁగాని తలయందుఁగాని పుట్టును. ఈ బాధ రాత్రులందు హెచ్చును. నిద్రపట్టక యీ రోగి రాత్రులందు లేచి తిరుగఁగోరును. ఎముకలు పెళు సగును. ముక్కు తినిపోవును. కొంచెము గాసితగిలినను ఎముకలు విఱుగును. మరల నవి కట్టుకొనవు. పుఱ్ఱె తినిపోయిన వారును గలరు.

ఈ రోగముగల యొకఁడు గొప్ప వైద్యునింటికిఁ బోయెను. అప్పుడా వైద్యుఁడు దేహముమీఁది మచ్చలకురుపుల గుఱించి యతనికిఁ జెప్పెను. అంతయు విని యట్లైన నేను జచ్చుటే మేలుకదా యని రోగియనెను. వైద్యుఁడు అయ్యా! లోకసుఖమునకై నీమాత్రమునకు నీవు చచ్చినట్టుండుటే చాలశుభము అని చెప్పెను.

ఈ వ్రణములు ముక్కు, నోరు, కంఠము, నాలుక వీని యందును గోళ్ళచుట్టును. తొడల మీఁది భాగమందును మర్మాంగము లందును లేచును. ఇది చాలఁ జెడ్డ యంటువ్యాధి. ఈ విషమారోగితాఁకిన ప్రతిపదార్థమున నంటుకొనును. వాఁడు త్రాగిన చెంబులు లోటాలు వాఁడు కట్టుకొనిన గుడ్డలు, వాఁడు తాఁకిన పాత్రములు, గుడ్డలు, ఇన్నిటియందు నీవిషము తగిలియుండును. వీనిని వేఱొకఁ డుపయోగించెనా యీ విషము వానియందుఁజేరి వానిని బాధపెట్టును.

ఈ కారణము చేతనేకదా పరులు కట్టివిడిచిన గుడ్డకట్టరాదు. ఒకరు మూత్రము విడిచినచోట మఱియొకరు మూత్రము విడువరాదని పెద్దలు చెప్పుదురు.

అంటురోగములలోనెల్ల ముండల రోగము లతితీక్ష్ణములు క్రూరము లని ముందు చెప్పిన విషయముల వలన నెఱుంగవచ్చును. అంటురోగమనఁగా గజ్జిరోగము వంటిది. గజ్జికురుపులోని చీమెక్కడ తాఁకునో యక్కడనెల్ల కురుపులు లేచును. చర్మమునకుఁ జర్మ మంటుటవలన వచ్చునవి కావున వీనికి నంటురోగములని పేరు. ఈ వ్యాధిగల యొకనికి దేహముమీఁది కురుపులు మానిపోవుటచే నంటుటచే నీ రోగము భార్యకు కలుగకపోయినను మఱికొన్ని మార్గములనిది వచ్చును. ఈ వ్యాధిగలవారి కందఱకు రేతస్సున నీ రోగశేషముండును. అట్టి రేతస్సు వలనఁ గలిగెడి బిడ్డఁ డారోగము కలవాఁడై యుండుననుట నిస్సందేహము. ఈ బిడ్డ చర్మమున నుండఁగనే తల్లి కీ వ్యాధిని గలిగించును. ఏలనఁగా యీ విషము కురుపులందుమాత్రమే యుండునదికాదు. నెత్తుటియందు నుండును. ఆ కారణముచే గర్భములోని శిశువువ్యాధి తల్లికిని వచ్చును. ఈ రోగము కలవానినెత్తురు కొంచెము తీసి రోగము లేనివానికి టీకాపొడిచిన యీ రోగము వానికిని వచ్చును. ఈ వ్యాధి పురుషుని రేతస్సులోని సన్న జీవజంతువులకు వ్యాపించి వానిని దుర్బలము చేయుటచే నా రేతస్సు వలన గర్భిణియైన స్త్రీగర్భమునందు పిండమునిలుచు శక్తిలేక జాఱి పడిపోవుటయుఁ గలదు. ఈ భార్యల గర్భస్రావమున కిదియొక కారణము. ఒకవేళఁ బుట్టినను సత్తువలేక జీవచ్ఛవములుగ నుండు బిడ్డలు పుట్టుదురు. వీరికి గండమాలరోగమును కలుగును. ఎవరియం దీ గండమాల కానఁబడునో యా రోగి నిర్దోషియైనను వాని తండ్రి తాత ముత్తాతల దీ యంటురోగ ముండె ననుటయు నిది పిత్రార్జితమనుటయు సత్యము. విషశేషముతోఁ బుట్టిన బిడ్డలవలనఁ బెక్కు లనర్థకములు

గలుగుచున్నవి. ఆ బిడ్డకు చనుఁబాలిచ్చు దాదికిని ఆ బిడ్డను ముద్దపెట్టుకొనువారి కందఱకును ఆ బిడ్డనెత్తుకొని తిరుగువారికిఁగూడ నీ రోగము కొంచెముగనో గొప్పగనో సంక్రమించుట కలదు. ఇట్టిబిడ్డకుఁ దల్లిగాని యిట్టి యంటు రోగము గల దాదిగాని తప్ప మఱెవ్వరు చనుఁబాలియ్యరాదు. ఇద్దఱయందు సమానవిషములే గనుక నొకరి విషము మఱియొకరిని బాధింపఁజాలదు. ఈ ఆరోగ్యసంబంధమైన కురుపులు గలవారి చేతులు పట్టుకొనుటయుఁ గారాదు.

నాయనా! యీ విషయము వ్రాయవలయు ననిన నాకు వాస్తవముగఁ దలనొప్పి పుట్టుచున్నది. నీకుఁ జదువుటకెంత కష్టముగ నున్నదో నాకు వ్రాయుట కంతకంటె కష్టముగ నున్నది విధిలేదు. ఏమిచేయుదును? ఈ విషయము తెలియక చెడినవా రనేకులుగలరు. అట్టులు నీవే వయస్సున నైనఁ జెడకుండుటకును అట్టివారి సహవాస సహాసనములోనైనవి మానుకొని సుఖపడుదువని యింతమాత్రమైన వ్రాసితిని. కండ కావరముచే సంపాదించుకొనిన యీ రోగములచే బాధపడువారినిగూర్చి యయ్యో పాపమనువాఁ డుండఁడు. మానముగల వైద్యులు చికిత్సయుఁ జేయరు. ఎందును గతులు మాలిన మంగలవాండ్రు, కుమ్మరవాండ్రు వైద్యులు దొరకుదురు. వారెంత జ్ఞానవంతులో యెంత శాస్త్రజ్ఞులో యాలోచింపుము. అటుగాకున్న వైద్యశాలలపాలు కావలయును. అక్కడఁ గూలికిఁ జేయువారేకాని యెవరికేమి దయాదాక్షిణ్యములు గలవు? నాయనా! నేను క్షయవ్యాధిచేఁ బీడింపఁబడినపుడు విచారించు దిక్కు లేనివాఁడనగుటచే నా మిత్రులు నన్ను 'జనరల్ హాస్పత్రిలో' వైచిరి. అప్పుడు నాకు స్మృతియే లేదు. ఆ వైద్యశాలలో ఆ బంట్రౌతుల చేతిలోను, మందు లిచ్చువారిచేతిలోను నేను పడినకష్టము లీ జన్మమున మఱవను. వాసుదేవరావుగారి పుణ్యవశమున నేను వెలికి రాఁగలిగితిని. లేకుండిన నా గతి యేమయి యుండునో? కావలసినంత ధనము వెచ్చించువారికి సుఖము. అంతకంటె

నికృష్టదశలో జీవించు భిక్షగానికి సుఖమెగాని నడిమిరకమువారికి వైద్యశాల యమలోకమే. అటుగాక చికిత్సకుండైనను దయావంతుఁడుగా నుండవలయును. అట్టివారందఱు దుర్లభులు. మూఁడవవిధమున రేతస్ఖలనము చేయుటచేఁ గలుగు ననర్థకములు చెప్పితిని. ఈ విషయమున నీవెంత పవిత్రుఁడవుగా నుందువో యంతసుఖ ముభయలోకములందును బడయుదువు. ఈ విధముగ రేతస్ఖలనము చేయు పురుషులతోఁగాని వారి కీవిధముగ సంబంధించిన స్త్రీలతోఁగాని యీ రోగములు కలవారితోఁగాని నీవు స్నేహముచేయరాదు. తల్లితోడువంటి బంధువులై విధిలేక కలసి మెలసి యుండవలసి వచ్చినయెడల నీవెంత జాగ్రత్తగ నుండిన నంతమేలు. ఈ రోగము స్త్రీలవలనఁ బురుషులకుఁ బురుషులవలన స్త్రీలకు వచ్చుట కలదుగాని సమర్తాడిన తరువాత చాలఁగాలము పుట్టినింట నుంచిన వధువులమాట విడిచిన తక్కిన నూతన వధువులవలన నీరోగము వచ్చుటకు నిప్పటి మన యాచార పద్ధతులఁబట్టి సాధ్యపడదు. రజస్వలా వివాహములు ముదిరినతరువాత నిప్పుడు దుష్టపురుషులవలన బాలికలకు వచ్చునట్లు వధువులవలన వరుల కీరోగము వచ్చిన వింతపడ పనిలేదు.

నాయనా! యిదివఱకు నేను జెప్పినదాని సారాంశము చెప్పెదను. వాస్తవముగ నీవు బాగుపడఁ గోరికకలిగినయెడల నిఁకఁ జెప్పువానినలక్ష్యము చేయకుము. ముందు చెప్పినదాని నెల్ల శ్రద్ధగా మనస్సున కెక్కఁ జదివియుంటివా వీనికిఁ గారణములు నీవే యూహించుకొనఁగలవు. ఇదివఱకుఁ గారణములు చెప్పని వానికిఁ గారణములును జెప్పెదను. తొలుత నిషేధములు చెప్పెదను. బాల్యము లేఁతమొలక. కౌమారము కొంచెమెదిగిన మొక్క. ఇఁక నీకు రాఁబోవునది మ్రాఁకు దశ. మొలకలో వంగకుండిన చెట్టు మ్రాఁకైన వంగదు. ఇప్పటి యభ్యాసములే స్థిరపడిపోవును. కావున జాగ్రత్త.

## మంచి గుణములు

1. ఎవరు నీ యంతఃకరణశుద్ధిని, దైవభక్తిని, పితృభక్తిని చెఱుపఁ జూతురో వారి స్నేహము మానుము.

2. ఎవరు నీ మంచిపేరును చెఱుతురో, నీ నడవడిని వంకరత్రోవకుఁ ద్రిప్పఁజూతురో, నీ పదార్థములను వ్యర్థపఱుతురో, నీ యారోగ్యము నిర్మూలింపఁ జూతురో, నీ జీవితోద్దేశమును కొనసాగించుకొననీయ కుందురో, మోక్షమా? చింతకాయలా? భూమిమీఁదఁ బుట్టినది భోగమునకే యందురో, వారి స్నేహము మానుము.

3. త్రాగుఁబోతును, అంకుఁబోతును, భ్రష్టుని, దురాచారుని, యనాచారుని, చోరుని, దూరమునంద యుంచుము.

4. మనస్సును దేహమును ఆరోగ్యముగ నుంచుకొనుటకుఁ గాక కాలమును, ధనమును, వయస్సును, బుద్ధిని నెవరు దుర్వినియోగ పఱుతురో వారు దుష్టులని తలంచి వారి స్నేహము చేయకుము.

5. రాత్రులందుఁ దిరుగఁ బోకుము. ఇంటనే పరుండుము. ఒకవేళఁ బోయినను పగటిపూఁట నేస్థలమున నిన్నితరులు చూచిన నీ కవమానమని తలంతురో యట్టిచోట్లకు నీవు రాత్రులందు బోనేవలదు.

6. సాయంకాలములను, మునుమాపులను, గృహకృత్యములందు, పూజాది దేవకార్యములందు, సద్గ్రంథములఁ బఠించుటందు, సజ్జనులతో సంభాషించుటయందుఁ గడపుము.

7. రాత్రి 10 గంటలకుమీఁద మేలుకొనకుము.

8. చెడుపుస్తకములు, ఆయుర్వ్యయముచేయు పుస్తకములు, శృంగార ప్రధానములగు పుస్తకములు చదువకుము. శృంగార విషయకములైన మంచిపుస్తకములు సత్కవిరచితములు నిషేకముహూర్తమైనపిమ్మటఁ జదువుము. ఈ వయస్సునఁ జదువవలదు. శృంగారవిషయము నీకు

తలకెక్కెనా యది దుష్టస్త్రీ సహవాసమునకుఁ గారణమగును. అంతకుఁ బోకపోయిన రేతస్ఖలమునకును, స్త్రీవిషయ చింతలకును నాకరమగును. ఇది విద్యకు సద్విషయచింతకు హానికరము.

9. మన నీతిమతాచారములను శాస్త్రవిషయములను బోధించువానినిదప్ప నేభాషయందైనను నవల లనఁబడు పుస్తకములను జదువకుము. వేడుకకైనను పాపకార్యములను గొనియాడు పుస్తకముల నంటకుము.

10. దిసమొల చిత్రపటములపై దృష్టిపోనీయకుము. ఇవి యొకసారి మనస్సున నాటెనా తరువాతఁ దొలఁగించుట మిక్కిలి దుష్కరము. తక్కిన విషయముల నీ వెంత పవిత్రుఁడవైనను ఈ పాడుపటములు ఎన్నియేండ్లకైనను మఱచిపోఁజాలవు. ఇట్టి వికారపటములు నీ యొద్ద నుండుటగాని నీవు పెట్టెలోనుంచుటగాని పెద్దవారు చూచిరా నీయందలి వారి గౌరవ మానాఁటితో సమసినదని యెంచుము. ఏలనఁగా వానియందాసక్తి లేకున్న వానిని నీవు గ్రహింపవు. అట్టివానియందాసక్తి దుర్బుద్ధికి లక్షణము. కావున వారు నీ మనస్సు అపవిత్రమైనదని నిశ్చయింతురు. వానియందాసక్తి గలవాఁడ వైనచో నేనాడైన నెచ్చటనైనఁ జేయరాని కార్యమును జేయుదువు. చెడుదువు.

11. ప్రాణములేని పటములే నీ యింద్రియముల వశపఱచుకొను శక్తిగలవైయుండనట్టి స్త్రీల నేయాసక్తిని జూచిన నేమగుదువు? ఏళ్ళయందును గుంటలయందును సిగ్గువిడిచిన స్త్రీలు స్నానము చేయునపుడు మీఁది పటములలో నున్నట్టులించుమించు దిసమొలలతోనే గోచరింతురు. అట్టి సమయములందు వారి నాసక్తితోఁ జూడక దృష్టి మరలించుకొనుము. వారు చెడుకార్యము చేసిన నీవును జేయవలయునని సిద్ధాంతము లేదు. ఎవరెవరి కార్యముల ఫలములు వారు వారే యనుభవింతురు.

12. నీవు నాటకము లాడుట చూడఁబోకుము. ఒక వేళఁ బోవలసివచ్చిన పుణ్య స్త్రీ పురుష చరిత్రముల నాడునపుడు పొమ్ము. అవియైనను గ్రంథకర్తలును ఆడునట్టివారును, పవిత్రచరిత్రులైననే పొమ్ము. లేకుండినఁ బోవలదు. ఒకనాఁడు ప్రసిద్ధవర్తకులు కొందఱు సారంగధరనాటకము చూడరమ్మని బలాత్కరించినచో పోయితిని. ఆ నర్తకులు కొన్ని వాక్యములు నుచ్చరించినపుడు నేనేల తెలివిమాలి యిచ్చటికి వచ్చితినని పరితపించితిరి. అదిమొద లెవ్వరు పిలిచినను ఏ నాటక ప్రదర్శనమునకుఁ బోవుట చాలించితిని. అవి వ్రాసిన వారెట్టివారో ఆ వాక్యములు నిండుసభలో నోరువిచ్చి చెప్పునట్టివారు ఎంతటివారో వానిని విని యామోదించు స్త్రీ లెట్టివారో భగవంతునకే యెఱుక. అట్టివి వినుటకే కొందఱు వచ్చుటయు అట్టివారి నిమిత్తమై యట్టివి నర్తకులు ప్రలాపించుటయుఁ గలదు. అట్టిచోట్ల నట్టిస్వభావము లేనివారు పోఁబని లేదు. తెలియనితనముచే నొకసారి పోయినను మానము లజ్జ గలవారు మరలఁబోరు.

తుచ్ఛనాటకములోని బూతులను శృంగారరసమని తెలివిలేనివారు చెప్పుదురు. వారిమాట నమ్మకుము. ఇది శృంగారరసముగాదు. సుఖసంకటములఁ గాఱు గబ్బురసము. గొప్పవారు వ్రాసినను ఇట్టివి నీవు చదువరాదు. బండుబూతులు శృంగారమని నీచులందురు. నేను నిషేధించిన విట్టివియుఁ గామోద్రేకము కలిగించునవియుఁ గాని తదితరములు గావు. రామాయణాది కావ్యములందును కాళిదాస భవభూత్యాది మహాకవి కృతగ్రంథములందును నుండు శృంగారము దోషావహమైనదికాదు. అట్టి వెన్నిమార్లైనఁ జదువుము.

13. గొప్పవారని పేరుపొందినవారి నాటకములకే పోవలదనినవాఁడను ఇఁక బోగమువారాడు నాటకములకు బొమ్మందునా? దీనివలనఁ గలుగు ననర్థకములు స్పష్టములు. నాటకములకుఁ

బోవుటవలన ధననష్టము, నిద్రానష్టము, ఆరోగ్యనష్టము. పగటి యితరకార్యములకు హాని, క్రొత్తగ నేర్చుకొనునది మేలైనది సున్న. నీచులతోడఁ గూర్చుండుట కేవలము సహింపరానిబాధ. నాటకశాలలందు గౌరవము వెల ఒక రూపాయ తప్పిన రెండు రూపాయలు. ఆ వెల యిచ్చినవారందఱు సమానగౌరవమున కర్హులే. అంతైన మేలే. సజ్జనులకంటె టాకుటీకుగల నీచగుణులే యెక్కువ పూజ్యులు. స్త్రీలదృష్టికి వారే పలుమాఱు గోచరింతురు. వేషధారులును స్త్రీలవంకనే తిరిగి యాడుదురు. కావున సమానప్రతిపత్తిగలవారికి కవి దర్శింప నానందింప నర్హములుగాని నీకుఁగావు.

14. చెడునడతగల స్త్రీపురుషులు చెప్పు హరికథలకుఁ గాలక్షేపములకుఁ బోవలదు. పాలు పవిత్రమైనను పుఱ్ఱెలోని పాలు త్రాగుదువా? వీరి హరికథలు మృగములు నాకర్షింప వేఁటకాఁడు చేయు ధ్వనివంటిది.

15. చీట్లాట యూరకయైన నాడకుము. పందెముపెట్టి యేయాటయు నాడకుము. పందెముపెట్టి యాడునవి యన్నియు జూదములే. అవి యెన్ని కొంపలో కూల్చియున్నవి. ఇట్టి మాటలందు నీకు స్నేహితులు సద్గుణము కలవారు దొరకరు. దుష్టసహవాసము క్షణమాత్రమూన సర్వదా సర్వథా వర్జ్యము. ఎప్పుడో యొకప్పుడు వినోదమున కేల యాడరాదని తలఁపకుము. తొలుత నెలదినముల కొకసారియైనఁ బదవడి 15 దినములకే తరువాత వారమునకే తరువాతఁ గొంచెమవకాశము దొరికినప్పు డంతయు తొలుత వినోదము తరువాత దమ్మిడీ దమ్మిడీ పందెము, తరువాత కాలణా, ముదురు కొలఁది రూపాయ రూపాయ. ఈ విధముగ నాడి భ్రష్టైన వాఁడు మనలోనే కలఁడు కదా. ఏ చెడు కార్యమైనను దొలుత వినోదముతోఁ బ్రారంభించి విషాదముతో నంతమగును. ఒకఁడు చీట్లాడుచుండఁగా నింటినుండి యోరీ! నీ తండ్రికి

ప్రాణాపాయదశ వచ్చినది రా రమ్మని యొకఁడు పిలువవచ్చెను. పోవునట్టి ప్రాణము నేను వచ్చి నిలుపఁగలనా? చేతిలోని యాట ముగియఁగానే వచ్చెదనని వాఁడు చెప్పెను. ఇంతలో మఱియొకఁడు వచ్చి యోరీ! నీ తండ్రి చచ్చెనని చెప్పెను. చావనే చచ్చెనా? ఇఁక నేనువచ్చి యేమిప్రయోజనమని యాటకాఁడు చెప్పెను. నీవు వచ్చికదా పీనుఁగును కట్టవలయును. వాహకులకు డబ్బుకావలదా యనెను. డబ్బేమియులేదు. ఈసారి బేస్తు మేజువచ్చిన నిచ్చెదను. నా భార్యమీఁది నగ కుదువ యుంచి పదిరూపాయలు తెచ్చి వాహకుల నేర్పాటు చేయుఁడు. వారే వచ్చి కట్టుదురు. అదెట్లు కట్టవలయునో నాకేమి యనుభవమని వాఁడు చెప్పి వారలఁ బంపెను. వారుపోయి యట్టులే చేసి కట్టియైనది యింక నీవు వచ్చిన నెత్తికొని పోవలసినదే కొఱంతయని మరలివచ్చి చెప్పిరి. పీనుఁగు నెత్తుకొని వాహకుల నీ త్రోవనే రమ్మనుఁడు. నేను వచ్చెనని వాఁడు చెప్పెను. వారట్లే యెత్తించుకొనివచ్చి వాకిట నిలిచి రారమ్మని పిలిచిరి. మీరు భారమెత్తుకొనినవారు మెల్లగ నడతురు. మీరు బోవుచుండిన నిదో వచ్చి కలసికొనెదనని యాటకాఁడు చెప్పెను. వినోదమునకై పూనినది యెంతకుఁ బరిణమించినదో చూడుము. ఈ యాటలవలన నేర్చుకొనునది, దొంగతనము, మోసము, అబద్ధముచెప్పుట, కలహించుట, తిట్టుకొనుట. ఇవి మంచిగుణములని తోఁచిన చీట్లాడుము. వినోదమున కాడినను ఈ గుణములు పట్టుపడును. లంజెఱికము, త్రాగుట, దొంగతనము, వినోదమునకని ప్రారంభించిన రోదనమున ముగియును.

16. మందుగానైనను సారాయము త్రాగకుము. స్త్రీలు, సారాయము తియ్యని విషములు. సారాయము గుఱించి నీకు విశేషము చెప్పఁదలఁపలేదు. అనావశ్యకము. అయినను సారాయము త్రాగువాఁడు మాంసభక్షకుఁడు గాను, జారుఁడుగా నుండకపోవుట వింత. మనలోనే యెందఱు త్రాగుఁబోతులై గొప్ప గొప్ప కుటుంబముల నేలపాలు చేసిరో

యెఱుఁగవా? ఈ యొక్క దుర్గుణము వారియందు లేకుండిన వారు వారివంశమునకు జాతికిని నెంతో కీర్తి తెచ్చి యుండఁగల బుద్ధిమంతులు సమర్థులు. మనజాతి క్షీణించుట కిట్టివారే కారణభూతులని నమ్ముము. భోజరాజొకనాఁడు కాళిదాసునకు భ్రష్టస్యకాగతిర్వాః అనఁగా భ్రష్టునిగతియేమి యను సమస్యనిచ్చెను. కాళిదాసుడు నాకుఁ గొంతకాలము తడవిచ్చినఁ బూర్తిచేసెదనని చెప్పెను. రాజట్లే కానిమ్మనెను. ఒకనాఁడు రాజు ఊరుచూచుటకై కొంత పరిజనముతో బయలుదేఱి పోవుచుండఁగా నొకవీథిలోఁ బోవుటకు మార్గములేనట్టు గుంపరికట్టియుండెను. ఏమదియని విచారింపఁగా నాత్రోవప్రక్కన నొక కటికవాని యంగడిలో సన్న్యాసి యొకఁడు మాంసమునకై కొట్లాడుచుండెను. అదిచూచి రాజు సన్న్యాసియేమి! నడివీథిలో నిలుచుండి మాంసమునకుఁగాఁ గలహించుట యేమి! వింతగా నున్నదని తలఁచి సన్న్యాసిని బిలిచి సన్న్యాసీ! నీవు మాంసము తినవచ్చునా? యని యడిగెను.

**సన్న్యాసి** సారాయము లేకపోయిన మాంసమేమి చేయను! అది జీర్ణమెట్లగును?

**రాజు** సారాయముకూడ నీకుఁ బ్రియమా?

**సన్న్యాసి** బోగము పడుచులతోఁ గూడి త్రాగిన నెక్కువ ప్రియము.

**రాజు** రొక్కము లియ్యక బోగముపడుచులు రారుగదా? ధనమున కేమిచేసెదవు?

**సన్న్యాసి** జూదమాడెదను. దొంగతనము చేసెదను.

**రాజు** జూదము దొంగతనముకూడ నభ్యసించితివా?

**సన్న్యాసి** అటు చేయకుండిన భ్రష్టునిగతి యేమి?

అనఁగానే రాజు తాను కాళిదాసున కిచ్చిన సమస్య స్మరించి యతఁడే కాళిదాసుని గుర్తించి యేమి యిట్లు చేసితివనెను? నీ ప్రశ్నకుఁ దగినట్టు

లుత్తరము చెప్పకుండిన నీవు నమ్మవని యిట్లు చేసితివని రాజుతోడఁ బోయెను.

కాళిదాసుఁడు చెప్పినవానిలో నేగుణముండినను దక్కిన యన్నిగుణములు తప్పక పట్టుపడును.

నెత్తురు జలమయమయిన ద్రవముగదా! సారాయి త్రాగువాని నెత్తురు కొంచెముతీసి నిప్పుపుల్లగీచి యంటించిన సారాయము ముగియువఱకు మండి తరువాత చల్లాఱును. సారాయము త్రాగినవాని నెత్తురు మండును. దీనివలన సారాయమన నెట్టిదో కనుఁగొనుము. చండాలుఁడు చేయని ఘోరకార్యములు త్రాగుఁబోతులు చేయుదురు. పొగాకును గుఱించి సిల్వానస్ స్టాల్ అను ప్రసిద్ధపురుషుఁడు వ్రాసినదానికిఁ దెనుఁగు వ్రాసెదను.

ప్రామాణికులైన వైద్యులందఱును 'పరిపూర్ణ దేహపటుత్వము రాని దేహమునకు పొగాకు మిక్కిలి కీడుకలుగఁజేయును. దేహము పూర్ణముగఁ బెరుఁగనివానియెడ పొగాకు దేహమును గిటకపాఱునట్లు చేయును. కండరములను కుఱుచలుచేసి బలహీనములుగను సడలి వణఁకునవిగను జేయును. ఎక్కువగ నుపయోగించిన దృష్టిపాటవమును మిక్కిలి తగ్గించును'. అని వ్రాసియున్నారు. నేత్రచికిత్సయందు సమర్థులయిన వైద్యులు రోగి కంటిగ్రుడ్డుమీఁద వెలుతురు పడునట్లు చేసి వాఁడు పొగాకు నుపయోగించువాఁ డవునా కాదా యని వెంటనే తెలిసికొందురు. పొగాకు శ్రవణపటుత్వమును తగ్గించును. గుండెను బలహీనపఱిచి యదరునట్లు చేయును. క్రమముగా మిక్కుటముగ నుపయోగించెనేని 'పొగాకుగుండె' యనునది కలుగును. పొగాకు నమలువాఁడును పొగ పీల్చువాఁడును నరములపటుత్వము సడలినవాఁడై దిటము లేనివాఁడుగను నగును. శస్త్రచికిత్సచేయు వైద్యులు పొగాకు నుపయోగించువారు పురుషగుణమైన ధైర్యము, స్థైర్యము లేనివారై కష్టమైన చికిత్సయందు పిఱుకులగుదురని

చెప్పుచున్నారు. పొగాకు దంతకాంతిని వివర్ణము చేయును. శ్వాసము హానికరమైనదిగఁ జేయును.

అదరుగుండె రోగమును కలిగించును. ఉమ్మినీరు కలిగించు గ్రంథుల నుద్రేకింపఁజేయును. అజీర్ణవ్యాధి కలిగించును. ఉత్సాహము తగ్గించును. మొగము వెల్లఁబాఱునట్లు చేయును. తలదిమ్ము మఱపుకలిగించును. కాలేయకమును వ్యాధిగ్రస్తముగఁ జేయును. నెత్తురు ముఖమునకుఁ బ్రవహించునట్లు చేయును. నోటిలో వ్రణము కలిగించు శక్తి పొగాకునకుండుట సర్వవిదితమే. ఈ గుణములన్నియుఁ బ్రసిద్ధులైన జనరల్ గ్రాఁటు మొదలైనవారియందుఁ గానవచ్చినవి.

"Medical authorities are, however, agreed that the effects of tobacco upon one who has not attained his full bodily maturity is injurious in the extreme. To one who has not attained his entire growth, the use of tobacco stunt's the body and dwarfs the muscles, making them falbby and weak. When used in excess, tobacco greatly affects the vision. Physicians who make the treatment of the eye a speciality tell us that when they use the magnifying bus, and throw in the light upon the retina of the eye. they can tell immediately when one is addicted to the excessive use of tobacco. It also deadens the hearing, greatly affects the heart, producing palpitation, and when used regularly, in large quantities, results iu producing what is called "tobacco heart" The results of either smoking or chewing can often be noticed in its effects upon the nerves, rendering the person both nervous and irritable. Even to small provocations surgeons tell us that their experience in the operating - room has developed the fact that men who are addicted to the use of tobacco quite generally suffer a lack of manly fortitude. and are noticeably cowardly under the severe trail of surgical

operation. Tobacco discolours the teeth, makes the breath offensive, excites the glands which secrete the saliva, and tends to produce dyspepsia; low spirits a pale face, and an emaciated form. It also tends to produce dizziness, rush of blood to the head, palpitation of the heart, loss of memory and a diseased condition of the liver. Its tendency to produce cancer of the month is generally known and such result have been noted in the death of prominent persons, such as General Grant and many others. Though many bad effects are easily traceable to the use of tobacco, its use is also a source of considerable expense; and even smoking renders the habits of some persons very disagreeable. The custom of smoking cigarettes. and inhaling the smoke into the lungs, and the blowing it out through the nostrils is especially injurious, and speedy results are sometimes visited upon its unhappy victims.

Smoking does not always terminate in intemperance, but an account of the dry and parched condition of the mucous membrane which smoking produces, its tendency is to intemperance, to connivial companionships, and the young man who does not use tobacco in any form surely abids in greater security" - Stall.

"I am of opinion that a man who uses tobacco is not fit to be husband or father. He has no right to make himself indecent and disgusting in the presence of his wife, and he has no right to curse his offspring with the legacy of a depraved organization." - Ttall.

Every woman who marries a man who is addicted to the use of intoxicating drink ever so moderately, runs the risk of eventually finding herself yoked to a drunkard instead of married to a man. But there is a worse and more prevalent

habit among the young men than liquor drinking. I mean tobacco - using. To say nothing of the filthiness and indecency of the habit it is undermining the constitutions and exhausting the vitality of the young of our country at a fearful and a rapidly increasing rate. Because it does occasion acts of violence, assaults, murders, & etc, its injurious consequences are generally supposed to be less than those of alcohol. But while alcohol excites the muscular system, tobacco torpifies the brain and nervous system, depresses all the vital energies, paralyses the organic instincts, and lowers the tone of the whole moral nature. The breath of the tobacco user is always nauseous; all the exhalations from his body are pestilential. No woman can sleep in the same room with him, much less in the same bed, without being poisoned with emanations from his breath and skin and no child can be born into him without a more or less depraved organisations."

17. ఈ వయస్సున తాంబూలము, గంధము, పూలు మొదలగు భోగ్యవస్తువులు మానుము. నాయనా! మీఁద వ్రాసిన దానినిబట్టి పొగాకు ఎంతటి విషపత్రమో తెలిసెను గదా. వాస్తవ మిట్లుండఁ గొందఱు పెద్దవారు పిల్లవాండ్రకుఁ జుట్టలు త్రాగుటకు నేర్పుటయు, దానిపొడి తలలోకి నెక్కించుటకు నేర్పుటయుఁజూడ విచారమగుచున్నది. పొగ చుట్టలవలననే యంతటి కీడుండిన నింక బీడీలయం దెంత విషముండవలయునో యూహింపుము. బాలురు వీని నుపయోగింపఁజూచి సహించు పెద్దవారెట్టివారో? సారాయి, కాపీనీళ్ళు, తేయాకు నీళ్ళు, త్రాగుటకును పొగాకుపయోగించుటకును బాలురకు నేర్పు పెద్దలు సర్వథా నింద్యులు. బాలుర పాలిటిశత్రువులు. శత్రులైన నింతటి కీడు చేయఁజాలరు.

ఈ దురభ్యాసములు దేశమునఁ బ్రబలుచున్నవి. తెలియక కొందఱు చెడుచున్నారు. చెడినపిమ్మటఁ దెలిసికొనియు బాగుపడఁగోరియు నభ్యాస

పిశాచమునుండి తప్పించుకొనుటకు మనోదార్ఢ్యములేక యనేకులు పరితపించుచున్నారు. కొందఱు తాఁజెడ్డక్రోఁతి వనమెల్లఁ జెఱిచినట్లు పరులను జెఱుచుచున్నారు.

కాఫీనీళ్లు, తేయాకునీళ్ళు నీ కభ్యాసములేదని తెలియును. పొగాకు నీకభ్యాసము లేకున్నను దాని నుపయోగించువారివలనఁ గొంతదోషము నీకు సంక్రమించుచున్నది. మీ యిల్లు పదుగురు వచ్చుపోవుస్థలము. కొందఱు పొగచుట్టలు పీల్చుచు నంగడిలోకివచ్చి యింటిలోని నిర్మలవాయువు నంతయుఁ జెఱుతురు. ఆ గాలి పీల్చుటవలన మీయారోగ్యము చెడును. ఇంటికి వచ్చినవారి నాక్షేపించుట మర్యాదకాదు. కావున మీఁద నాంగ్లభాషలో వ్రాసినదానిని అచ్చువేయించి వాకిటి తలుపున కంటించి "Smoking within the premises is strictly prohibited" ఈ యావరణములో నెవరును పొగచుట్టలు త్రాగరాదు. అని పలకపైఁ బెద్దయక్షరములతో వ్రాయించి యంటించినయెడలఁ బెద్దమనుష్యులగు వారు త్రాగుచు లోపలికి రారు. చిల్లరమనుష్యులు వచ్చిరా వెలుపలఁ బొమ్మనవచ్చును. అచ్చువేసినది చదువుకొని బాగుపడెడివారు పడనీ. ఇట్లుచేసిన మీరు బాగుపడుటేకాక కొందఱనైన బాగుపఱిచినవారగుదురు. ఆ పుణ్యము మీకుఁ గలుగును.

నీకు హానికరములైనవానిని జెప్పితిని. నీవు బాగుపడవలయునని యెంత ప్రయత్నము చేసినను వీనిని తొలఁగించినఁగాని బాగుపడవు. నీ దేహారోగ్యమును గాపాడు కొనవలేవు. మనస్సును స్వస్థముగ నుంచుకొనలేవు. పొలములో గడ్డిగాద మప్రయత్నముగ మొలచునట్లు మనుష్యులకుఁ జెడుగుణములు తమంతఁ దామే పట్టుపడును. ఫలవృక్షములుపైరులు నాటినఁ గాని మొలవవు. పెంకి పైచువఱకుఁ దక్కినవి వృద్ధికి రావు. కావున విశేషప్రయత్నముచే దుర్గుణముల నెల్లఁ దొలఁగించుకొని సద్గుణముల నభివృద్ధి చేసికొనవలయును.

ఇంక నిన్ను బాగుపఱుచు మంచిగుణములం జెప్పెదను. ప్రయోజన ముద్దేశింపక మందుఁడును బ్రవర్తింపఁడు కావున జన్మోద్దేశమేమియో సదా స్మరించుకొని యా యుద్దేశము నెఱవేర్చుకొనుము. పరీక్షకై చదువునపుడు నీవు చదువునది వ్రాయునది యారోగ్యము కాపాడుకొనునది సర్వము దానికై యని యెట్లు తలంచి ప్రవర్తించెదవో యట్టులే నీవు చేయు కార్యములన్నియు జన్మము సార్థకము చేసికొనుటకే యనుట మఱవకుము. జన్మోద్దేశ మీదివఱకే చెప్పితిని. నీవు విద్య – ధనము – ఆరోగ్యము – కీర్తి – ప్రతిష్ఠ సంపాదించుట, సంతానము పడయఁగోరుట యవి యన్నియు ఆయుద్దేశ్యము సాధించుటకే. నడుమ నడుమ విఘ్నములు వచ్చినను భయపడరాదు. నిరుత్సాహివి కారాదు. తత్కాలమున మేలుగా నుండునది తోఁచిన దీనిని విడిచి దానికిఁబోరాదు. గుఱికొట్టు నేర్చుకొనువాఁ డెన్నిమార్లు తప్పిపోయి తుదకు జయించునో యాలోచింపుము.

2. న్యాయమార్గమున దేహకష్టము చేయుట యవమానకరమని యెంచకుము. దొంగతనముచేతను, లంచములు గొనుటచేతను, వేశ్యలవలె లంజెఱికముచేతను, (భార్యలమూలమున నుద్యోగములు సంపాదించువారుకలరు.) జూదములు చేతను సంపాదించు వేలకంటె కష్టించి సంపాదించు నాలుగణాలు మేలని తలంపుము.

3. కష్టమనిన భయపడకుము. కష్టించువాఁడే ఫలమనుభవించు వాఁడు. సోమరిపోతు భూమికి బరువుగ బ్రతుకును. ఆరోగ్యము, ధనము, విద్య, కీర్తి యివియన్నియుఁ గష్టము చేతనే సాధింపఁదగినవి. పురుష ప్రయత్నములేక యేకార్యమును గాదు. బుద్ధిమంతుఁడగు సోమరికంటెను, బుద్ధిహీనుఁడయ్యుఁ బాటుపడువాఁడే శ్రేష్ఠుఁడు. తాఁబేలు కుందేలుకథ తెలియునుగదా. ఓపిక యోర్పు గలిగి పాటుపడుము.

4. ఉదయమునకుముందే నిద్రలెమ్ము.

5. అల్పకార్యముల నలక్ష్యపఱుపకుము. ఆవగింజలు చేరిన గుమ్మడికాయంత యగును. అల్ప పరమాణువులచేతనే ప్రపంచ మేర్పడెననుట యెఱుఁగవా?

6. అహింసాదిగుణముల నభివృద్ధిపఱచుకొనుము.

7. మితభోజివి, మితభాషివి, మితవ్యయము గలవాఁడవు. మితభోగివి కమ్ము.

8. సజ్జనులతోడ స్నేహము చేయుము. వృద్ధసేవ శ్రేయస్కరము.

9. జరయు, మృతి లేనివారివలె ధనము విద్య సంపాదింపుము. ఆసన్న మృత్యువగు వానివలె ధర్మమున వానిని వినియోగింపుము.

10. సద్గ్రంథముల మాత్రమే చదువుము.

11. హానికరములుగాని వినోదముల వినోదింపుము.

12. అందఱకు (నీ విరోధులకును) మేలే కోరుము.

13. ఇంద్రియదాసుఁడవు గాకుము.

14. దైవభక్తి, మాతా పితృభక్తి, మాతృ దేశభక్తి, మాతృ భాషాభక్తి గలిగి సర్వదా ప్రవర్తింపుము.

15. భార్యనుదప్పఁ దక్కిన స్త్రీల నందఱను దల్లిదోడుల వలె భావించి చరింపుము.

16. ఎవరితోడను గలహింపకుము.

ఈ సద్గుణముల నభివృద్ధి చేసికొందువేని తప్పక క్షేమపడెదవు.

**శ్రీరామార్పణమస్తు**

* * *